సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 190

సోమవారం 30-9-2024

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'




'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభం

బెంగళూరులో ఎన్సీపీ స్థానంలో కొత్తగా జీసీఈ ఏర్పాటు -12లో



వాత్సల్యానికి సమయమిదే!

పిల్లలకు 'పింఛను' బహుమానం. కొత్తగా ఎన్పీఎస్ వాత్సల్య పథకం -13లో



మోదీని దించేదాకా పోను

ప్రధాని మోదీని అధికారం నుంచి దింపేదాకా క్రియాశీలక రాజకీయాల్లో కొనసాగుతానని కాంగ్రెస్ చీఫ్ ఖర్గే వ్యాఖ్యానించారు.

వివరాలు 6లో ▸



నబీల్ కౌక్ హతం

ఇజ్రాయెల్ దాడిలో లెబనాన్ మిలిటెంట్ గ్రూప్ హెజ్‌బొల్లా సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ హెడ్ నబీల్ కౌక్ హతమయ్యాడు.

వివరాలు 6లో ▸



అభినవ రాహు కేతువులు!

శాస్త్రవేత్తలు కృత్రిమ రాహు కేతువుల సాయంతో కావాల్సినప్పుడల్లా సూర్య గ్రహణాలు సృష్టించే పనిలో పడ్డారు.

వివరాలు 6లో ▸



పదేళ్ల 'మన్‌కీ బాత్'

'మసాలా వార్తలు, ప్రతికూల అంశాలపైనే ప్రజలు ఆసక్తి చూపుతారన్నది నిజం కాదని మన్‌కీ బాత్ నిరూపించింది' అని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

బియ్యం..మరింత ప్రియం



బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేతతో సన్నబియ్యం ధరలు ప్రియం కాబోతున్నాయి. అధికంగా వినియోగించే సన్న బియ్యం రకాలైన సోనా మసూరి, హెచ్ఎంటీ, జైశ్రీరాం, బీపీటీ రకాలు, తెలంగాణ సోనా వంటి బియ్యం ధరలు ప్రస్తుతం కిలో రూ. 60 నుంచి 70 ఉన్నాయి.

- వివరాలు 10లో▶

కృష్ణా బేసిన్‌లో 3,048 టీఎంసీల నీరు

కృష్ణానది బేసిన్‌లో 3,048.37 టీఎంసీల నీటి లభ్యత ఉన్నట్టు కేంద్ర జలసంఘం కొత్త అధ్యయనంలో తేల్చింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో 1985–86 నుంచి 2022–23 మధ్యకాలంలోని 38 ఏళ్ల ప్రవాహాల లెక్కల ఆధారంగా నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది.

- వివరాలు 10లో▶

కూల్చివేతలపై వెనక్కి!

ప్రజాగ్రహంతో పేదల ఇళ్ల జోలికి వెళ్లే విషయంలో ప్రభుత్వం పునరాలోచన

- దూకుడు తగ్గించి ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్న సర్కారు
- ప్రతిపక్షాల నిరసనలు, సొంత పార్టీలో ప్రతికూలత పరిగణనలోకి.. రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగులుతుందనే అభిప్రాయం
- ప్రస్తుతానికి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల వరకే పరిమితమయ్యే అవకాశం
- హైడ్రా గుర్తించిన వాణిజ్య భవనాలు, బడాబాబుల ఫామ్‌హౌస్‌లపై చర్యలు!
- సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోకుండా జాగ్రత్తలు
- మూసీ నిర్వాసితులకు పునరావాసంపై విస్తృత ప్రచారానికి నిర్ణయం
- డబుల్ బెడ్ రూం ఇళ్లపై ప్రత్యేక కార్యాచరణ దిశగా అడుగులు



మూసీ పరీవాహక ప్రాంతంలో బాధితులకు ధైర్యం చెబుతున్న హరీశ్‌రావు

మా ఇళ్లు కూల్చొద్దంటూ ప్లకార్డు పట్టుకున్న చిన్నారి

సాక్షి, హైదరాబాద్: హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రక్షాళన విషయాల్లో తీవ్ర ప్రజాగ్రహం వ్యక్తమవుతోన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెడ్ మార్కింగ్ పేరుతో మూసీపై చేస్తున్న హడావుడిని ప్రస్తుతానికి నిలిపివేయాలని, దూకుడు తగ్గించాలని సర్కారు పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. మూసీ ప్రక్షాళన పేరుతో తమ ఇళ్లను కూల్చివేస్తున్నారని, హైడ్రా ఏర్పాటు చేసి పెద్దల జోలికి వెళ్లకుండా దశాబ్దాలుగా నివాసముంటున్న తమపై ప్రభుత్వం జులుం ప్రదర్శిస్తోందంటూ పేదలు ఎక్కడికక్కడ నిరసనలకు దిగుతుండటంతో జాగ్రత్త పడాలని నిర్ణయించినట్లు తెలిసింది. చెమటోడ్చి సంపాదించుకున్న నివాసాలను నేలమట్టం చేసి తమ బతుకులను ప్రభుత్వం రోడ్డుపైకి తెస్తోందనే భావన సామాన్య ప్రజల్లో క్రమంగా బలపడుతుండడంతో ఆచితూచి ముందుకెళ్లాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రతిపక్షాలు కూడా హైడ్రా, మూసీ విషయాల్లో

మిగతా 2వ పేజీలో ▶

ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తే

ఊరుకోం

ప్రభుత్వానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

- మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోనున్న బాధితులకు బీఆర్ఎస్ పరామర్శ, ర్యాలీ
- హైదర్షాకోట్‌లో అధికారులు మార్కింగ్ చేసిన ఇళ్లను పరిశీలించిన హరీశ్, సబిత తదితరులు

2లో

బస్తీల జోలికి వెళ్లొద్దని ముందే చెప్పా

పేదల ఇళ్లు కూల్చడం సరికాదు: దానం

- హైడ్రా విషయంలో నిజనిర్ధారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరతా.. అక్రమ కట్టడాలను కూల్చాలని కేసీఆర్ చెప్పిన విషయాన్ని మర్చిపోయారా ?



116 కి.మీ. 80 స్టేషన్లు..

రెండో దశలో 6 మార్గాల్లో మెట్రో రైలు సేవల విస్తరణ

- ఐదు రూట్లకు సంబంధించిన డీపీఆర్‌లు త్వరలో కేంద్రానికి
- 40 కి.మీ. ఎయిర్‌పోర్ట్–ఫోర్త్ సిటీ డీపీఆర్‌పైనా ముమ్మర కసరత్తు
- ఎయిర్‌పోర్టు సమీపంలో 1.6 కిలోమీటర్ల మేర భూగర్భంలో మెట్రో లైన్ నిర్మాణం.. భూగర్భంలోనే ఎయిర్‌పోర్ట్ మెట్రో స్టేషన్
- కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా వెళ్లేలా ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌లో మార్పు
- మొత్తం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.32,237 కోట్లు
- రెండోదశ మెట్రోపై వివరాలు వెల్లడించిన ఎన్వీఎస్ రెడ్డి

3లో

అసమ్మతిపై కాంగ్రెస్ 'ఫోకస్'

వలస వచ్చిన నేతల నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి

- రంగంలోకి పీసీసీ అధ్యక్షుడు, ఇన్‌చార్జి మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి
- పీసీసీ కార్యవర్గం కుదింపు.. తగ్గనున్న వర్కింగ్ ప్రెసిడెంట్ల సంఖ్య
- జిల్లా పార్టీ అధ్యక్షులుగా కొందరు ఎమ్మెల్యేలు
- 4వ తేదీ నుంచి పీసీసీ చీఫ్ జిల్లాల పర్యటన ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వలస నేతల రాకతో క్షేత్రస్థాయిలో నివురు గప్పిన నిప్పులా ఉన్న అసమ్మతిపై అధికార కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి పెడుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల కారణంగా రాష్ట్రంలోని 20–25 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య సమన్వయం లోపించిందనే నిర్ణయానికి వచ్చిన పీసీసీ ఈ మేరకు కార్యాచరణ రూపొందిస్తోంది. టీపీసీసీ కొత్త చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ స్వయంగా ఇందుకోసం రంగంలోకి దిగనున్నారని తెలుస్తోంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఏఐసీసీ ఇన్‌చార్జి కార్యదర్శిల సమక్షంలో ఆయా నియోజకవర్గాల్లోని పాత, కొత్త నాయకులు, కేడర్‌ను పిలిపించి మాట్లాడాలని, వారి అభ్యంతరాలు, సమస్యలను తెలుసుకుని రెండు బృందాలు కలిసి పనిచేసేలా సమన్వయం చేయాలనే నిర్ణయానికి పీసీసీ చీఫ్ వచ్చారు. ఇప్పటికే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాల అసెంబ్లీ నేతలతో మాట్లాడిన ఆయన.. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, అక్కడి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన సరితాయాదవ్‌ల మధ్య సఖ్యత కుదిర్చారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది. ఈ నియోజకవర్గమే కాకుండా ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన నాయకులకు సంబంధించి పది అసెంబ్లీ నియోజకవర్గాలు, అసెంబ్లీ ఎన్నికలకు ముందు పార్టీలోకి వచ్చి ఎమ్మెల్యేలుగా పోటీ చేసి గెలిచిన మరో పది నుంచి పదిహేను అసెంబ్లీ నియోజకవర్గాల నేతలతో కూడా మాట్లాడి క్షేత్రస్థాయిలో కేడర్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని, ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తలనొప్పులు రాకుండా ముందే పరిస్థితిని సెట్ చేయాలని పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ నిర్ణయించారు.



సమర్థుల కోసం అన్వేషణ

పీసీసీకి కొత్త చీఫ్ నియమితులైన నేపథ్యంలో పాత కార్యవర్గం రద్దు కానుంది. ఈ నేపథ్యంలో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్లు, సీనియర్ ఉపాధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, అధికార ప్రతినిధులను కొత్తగా నియమించనున్నారు. అయితే, పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో జంబో కార్యవర్గం కాకుండా పదవుల సంఖ్యను తగ్గించే యోచనలో రాష్ట్ర నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఇదే విషయంపై ఏఐసీసీ పెద్దలతో చర్చించిన అనంతరం నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుతం గాంధీభవన్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం.. గతంలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు ఉండగా, ఇప్పుడు మూడుకు తగ్గించే అవకాశాలున్నాయి. సీనియర్ ఉపాధ్యక్షుల నియామకంపై పునరాలోచన చేయాలని, ఉపాధ్యక్ష పదవులు, ప్రధాన కార్యదర్శుల పదవుల్లో సీనియర్ నాయకులకు అవకాశమివ్వాలని యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈసారి టీపీసీసీ అధికార ప్రతినిధులను ఏరికోరి ఎంపిక చేయాలని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. ఇటు పార్టీతో పాటు అటు ప్రభుత్వ వాయిస్‌ను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగేలా మాట్లాడగలిగిన సమర్థుల కోసం అన్వేషిస్తున్నారు. దీంతో ఈసారి అధికార ప్రతినిధుల జాబితాలో కూడా భారీ మార్పులు జరుగుతాయని తెలుస్తోంది. ఇక, కొత్త పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఇటీవల విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ పార్టీకి డీసీసీ అధ్యక్షులే కీలకమని చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలోనే డీసీసీ అధ్యక్షుల మార్పు ఉండే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో పార్టీ ఎమ్మెల్యేలను జిల్లా పార్టీ అధ్యక్షులుగా నియమించనున్నారు. ఇక, కొత్త పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అక్టోబర్ 4వ తేదీ నుంచి జిల్లాల పర్యటనకు వెళ్లనున్నారు. తన సొంత జిల్లా అయిన నిజామాబాద్‌కు ఆయన ముందుగా వెళ్తారని, ఆ తర్వాత అన్ని జిల్లాల పార్టీ సమీక్షలు ముగించుకుని ఒక్కో జిల్లాకు వెళ్లి పార్టీ కేడర్‌కు మహేశ్‌గౌడ్ దిశానిర్దేశం చేస్తారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

మూసీ సుందరీకరణ ప్రజాహితం

నిర్వాసితులకు వసతి, ఉపాధి: మంత్రి పొన్నం



సిద్దిపేట జోన్: హైదరాబాద్ తెలంగాణకు గుండెకాయ లాంటిదని అలాంటి నగర మూసీనది సుందరీకరణ ప్రజాహితమని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూసీ పరీవాహక ప్రాంత ప్రజలను ఒప్పించి తరలించే ప్రక్రియ చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ నేతలు సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తున్నారని అలాంటి వారిని ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. గౌరవెల్లి, మల్లన్నసాగర్ విషయంలో అప్పటి ప్రభుత్వం అర్ధరాత్రి అరెస్టులు, కాల్పులు, పోలీసు దాడులతో ప్రతిపక్షాల గొంతు నొక్కిందన్నారు. అప్పటి ప్రభుత్వ తీరు తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉండవని స్పష్టం చేశారు. నిర్వాసితులకు డబుల్ బెడ్రూమ్, పిల్లలకు విద్యా వసతి, మహిళలకు మెప్మా ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించేలా వారందరినీ ఒప్పించి తరలిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు.

మూసీ సుందరీకరణ, హైడ్రా వేర్వేరు...

మూసీ సుందరీకరణ ద్వారా ప్రజలను రోడ్డు పాలు చేసే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం లేదన్నారు. మూసీ, హైడ్రా వేర్వేరు అని వాటిని ఒకే కోణంలో చూడొద్దని పొన్నం సూచించారు. 'హైడ్రా బాంబ్'అని మాజీమంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. మూసీ అంశంలో బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌ల జోలికి వెళ్లడం లేదని స్పష్టం చేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ ప్రక్రియ గూర్చి మంత్రి స్పందిస్తూ పార్టీ కోసం పనిచేసిన వారికి భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేస్తామన్నారు.

నేడు బీజేపీ రైతు దీక్ష



సాక్షి, హైదరాబాద్: రైతులకు ఇచ్చిన హామీల అమలు కోసం ఈనెల 30వ తేదీ ఉదయం 11 గంటల నుంచి అక్టోబర్ 1 ఉదయం 11 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద రైతుదీక్ష చేపడుతున్నట్లు మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ తెలిపారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు దీక్షలో బీజేపీకి చెందిన పార్లమెంట్ సభ్యులతో పాటు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులంతా పాల్గొంటారని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ప్రభుత్వం మెడలు వంచి ఒత్తిడి తీసుకొచ్చేందుకే ఈ కార్యక్రమమన్నారు. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి.. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, ఖర్గే సమక్షంలో 6 గ్యారంటీలు ఇచ్చారని, రైతుల కోసం రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, 500 రూపాయల బోనస్, కౌలు రైతులకు రైతుబంధు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. అధికారంలోకి వచ్చాక అన్నింటినీ అటకెక్కించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం ప్రజలను, రైతాంగాన్ని మోసం చేస్తుందని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.



నెక్ట్స్ సీఎం అభ్యర్థి రెడీగా ఉన్నారనే ధైర్యంతోనే అలా అన్నారా సార్!

ప్రజల్ని భయభ్రాంతుల్ని చేస్తే ఊరుకోం

రాష్ట్ర ప్రభుత్వానికి మాజీమంత్రి హరీశ్‌రావు హెచ్చరిక

- మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోనున్న బాధితులకు బీఆర్‌ఎస్ పరామర్శ, ర్యాలీ
- హైదర్షాకోట్‌లో అధికారులు మార్కింగ్ చేసిన ఇళ్లను పరిశీలించిన హరీశ్, సబిత తదితరులు



మూసీ బాధితుల గోడు వింటున్న బీఆర్‌ఎస్ నేతలు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి తదితరులు

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని.. ప్రజల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గంధంగూడ, బైరాగిగూడ మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఆ పార్టీ నేతలు ఆదివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, గంగుల కమలాకర్, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు మాలతీనాగరాజ్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశాల్ నగర్ కాలనీ నుంచి కేంద్రీయ విహార్ వరకు ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్రీయ విహార్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్‌రావు మాట్లాడారు.

ఫోన్ చేయండి.. అరగంటలో మీ ముందుంటా

మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు అండగా నిలుస్తామని హరీశ్‌రావు చెప్పారు. 'ఆపదొస్తే ఫోన్ చేయండి... అర్ధ గంటలో మీ ముందుంటా. బుల్డోజర్లు వచ్చినా, జేసీబీలు వచ్చినా ముందు మమ్మల్ని దాటాలి' అని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ తీరుపై విరుచుకుపడ్డారు. 'బలిసినోళ్లకు దగ్గరుండి ఇళ్లు కట్టిస్తున్నావ్.. పేదల ఇళ్లను మాత్రం కూలగొడుతున్నావ్. ఇదెక్కడి న్యాయం? రేవంత్‌రెడ్డి.. నీ ప్రభుత్వ జీవితకాలం ఐదేళ్లు మాత్రమే. కానీ నువ్వు కూలగొట్టే పేదల ఇళ్లు వారి జీవితకాలం కల'అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొడంగల్‌లోని సీఎం ఇల్లు రెడ్డికుంటలో ఉందని.. ఆ ఇంటిని రేవంత్ ముందుగా కూలగొట్టాలని డిమాండ్ చేశారు. సీఎం బయటకొచ్చి బాధితులకు భరోసా ఇవ్వాలని.. మూసీ సుందరీకరణను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు ఇబ్బందులు వస్తే తెలంగాణ భవన్‌కు రావాలని... అర్ధరాత్రి వచ్చినా బాధితులకు ఆశ్రయం ఇస్తామని.. ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని సూచించారు.

బడి పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడం ప్రాధాన్యత కాదా?

ఎస్సీ, బీసీ హాస్టల్స్‌లో పేద పిల్లలకు అన్నం పెట్టేందుకు డబ్బుల్లేవంటున్న ప్రభుత్వం.. మూసీ సుందరీకరణ కోసం రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తానంటే ప్రజలు నమ్మరని హరీశ్‌రావు పేర్కొన్నారు. పేద పిల్లలకు బుక్కెడు బువ్వ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతా లేక రూ. లక్షన్నర కోట్లు ఖర్చు చేసి మూసీ సుందరీకరణ చేపట్టడం ప్రాధాన్యతో సీఎం చెప్పాలన్నారు. కొన్ని పాఠశాలల్లో ఆడ పిల్లలకు టాయిలెట్స్ లేక వందల మంది లైన్లలో నిలబడుతున్నారని.. వారి కోసం టాయిలెట్స్ కట్టడం ప్రభుత్వ ప్రాధాన్యత కాదా? అని ప్రశ్నించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో గాంధీ ఆస్పత్రికి మందుల సరఫరా నిలిచిపోయిందని.. దీంతో రోగులకు మందులు లేక అవస్థలు పడుతున్నారన్నారు. కానీ సీఎం మాత్రం సుందరీకరణ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఫార్మాసిటీ కోసం గత కేసీఆర్ ప్రభుత్వం 15 వేల ఎకరాల భూసేకరణ చేస్తే దాన్ని పక్కనపెట్టి రియల్ ఎస్టేట్ బ్రోకర్ సాయంతో ఫోర్త్‌సిటీ నిర్మిస్తానని సీఎం అంటున్నారని విమర్శించారు.

కూల్చివేతలపై వెనక్కి!

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టడం, పేదలు.. మధ్యతరగతి వారి ఇళ్ల కూల్చివేతలపై తీవ్ర నిరసన వ్యక్తం చేయడం, సొంత పార్టీలో సైతం కొంత ప్రతికూలత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రస్తుతానికి వెనక్కు తగ్గాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. అన్ని కోణాలను బేరీజు వేసుకుంటూ ముందుకెళ్లాలని భావిస్తున్నట్టు సమాచారం.

పేదలను ఒప్పించి, మెప్పించాకే..

మూసీ నదిపై ఉన్న ఆక్రమణల తొలగింపు రాజకీయంగా వివాదాస్పదయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే వారితో మాట్లాడి పునరావాస ప్యాకేజీపై వారిని ఒప్పించి మెప్పించాలని, దీనిపై విస్తృత ప్రచారం చేయాలని, ఆ తర్వాతే అడుగులు ముందుకేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతానికి చెరువుల ఆక్రమణలు, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల వరకే కార్యాచరణను పరిమితం చేయాలని, హైడ్రా గుర్తించిన వాణిజ్య భవనాలు, బడాబాబుల ఫామ్‌హౌస్‌లపై చర్యలు తీసుకోవడం ద్వారా సామాన్య, మధ్య తరగతి ప్రజల్లో వ్యతిరేకత తీవ్రం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం.

రుణాలపై బ్యాంకర్లతో సంప్రదింపులు

మూసీ నిర్వాసితులకు కల్పించే పునరావాసంపై విస్తృత ప్రచారం చేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ పెద్దలు కూడా అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు బాహాటంగానే మాట్లాడుతుండటం గమనార్హం. పేదల ఇళ్లు కూల్చాల్సి వస్తే వారికి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామని, పరిహార ప్యాకేజీని అమలు చేస్తామని, బ్యాంకర్లతో రుణాలిప్పిస్తామంటూ హామీ ఇవ్వాలని వారు సూచిస్తున్నారు. పీసీసీ కూడా దీనిపై ఒక నివేదిక ఇవ్వాలని భావిస్తోంది. వీటితో పాటు, ముఖ్యంగా పునరావాసంపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించకుండా ముందుకెళ్లడం మంచి కన్నా ఎక్కువగా చెడు చేస్తుందని, రాజకీయంగా కోలుకోలేని దెబ్బ తగులుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్న నేపథ్యంలో దీనిపై ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం రూపొందించనున్నట్లు తెలిసింది. రుణాల విషయంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను సమాయత్తం చేస్తున్నట్టు సమాచారం. అమెరికా పర్యటనలో ఉన్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడిన సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు కూడా ఇదే కోణంలో వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

చెరువులో భవనాన్ని హైడ్రా కూల్చలేదు

కమిషనర్ రంగనాథ్



సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి మల్కాపూర్ చెరువులో భవనాన్ని (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) కూల్చివేయలేదని హైడ్రా కమిషనర్ ఆవుల వెంకట రంగనాథ్ స్పష్టం చేశారు. అక్కడ గాయపడిన హోం గార్డ్ ఆరోగ్యం మెరుగుపడుతోందని చెప్పారు. రహదారుల విస్తరణ కోసం కూల్చివేతలు జరిగినా.. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కూల్చివేతలు జరిగినా హైడ్రా చేసినట్టు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. హైడ్రాను అప్రతిష్టపాల్జేసేందుకు దాని పనిని అడ్డుకునేందుకు కొంతమంది చేస్తున్న ప్రయత్నాల్లో ప్రజలు ఎవరూ పావులు కావొద్దని కోరారు. వాస్తవాలు తెలుసుకోకుండా హైడ్రాపై అసత్య వార్తలు ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైడ్రా పరిధి కేవలం ఔటర్ రింగ్ రోడ్డు వరకేనన్న విషయాన్ని ప్రజలందరూ గుర్తించాలని ఆదివారం మీడియా ద్వారా రంగనాథ్ విజ్ఞప్తి చేశారు.

రూ.5వేలు ఇచ్చి మాట్లాడిస్తున్నారు

మూసీపై సీఎంకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు

- పేదలను నిలబెట్టాలనుకుంటున్నాం.. పడగొట్టడం మా ఉద్దేశం కాదు
- ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు... పునరావాసం కోసం హైలెవల్ కమిటీ
- మూసీ, హైడ్రా విషయంలో కలెక్టరేట్‌లలో హెల్ప్‌డెస్క్‌లు: మంత్రి డి.శ్రీధర్‌బాబు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: అవకాశవాద శక్తులు మూసీ ప్రక్షాళన విషయంలో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నాయ ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆరోపించారు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ మొసలికన్నీరు కారుస్తోందని, భూతద్దంలో పెట్టి చూపించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఇందుకోసం రూ.5వేలు ఇచ్చి సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలను నిలబెట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, పడగొట్టాలన్నది కాదని స్పష్టం చేశారు. మూసీ నిర్వాసితులను కడుపులో పెట్టుకొని చూసుకుంటామన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో చెరువులు, మూసీ ఆక్రమణలను తొలగిస్తున్నామని, ఇందులో నిర్వాసితులందరికీ న్యాయం చేస్తామని, వారిని కాపాడుకునే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. 35 బృందాలతో సామాజిక, ఆర్థిక సర్వే చేయిస్తున్నామని, వాక్‌టూ వర్క్ పద్ధతిలో నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారన్నారు. పునరావాసం కోసం హైలెవల్ కమిటీ పనిచేస్తుందని చెప్పారు. రివర్‌బెడ్‌లోని నివాసాలకు భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇస్తామని, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి ఆరేళ్లు చదివిస్తామని, మహిళలకు వడ్డీ లేని రుణాలిప్పిస్తామని చెప్పారు. మూసీకి సంబంధించిన మాస్టర్‌ప్లాన్ బ్లూ ప్రింట్ తయారు చేశామని, పనులు పారదర్శకంగా చేపడతామని, అంతర్జాతీయ గుర్తింపు ఉన్న సంస్థలకే పనుల బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. మూసీ, హైడ్రా విషయంలో అనుమానాల నివృత్తికి అన్ని కలెక్టరేట్లలో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాట్లాడే నైతికహక్కు లేదు

భూనిర్వాసితుల విషయంలో మాట్లాడే హక్కు బీఆర్‌ఎస్‌కు లేదని మంత్రి శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసిందో అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. పేదలు, మధ్యతరగతి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడబోదని చెప్పిన శ్రీధర్‌బాబు అడ్డగోలుగా అనుమతులిచ్చిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని, అడ్డంకులు సృష్టించాలనుకునే బీఆర్‌ఎస్ ప్రయత్నాలను నమ్మొద్దని కోరారు. హైడ్రా విషయంలో ఎవరైనా ఒక్కటేనని, సీఎం రేవంత్ సోదరుడికి కూడా నోటీసులిచ్చామని గుర్తు చేశారు. తాము భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని ఆదర్శవంతమైన కార్యక్రమంతో ముందుకెళుతుంటే రాజకీయ కక్షపూరిత వైఖరితో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్న విషయాన్ని ప్రజలు గమనించాలని మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

పేదల పేరుతో బిల్డర్ల దందా

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- ప్రజల ధనం, ప్రాణాలు కాపాడటం మా ప్రభుత్వ బాధ్యత
- మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పిల్లలకు చదువు, ఆరోగ్య సౌకర్యాలు



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి

సాక్షి, హైదరాబాద్: కొందరు బిల్డర్లు పేదలను అడ్డం పెట్టి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రజల ధనం, ప్రాణాలు కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యత అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అందులో భాగంగానే చెరువులను రక్షించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. మూసీ నదిలో మంచి నీరు పారించడం, పార్కులు నిర్మించడం తమ ప్రభుత్వం ఆలోచన అని వివరించారు. హైదరాబాద్‌లో మూసీ నది పునర్జీవ కార్యక్రమంలో భాగంగా నిర్వాసితులకు పూర్తి అవగాహన కలిపించి, పునరావాస చర్యలు చేపడుతున్నామని భట్టి పేర్కొన్నారు. వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పిల్లలకు విద్యా సదుపాయాలతో పాటు నిర్వాసితుల ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు చేపట్టడం, వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడటమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. మూసీ పరీవాహకంలో ప్రజలు ఆరోగ్యంగా జీవించేందుకు అనువుగా ఆ నదిని తీర్చిదిద్దాలనేది ప్రభుత్వం ఆలోచన అన్నారు. కలుషితమైన మూసీ నది పక్కన జీవించడం ఎవరికీ కూడా మంచిది కాదన్నారు. అమెరికాలోని కాలిఫోర్నియాలో ఆదివారం సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. హైదరాబాద్ అంటేనే రాళ్లు, చెరువులు, పార్కులని.. అయితే పెద్ద ఎత్తున ఇళ్ల నిర్మాణంతో చాలా చోట్ల రాళ్లు కనుమరుగైపోయాయని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో చెరువులు, పార్కులు కబ్జా చేసి కొందరు ఇళ్లు కట్టుకుంటున్నారని, అలాగే కబ్జాల కారణంగా చెరువులు కనుమరుగయ్యాయని పేర్కొన్నారు. ఇటీవల విజయవాడ వరద ముంపునకు గురైనట్టు హైదరాబాద్‌కు వైపరీత్యాలు పొంచి ఉన్నాయన్నారు.

స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చాం

ఫ్యూడల్ మనస్తత్వంతో కొంతమంది రాష్ట్రాన్ని బందీగా చేశారని, అయితే తమ ప్రభుత్వం వచ్చాక పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చామని, భవిష్యత్తులోనూ ఈ విధానం కొనసాగుతుందని భట్టి విక్రమార్క అన్నారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలని, తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ఆయన కోరారు.

రూ.లక్షన్నర కోట్ల 'మూసీ'కి లక్షల జీవితాలు బలి

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సీఎం రేవంత్ తీరును ఎండగడుతూ వాగ్బాణాలు
- సోషల్ మీడియా 'ఎక్స్'వేదికగా వరుస పోస్టులు




సాక్షి, హైదరాబాద్: 'రూ. లక్షన్నర కోట్ల మూసీ ధనదాహానికి బలవుతున్న జీవితాలు లక్షల్లో ఉన్నాయి మిస్టర్ చీఫ్ మినిస్టర్' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డిని నిందిస్తూ ప్రముఖ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో ఆదివారం సుదీర్ఘ పోస్ట్ చేశారు. 'గుండెలు పగిలి గూళ్లు చెదిరి ఆడబిడ్డల ఆవేదనతో, ఇంటి పెద్దల శాపనార్థాలతో నగరం రోదిస్తోంది. రెక్కలు ముక్కలు చేసి కలల కుటీరాలను నిర్మించి కన్నబిడ్డలకు ఇవ్వలేకపోతున్నానని ఓ తల్లి... అమ్మ లాంటి ఇల్లు వదిలి వేరే దిక్కుకు ఎలా పోతామని మరో తండ్రి గుండెలు బాదుకుంటున్నారు. ఆడబిడ్డకు కట్నంగా ఇచ్చే ఇల్లు కూలుస్తారేమోనని ఓ తల్లిఆత్మహత్య చేసుకుంది. భార్య కడుపుతో ఉందన్నా కనికరించరా? అని ఓ భర్త ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. నాడు రైతుల ప్రయోజనం కోసం 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే రిజర్వాయర్ నిర్మాణం విషయంలో 20 కార్లతో రైతులను రెచ్చగొడుతూ శవాలపై పేలాలు ఏరుకున్న సన్నాసి ఇప్పుడు ఎక్కడ పన్నావ్? నాడు అలా – నేడు ఇలా.. నీ అవసరానికి ఎంత నీచానికైనా తెగిస్తావని మరోమారు నిరూపించావ్'అని సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రజలు అధైర్యపడి ప్రాణాలు తీసుకోవద్దని.. కోర్టులు, బీఆర్‌ఎస్ అండగా ఉంటాయని ధైర్యం చెప్పారు.

బావమరిదితో నోటీసు ఇప్పిస్తే..

అమృత్ టెండర్ల అంశంలో తాను చేసిన ఆరోపణలపై సీఎం రేవంత్ బావమరిది సృజన్‌రెడ్డి లీగల్ నోటీసులు పంపడాన్ని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 'బావ మరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడుడు బంద్ చేస్తానని అనుకుంటున్నావా? బావమరిదికి అమృతం పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోము'అని వ్యాఖ్యానించారు. సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న మున్సిపల్ శాఖలోనే ఆయన బావమరిది శోధ కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్టబెట్టింది నిజమన్నారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు 7, 11, 13ని సీఎం ఉల్లంఘించారని ఆరోపించారు. శోధ గత రెండేళ్లుగా కేవలం రూ. 2 కోట్ల లాభాన్నే ఆర్జించిన ఓ చిన్న కంపెనీ అన్నారు. 'ఢిల్లీలో ఉన్న నీ బీజేపీ దోస్తులు కూడా నిన్ను కాపాడటం కష్టమే. నీకు ఆదర్శ్ కుంభకోణంలో అశోక్ చవాన్‌గా దొరికావు.. రాజీనామా తప్పదు' అని పోస్ట్ చేశారు.

బస్తీల జోలికి వెళ్లొద్దని ముందే చెప్పా



పేదల ఇళ్లు కూల్చడం సరికాదు: ఎమ్మెల్యే దానం

- హైడ్రా విషయంలో నిజనిర్ధారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరతా
- గతంలో అక్రమ కట్టడాలను కూల్చాలని కేసీఆర్ చెప్పిన విషయాన్ని మర్చిపోయారా?

బంజారాహిల్స్(హైదరాబాద్): నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో హైడ్రా కూల్చివేతలపై ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పందించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. హైడ్రా వచ్చిన తొలి రోజుల్లోనే తాను జూబ్లీహిల్స్‌లోని నందగిరిహిల్స్ గురుబ్రహ్మనగర్ బస్తీలో గుడిసెలు కూలుస్తుంటే వ్యతిరేకించానని, ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యంత్రాంగం 'హైడ్రా' పేదల గుడిసెల జోలికి రావొద్దని స్టేట్‌మెంట్ ఇచ్చానని చెప్పారు. దానికి తనపై తానేదో కబ్జా చేస్తున్నట్టు విష ప్రచారం చేశారన్నారు. 20–30 సంవత్సరాలుగా చుక్కనీరు రాని బఫర్‌జోన్ ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారి తరఫున తాను మాట్లాడతానని, వారికి అక్కడే పునరావాసం కల్పించే విధంగా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతానని తెలిపారు. ఇప్పటికే తాను సలహాదారులతోపాటు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, ప్రభుత్వ ముఖ్యులతో ఈ విషయాన్ని చర్చించానన్నారు. మూసీ ప్రక్షాళన మాత్రం జరగాల్సిందేనని, గతంలో మూసీకి వరదలు వచ్చినప్పుడు గౌలిగూడ బస్టాండ్, పరిసర ప్రాంతాలు మునిగి బీభత్సమైన వాతావరణాన్ని చూశామని, ఎప్పటికైనా మూసీ పరీవాహక ప్రాంతం ప్రమాదకరమేనని చెప్పారు. హైడ్రా విషయంలో నిజనిర్ధారణ కమిటీ వేయాలని ప్రభుత్వాన్ని కోరతానన్నారు. గత ప్రభుత్వ హయాంలో సోషియో ఎకనామిక్ సర్వే చేసి మూసీ పరీవాహక ప్రాంతంలో 10 వేల ఇళ్లు ఉన్నట్టు గుర్తించిన విషయం వాస్తవం కాదా అని ప్రతిపక్ష నేతలను ప్రశ్నించారు. అక్రమ కట్టడాలను కూల్చివేయాలని నాటి సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయాన్ని మర్చిపోయారా అని నిలదీశారు. కేటీఆర్ ఆయన మంత్రిగా ఉన్నప్పుడు పార్క్‌హోటల్ పక్కన చెరువు శిఖం భూమిలో ఉన్న స్థలంలోని తన మిత్రుడు, బినామీ ప్రదీప్‌కు 10 అంతస్తుల వరకు, శోభ బిల్డర్స్‌కు 14 అంతస్తుల వరకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని చెప్పారు. హరీశ్‌రావు శవాల మీద పేలాలు ఏరుకునే రాజకీయాలు చేస్తున్నారన్నారు. సమావేశంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత, కాంగ్రెస్ నేతలు మామిడి నర్సింగ్‌రావు, రాములు చౌహాన్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఈడీ అదుపులో 'సాహితీ' లక్ష్మీనారాయణ!



సాక్షి, హైదరాబాద్: ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో ప్రజల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డ కేసులో సాహితీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆయన్ను ఆదివారం మధ్యాహ్నం విచారణకు పిలిచిన అధికారులు.. సరైన ఆధారాలు అందించకపోవడంతోపాటు విచారణకు సహకరించకపోవడం వల్లే ఈ చర్య చేపట్టినట్లు తెలియవచ్చింది. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో రూ. 161 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

భర్తతో గొడవపడి.. బిడ్డతో దూకి..

18వ అంతస్తు పైనుంచి దూకి మూడేళ్ల కుమార్తెతో సహా ఆత్మహత్య

మణికొండ (హైదరాబాద్): భర్తతో గొడవపడి క్షణికావేశంలో కుమార్తెతో కలిసి ఒక మహిళ 18వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మైహోం అవతార్ అపార్ట్‌మెంట్స్‌లోని బ్లాక్-10లోని ఫ్లాట్‌నెంబర్ 3006లో ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలివి. మైహోం అపార్ట్‌మెంట్ 18వ అంతస్తులో ఉంటున్న భార్యాభర్తలు ఆదివారం రాత్రి గొడవపడ్డారు. దీంతో భార్య మానస (30) క్షణికావేశంలో తన కుమార్తె కృషి (3)తో కలిసి బాల్కనీ పైనుంచి కిందకు దూకింది. ఈ ఘటనలో ఇద్దరి తలలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త రాజు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నారు.

సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్

ఒక్కొక్కరికి రూ.93,750 చెల్లించనున్న కోలిండియా యాజమాన్యం



సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు దీపావళి బోనస్ (పీఎల్ఆర్) కింద రూ.93,750 చెల్లించేందుకు కోలిండియా యాజమాన్యం అంగీకరించింది. ఏటా కోలిండియా అనుబంధ బొగ్గు ఉత్పత్తి సంస్థల కార్మికులకు దీపావళి బోనస్ చెల్లిస్తారు. గతేడాది రూ.85,500 చెల్లించిన యాజమాన్యం ఈ ఏడాది మరో రూ.8,750, పెంచి రూ.93,750 వేలు చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఆదివారం ఢిల్లీలో కోలిండియా యాజమాన్యంతో జాతీయ కార్మిక సంఘాలు జరిపిన చర్చల్లో ఈ మేరకు ఒప్పందం కుదిరింది. చెల్లింపు తేదీని సింగరేణి యాజమాన్యం ప్రకటించాల్సి ఉంది. దీనివల్ల సంస్థలోని 39,600 మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది. కాగా బోనస్‌ను సింగరేణి కార్మికులకు దీపావళి ముందు చెల్లిస్తుండగా, ఇతర బొగ్గు పరిశ్రమల కార్మికులకు దసరా ముందే చెల్లిస్తారు.

'అడిషనల్ డీఎంఈలను రెగ్యులర్ పద్ధతిలో నియమించాలి'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అడిషనల్ డీఎంఈలను ఇన్‌చార్జులుగా కాకుండా, రెగ్యులర్ పద్ధతిలో నియమించాలని తెలంగాణ ప్రభుత్వ బోధనా వైద్యుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదల డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల బోధనా సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాదల మాట్లాడుతూ, పెరిఫెరల్ మెడికల్ కాలేజీల అలవెన్స్ త్వరగా అమలు చెయ్యాలని, బది లీలపై ఒక విధానాన్ని తీసుకువచ్చి రెగ్యులర్‌గా చెయ్యాలన్నారు. శాశ్వత ప్రాతిపదికన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను త్వరగా నియమించాలని, పాత కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిన కాకుండా పెరిఫరిలో పని చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. మెడికల్ కాలేజీలలో పనిచేసే వైద్యులకు ప్రత్యేక జాబ్ చార్ట్ రూపొందించాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్యాజువాలిటి సేవలకు వినియోగించకూడదని చెప్పారు. బోధనా వైద్యులకు కేటాయించిన సెలవులను వాడుకునే వెసులుబాటు ఉండాలన్నారు. ఆసుపత్రుల అడ్మినిస్ట్రేటర్లు మెడికల్ యూనియన్ నాయకులను టార్గెట్ చేయకూడదని డిమాండ్ చేశారు.

'స్కిల్'.. ఫుల్



- కీలకంగా తక్షణ ఉపాధి లభించే నైపుణ్య కోర్సులు
- యూనివర్సిటీల నిపుణులతో స్కిల్స్ వర్సిటీ సంప్రదింపులు
- డిగ్రీ, బీటెక్‌లో చేరే వారికి ముందుగా 3 నుంచి 6 నెలల సర్టిఫికెట్ కోర్సులు
- పలు కోర్సులు సూచించిన ఓయూ, జేఎన్‌టీయూహెచ్ తదితర వర్సిటీలు
- ప్రతి కోర్సుకు 12 నుంచి 30 క్రెడిట్స్ ప్రతిపాదన

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ, బీటెక్ తర్వాత తక్షణ ఉపాధి లభించే కోర్సుల వైపు అడుగులు పడుతున్నాయి. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన నైపుణ్య విశ్వవిద్యాలయం దీనిపైనే దృష్టి పెట్టింది. నైపుణ్యం అందించే కోర్సులపై పలు యూనివర్సిటీల నిపుణులతో ఆరా తీసింది. ప్రైవేటు బిజినెస్ స్కూల్స్ కూడా స్కిల్ కోర్సులపై సమగ్ర నివేదికలు రూపొందిస్తున్నాయి. మరోవైపు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆమోదించిన స్కిల్ కోర్సుల వైపు రాష్ట్రంలోని వర్సిటీలు, స్కిల్స్ వర్సిటీ ప్రత్యేక అధ్యయనం చేపట్టాయి. ఇప్పటికే కొన్ని నైపుణ్య కోర్సులను ఉన్నత విద్యా మండలి (హెచ్ఈసీ) గుర్తించింది. డిగ్రీ స్థాయిలో వీటి కాంబినేషన్‌తో కోర్సులు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ఉపాధి లభించే కోర్సులను పెద్ద ఎత్తున ప్రచారంలోకి తీసుకొచ్చేందుకు అవసరమైన కసరత్తు ముమ్మరం చేశామని హెచ్ఈసీ చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి 'సాక్షి'కి తెలిపారు. యూజీసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వీటిని ముందుకు తీసుకెళ్ళాల్సిన అవసరం ఉందన్నారు.

కోర్సులివీ.. వర్సిటీలు ప్రతిపాదిస్తున్న సర్టిఫికెట్ కోర్సుల్లో..మెషీన్ లెర్నింగ్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఏఐ అండ్ రోబోటిక్స్, ఐవోటీ.. ఇండస్ట్రియల్ ఐవోటీ, స్మార్ట్ సిటీస్, డేటాసైన్స్ అండ్ అనలిస్ట్, క్లౌడ్ కంప్యూటింగ్ వర్చువల్ రియాలిటీ, అగ్మెంటెడ్ రియాలిటీ అండ్ ఎక్స్‌టెండెడ్ రియాలిటీ, సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్, 5జీ కనెక్టివిటీ, డిజిటల్ ఫ్లూయెన్సీ..డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ వంటివి ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఆటోమేషన్ అండ్ రోబోటిక్స్ ప్రాసెస్ ఆటోమేషన్, ఎలక్ట్రానిక్స్ సిస్టమ్ డిజైన్స్, వీఎల్ఎస్ఐ డిజైన్స్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, బేసిక్ కోడింగ్ ఇన్ కంప్యూటింగ్ లాంగ్వేజెస్, మెకట్రానిక్స్ వంటి కోర్సులను కొన్ని వర్సిటీలు సూచించాయి. ఆర్కిటెక్చరల్ డ్రాఫ్టింగ్, బేసిక్ 3డీ డిజైన్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, 3డీ ప్రింటింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మొబైల్ కమ్యూనికేషన్, మొబైల్ రిపేరింగ్ అండ్ బేసిక్స్ ఆఫ్ డీటీహెచ్ ఇన్‌స్టాలేషన్, డిజిటల్ మార్కెటింగ్, హెల్త్ అండ్ వెల్‌నెస్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్యాషన్ డిజైన్ తదితరాలు కూడా ఉన్నాయి. వీటన్నిటినీ ఆయా రంగాల్లో నిపుణులు బోధించేలా చూడాలని సూచించాయి. యోగిక్ సైన్సెస్, సాఫ్ట్ స్కిల్స్, బేసిక్స్ ఆఫ్ స్టార్టప్స్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్స్‌లో స్టార్టప్స్‌లో విజయం సాధించిన నిపుణుల భాగస్వామ్యాన్ని సూచిస్తున్నాయి. ప్రతి కోర్సుకు 12 నుంచి 30 క్రెడిట్స్ ఇవ్వాలని తెలిపాయి.

స్కిల్స్ వర్సిటీ ఆరా

స్కిల్స్ యూనివర్సిటీ అధికారులు నైపుణ్య కోర్సులపై ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష చేపట్టారు. డిగ్రీ, బీటెక్ విద్యార్థులు పట్టాలతో మార్కెట్లోకి వస్తున్నా, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యం ఉండటం లేదని గుర్తించారు. ఇంటర్ ఉత్తీర్ణులై, డిగ్రీ, బీటెక్‌లో చేరే వారికి ముందుగా 3 నుంచి 6 నెలల కాలపరిమితితో కొన్ని స్కిల్ కోర్సులు అందించాలన్న ప్రతిపాదన ముందుకొచ్చింది. ఈ కోర్సులకు యూజీసీ కూడా ఇటీవల ఆమోదం తెలిపింది. నూతన విద్యా విధానంలో భాగంగా ఒకేషనల్ విద్యను జనరల్ విద్యతో సమ్మిళితం చేయాలన్నది యూజీసీ ఆలోచన. స్కిల్ కోర్సులు పూర్తిగా అకడమిక్‌గా ఉండకుండా, పూర్తిగా పరిశ్రమల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ పొందేలా రూపొందించాలని సూచించింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని స్కిల్స్ వర్సిటీ ఇటీవల వర్సిటీల నిపుణులతో స్కిల్ కోర్సులపై ఆరా తీసింది. ఉస్మానియా, జేఎన్‌టీయూహెచ్‌తో పాటు పలు విశ్వవిద్యాలయాలు కొన్ని కోర్సులను సూచించాయి. ఇవన్నీ యూజీసీ ఆమోదించినవే కావడం గమనార్హం.



116 కిలో మీటర్లు.. 80 స్టేషన్లు

రెండో దశలో భాగంగా ఆరు మార్గాల్లో మెట్రో రైలు సేవల విస్తరణ

సాక్షి, హైదరాబాద్: రెండోదశలో భాగంగా మొత్తం ఆరు కారిడార్లలో 116.2 కిలోమీటర్ల మేర 80కు పైగా స్టేషన్లతో మెట్రో రైలు విస్తరణ ప్రాజెక్టు చేపట్టనున్నారు. ఎయిర్‌పోర్ట్‌తో పాటు, కొత్తగా ప్రతిపాదించిన ఫోర్త్‌సిటీతో సహా నగరంలోని వివిధ మార్గాల్లో మెట్రో సేవలను విస్తరించనున్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రెండోదశ ప్రాజెక్టు డీపీఆర్‌లకు తుదిమెరుగులు దిద్దుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. 40 కి.మీ పొడవుతో కొత్తగా ప్రతిపాదిస్తున్న ఎయిర్‌పోర్ట్ టూ ఫోర్త్ సిటీ కారిడార్‌కు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) మినహా మిగతా ఐదు కారిడార్ల డీపీఆర్‌లను త్వరలోనే కేంద్రానికి సమర్పించనున్నట్లు తెలిపారు. ఎయిర్‌పోర్ట్ టూ ఫోర్త్ సిటీ డీపీఆర్ ఆకర్షణీయమైన ఫీచర్లతో రూపుదిద్దుకుంటోందని, మరికొద్ది నెలల్లో దీన్ని కేంద్రం అనుమతి కోసం పంపుతామని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ మెట్రో అలైన్‌మెంట్‌లో మార్పు చేస్తూ కొత్తగా డీపీఆర్ సిద్ధం చేసినట్లు వివరించారు. మెట్రో రైలు రెండోదశపై ఆదివారం బేగంపేట్ మెట్రో భవన్‌లో ఆయన సవివరమైన ప్రెజెంటేషన్ ఇచ్చారు.

ట్రాఫిక్ అధ్యయనం

'రెండోదశకు సంబంధించి హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలోప్రస్తుతం ట్రాఫిక్ అధ్యయనం కొనసాగుతోంది. త్వరలో రూపొందించనున్న ట్రాఫిక్ అధ్యయన నివేదికను (కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) కూడా పరిగణనలోకి తీసుకోనున్నాం. రెండోదశ మెట్రో మార్గాలలో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్‌చెక్ చేయనున్నాం. రెండో దశ డీపీఆర్‌లకు కేంద్రం నుంచి ఆమోదం పొందేందుకు ఇది తప్పనిసరి. ఎయిర్‌పోర్ట్ రూట్‌కు సంబంధించి అలైన్‌మెంట్‌లో కొంత మార్పు చేశాం. గతంలో మైలార్‌దేవ్‌పల్లి నుంచి నేరుగా ఎయిర్‌పోర్టు వరకు ప్రతిపాదించగా, ప్రస్తుతం దాన్ని ఆరాంఘర్ నుంచి 44వ నంబర్ జాతీయ రహదారి (బెంగళూరు హైవే)లోని కొత్త హైకోర్టు ప్రాంతం మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకునేలా డీపీఆర్‌ను ఖరారు చేస్తున్నాం..'అని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ఇతర ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి.

భూగర్భంలో మెట్రో రైల్

నాగోల్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు సుమారు 36 కిలోమీటర్ల మార్గంలో నిర్మించనున్న నాలుగో కారిడార్ ఎల్బీనగర్, కర్మన్‌ఘాట్, ఒవైసీ ఆసుపత్రి, డీఆర్‌డీఓ, చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, కొత్త హైకోర్టు మీదుగా శంషాబాద్ జంక్షన్ నుంచి సాగుతుంది. రాయదుర్గం నుంచి నాగోల్ వరకు, మియాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకు, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న కారిడార్లు.. ఎయిర్‌పోర్టు మార్గంలో నాగోల్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట స్టేషన్ల వద్ద అనుసంధానమవుతాయి. మొత్తం 36.6 కిలో మీటర్ల ఎయిర్‌పోర్ట్ మెట్రో రూట్‌లో 35 కిలోమీటర్లు ఎలివేట్ చేయనున్నారు. 1.6 కిలోమీటర్ల వరకు మెట్రోలైన్ భూగర్భంలో నిర్మిస్తారు. ఎయిర్‌పోర్ట్ స్టేషన్ కూడా భూగర్భంలోనే ఉంటుంది. ఈ రూట్‌లో 24 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.

- ఐదవ కారిడార్‌లో ఇప్పుడు ఉన్న రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు కొత్తగా లైన్ నిర్మించనున్నారు. ఇది బయోడైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్, నానక్ రామ్‌గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, కోకాపేట్ నియోపోలిస్ వరకు ఉంటుంది. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్. ఈ 11.6 కిలోమీటర్ల మార్గంలో 8 స్టేషన్లు నిర్మించే అవకాశం ఉంది.

రెండో దశ కారిడార్లు ఇవీ (కిలో మీటర్లలో)

కారిడార్ - 4	నాగోల్ - ఎయిర్‌పోర్ట్	36.6
కారిడార్ - 5	రాయదుర్గం-కోకాపేట్ నియోపాలిస్	11.6
కారిడార్ - 6	ఎంజీబీఎస్ -చాంద్రాయణగుట్ట (ఓల్డ్ సిటీ కారిడార్)	7.5
కారిడార్ - 7	మియాపూర్ - పటాన్‌చెరు	13.4
కారిడార్ - 8	ఎల్‌బీనగర్-హయత్ నగర్	7.1
కారిడార్ - 9	ఎయిర్‌పోర్ట్- ఫోర్త్ సిటీ (స్కిల్స్ యూనివర్సిటీ)	40

చాంద్రాయణగుట్ట వరకు పాతబస్తీ మెట్రో

- ఆరో కారిడార్‌లో జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఉన్న రూట్‌ను గతంలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు విస్తరించాలని ప్రతిపాదించారు. తాజాగా ఈ మార్గాన్ని చాంద్రాయణగుట్ట వరకు పొడిగించారు. ఇది ఎంజీబీఎస్ నుంచి ఓల్డ్ సిటీలోని మండి రోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల వరకు ఉంటుంది. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్‌లు ఈ కారిడార్‌కు 500 మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, అక్కడ నిర్మించే స్టేషన్లకు ఆ పేర్లే పెట్టనున్నారు.

రోడ్ల విస్తరణ

- ప్రస్తుతం దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య ఉన్న 60 అడుగుల రోడ్డు, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న 80 అడుగుల రోడ్లను 100 అడుగులకు విస్తరించనున్నారు. స్టేషన్లు ఉండే ప్రాంతాల్లో మాత్రం 120 అడుగులకు విస్తరిస్తారు. పాతబస్తీ మెట్రో అలైన్‌మెంట్, రోడ్డు విస్తరణ నేపథ్యంలో సుమారు 1,100 నిర్మాణాలను తొలగించే అవకాశం ఉంది. ఆరో కారిడార్‌లో 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వాటన్నింటికీ తగిన ఇంజనీరింగ్ పరిష్కారాలతో, మెట్రో పిల్లర్ స్థానాలను సర్దుబాటు చేయనున్నారు. ఈ రూట్‌లో మొత్తం 6 స్టేషన్లు ఉంటాయి.
- ఏడవ కారిడార్‌లో మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల మేర లైన్ నిర్మించనున్నారు. మియాపూర్ నుంచి ఆల్విన్ క్రాస్‌రోడ్స్, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, ఇక్రిసాట్ మీదుగా ఇది వెళుతుంది. ఈ రూట్‌లో సుమారు 10 స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్.
- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు నిర్మించనున్న 8వ కారిడార్ 7.1 కిలోమీటర్ల వరకు ఉంటుంది. చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీల మీదుగా హయత్‌నగర్ వరకు నిర్మిస్తారు. సుమారు 6 స్టేషన్లు ఉంటాయి. ఇది కూడా పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్.

  9వ కారిడార్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఫోర్త్‌సిటీలోని స్కిల్స్ యూనివర్సిటీ వరకు ఉంటుంది.
- రెండోదశ ప్రాజెక్టు నిర్మాణానికి సుమారు రూ..32,237 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. ఇందులో 40 కిలోమీటర్ల ఫోర్త్‌సిటీ మెట్రోకే రూ.8 వేల కోట్ల వరకు ఖర్చు కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌గా మెట్రో రెండో దశ చేపట్టనున్నారు.



పురుషోత్తంరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మంత్రి ఉత్తమ్‌కు పితృ వియోగం

- మహాప్రస్థానంలో పురుషోత్తంరెడ్డి అంత్యక్రియలు
- నివాళులు అర్పించిన సీఎం, మంత్రులు



పురుషోత్తంరెడ్డి (ఫైల్)

గచ్చిబౌలి(హైదరాబాద్): మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి పితృ వియోగం కలిగింది. కొండాపూర్‌లోని కూతురు హితశ్రీ నివాసంలో ఉంటున్న పురుషోత్తంరెడ్డి(89) ఆదివారం ఉదయం అస్వస్థతకు లోనుకావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయారు. సాయంత్రం రాయదుర్గంలోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ రఘునందన్‌రావు, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్‌రెడ్డి తదితరులు నివాళులు అర్పించారు. ఉదయం సైబర్ మిడోస్ విల్లాస్‌లో పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులు అర్పించారు. పురుషోత్తంరెడ్డి స్వగ్రామం సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల కాగా, ఆయన బీహెచ్ఈఎల్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య ఉషాదేవి, కుమారులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, కూతురు హితశ్రీ ఉన్నారు. పురుషోత్తంరెడ్డి భౌతిక కాయాన్ని చూసేందుకు గ్రామస్తులు కడసారి చూసేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పురుషోత్తంరెడ్డి మృతి పట్ల హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి పద్మావతితోపాటు కుటుంబ సభ్యులకు ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఇంకా సంతాపం వ్యక్తం చేసిన వారిలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లురవి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ తదితరులున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ నరహరి

హైకోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వహణ



అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ నరహరి, డాక్టర్ లాలూ ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ లాలూప్రసాద్, కోశాధికారిగా రవూఫ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఓటింగ్ జరిగింది. ఈ ఓటింగ్‌లో వివిధ జిల్లాల సంఘం కార్యవర్గ సభ్యులు ఓట్లు వేశారని డాక్టర్ నరహరి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం తెలంగాణలోని వివిధ విభాగాలకు ప్రాతినిధ్యం ఇచ్చే యూనియన్. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎన్నికలు జరగక సంఘం ఇలాగే ఉండిపోయింది. హైకోర్టు ఆదేశాలతో ఇప్పుడు ఎన్నికలు జరగడంతో ప్రభుత్వ వైద్యుల్లో సంబరాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ వైద్యుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చేందుకు తాను కృషి చేస్తానని డాక్టర్ నరహరి తెలిపారు.

ఎఫ్ఎన్‌సీసీ అధ్యక్షుడిగా కే.ఎస్.రామారావు



ఫిలింనగర్: ఫిలింనగర్ కల్చరల్‌సెంటర్ (ఎఫ్ఎన్‌సీసీ) అధ్యక్షుడిగా ప్రముఖ నిర్మాత కే.ఎస్.రామారావు ఘన విజయం సాధించారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేసిన కే.ఎస్.రామారావు 795 ఓట్ల భారీ మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా ఎస్ఎన్.రెడ్డి, జనరల్ సెక్రటరీగా తుమ్మల రంగారావు (ఏకగ్రీవ ఎన్నిక), జాయింట్‌సెక్రటరీగా సదాశివరెడ్డి (ఏకగ్రీవ ఎన్నిక), కోశాధికారిగా జె. శైలజ, పర్మనెంట్ మెంబర్లుగా కె. భవానీ, కృష్ణంరాజు(వేణు), ఏడిద సతీష్(రాజా), సిహెచ్. వరప్రసాదరావు ఎన్నికయ్యారు. ప్రమోటి కమిటీ మెంబర్లుగా కాజా సూర్యనారాయణ, భాస్కర్‌నాయుడు, కె.మురళీ మోహన్‌రావు, నవకాంత్, బాలరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 1950 ఓట్లకుగాను 1097 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా పోటీ చేసిన కె.ఎస్.రామారావుకు 946 ఓట్లు రాగా, ఆయనపై పోటీ చేసిన డాక్టర్ జ్యోతిప్రసాద్ కోసరాజుకు 151 ఓట్లు వచ్చాయి. ఉపాధ్యక్షుడిగా గెలిచిన ఎస్.ఎన్‌రెడ్డికి 696 ఓట్లు, కోశాధికారిగా గెలిచిన జులాల శైలజకు 631 ఓట్లు వచ్చాయి.

ఆత్మవిమర్శ చేసుకోండి.. చిత్తశుద్ధితో పనిచేయండి

- రెవెన్యూ ఉద్యోగులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచన
- సామాన్యులు, రైతులకు మేలు జరిగేలా కొత్త రెవెన్యూ చట్టం తెస్తున్నట్లు వెల్లడి
- ప్రజలకు పూర్తిగా సహకరించి వారి సమస్యలు పరిష్కరించాలని ఆదేశం
- 33 జిల్లాల తహసీల్దార్లతో నల్సార్ వర్సిటీ ప్రాంగణంలో భేటీ
- రెవెన్యూ ఉద్యోగుల శిక్షణ అకాడమీ ఏర్పాటుకు హామీ
- బదిలీలు, పదోన్నతులు, బకాయిల విడుదలకు భరోసా



నల్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో నవీన్ మిత్తల్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ వ్యవస్థ దుర్వినియోగమైందని.. దాన్ని ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసే విధంగా పటిష్ట విధానాన్ని రూపొందిస్తున్నామన్నారు. సామాన్యులతోపాటు రైతులకు మేలు జరిగేలా కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని.. ఈ కసరత్తు తుది దశకు చేరుకుందని ఆయన తెలిపారు. ఆదివారం శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో 33 జిల్లాల తహసీల్దార్లతో పొంగులేటి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కోరుకుంటున్న దిశలో రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తోందా లేదా అన్నది ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా రెవెన్యూ ఉద్యోగులు చిత్తశుద్ధితో, మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు పూర్తిగా సహకరించి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ఆస్తులు, స్థలాలను కాపాడే విషయంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని.. ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మౌలిక వసతులు కల్పిస్తాం..

గత ప్రభుత్వ హయాంలో హడావుడిగా మండలాల సంఖ్యను పెంచినా అందుకు తగ్గట్టుగా మండల స్థాయి రెవెన్యూ కార్యాలయాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయలేదని, తగిన సిబ్బందిని నియమించలేదని మంత్రి పొంగులేటి విమర్శించారు. ఇప్పుడు తహసీల్ కార్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు రెగ్యులర్ ప్రాతిపదికన సిబ్బందిని నియమించి పదోన్నతులు కల్పిస్తామన్నారు. కోర్టు ఖర్చులు, అద్దె, వాహన బకాయిల చెల్లింపులాంటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రెవెన్యూ సిబ్బందికి శిక్షణ కోసం అకాడమీ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆరోపణలు ఎదుర్కొనే తహసీల్దార్లపై కలెక్టర్ల అనుమతితోనే కేసులు నమోదయ్యేలా త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లను పూర్వ స్థానాలకు పంపడంపై త్వరలోనే ఉద్యోగ సంఘాలతో సమావేశమై నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిత్తల్, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్, ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్‌రెడ్డి, కె. గౌతమ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి. లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి రమేశ్ పాకల, తహసీల్దార్లు పాల్గొన్నారు.



హింస ద్వారా శాంతిని సాధించలేము.
దాన్ని అవగాహన ద్వారా మాత్రమే పొందగలం.
– రాల్ఫ్ వాల్డో ఎమర్సన్

సాక్షి
సోమవారం, 30 సెప్టెంబర్ 2024

నింద భోజనం

కొన్ని నైతిక బోధలు అన్నిచోట్లా కనబడతాయి. అబద్ధము ఆడరాదు. జీవహింస చేయరాదు... ఇలా! కానీ, వారణాసిలోని కబీర్ జన్మస్థలైన కబీర్ మఠ్‌కు వెళ్లినప్పుడు అక్కడ కనిపించే మొదటి నైతిక బోధ 'నిందలు వేయరాదు' అని! కబీర్ దాస్ తన ప్రబోధాలలో ఎక్కువగా అప్రమత్తం చేసింది నిందలు వేసే వారి గురించే!! 'వేయిమంది పాపులను కలిసినా ఫరవాలేదు నిందలు వేసే ఒక్కణ్ణి తప్ప. నిందలు వేసే వాని శిరము వేయి పాపాల పుట్ట' అన్నాడాయన.

సిసలైన వేటగాడు ఉత్త చేతులతో ఇంటికొచ్చి నింద అడవి మీద వేయడు. ఆహార సేకరణ కాలంలో అనునిత్యం చెమటోడ్చి, రక్తం చిందించి ఆహారం సేకరించుకోవాల్సి వచ్చినప్పుడు ప్రతి బలహీన పురుషుడు నోటికి నేర్చిన మాట నింద. వేటే దొరకలేదు... నది పొంగింది... తేనెటీగలు తరుముకున్నాయి... బాణం దిగినా సరే పారిపోయింది. తర్వాతి కాలంలో సకల చేతగానితనాలకీ, అగణిత అప్రయోకత్వాలకీ చవటలు వెతుక్కునే అన్ని నిందలకూ కనిపెట్టుకున్న అడ్రస్ ఒకటి ఉంది. దాని పేరు ఖర్మ. నింద ఖర్మ మీద వేస్తే ఆ తర్వాత మన దేశంలో వేరే ఏమీ చేయనక్కర్లేదు. 'ఏం చేస్తామండీ ఖర్మ' అని తడవకోసారి అంటూ ఉంటే చాలు. సాఫల్య కర్మల కోసం కాదా కర్మ?

అప్రయోజకత్వం అక్కసుకు సింహద్వారం. వైఫల్యం అహంకారానికి గొడ్డుకారం. కళ్లెదుట కష్టపడి పని చేసేవాడు, భార్యాపిల్లలను చక్కగా చూసుకునేవాడు, డబ్బు జాగ్రత్త చేసుకునేవాడు, తెలివిగా మసలుకునేవాడు, వ్యసనాలకు దూరంగా ఉండేవాడు, వచ్చిన విద్యను అంటిపెట్టుకుని ఉండేవాడు, తెగించి కొత్తదారులు కనిపెట్టేవాడు... వీళ్లంతా ముందుకు వెళుతుంటే విజేతలై అధిగమిస్తుంటే ఇవన్నీ చేయలేని, చేయరాని, చేసేందుకు కనీసం ప్రయత్నించి చూడని ప్రతి గాడిదకూ చేతికి అందే మారణాయుధం నింద. గెలిచినవాడిని ఓడించేందుకు ధర్మబద్ధమైన ఏ ఆయుధమూ లేని పరాజితుడు అంతిమంగా ప్రయోగించే పాశుపతాస్త్రం నింద. ఇది టీకా లేని క్రిమి. నాల్కల ద్వారా వ్యాపించే మహమ్మారి.

పాఠశాల విద్య తద్వారా తెలుగు భాష ముందుకు సాగడానికి చిన్నయ సూరి ఆవిష్కృతం చేసిన అతి ముఖ్యమైన కృషి 'బాల వ్యాకరణం' వేలాదిగా అమ్ముడుపోవడం మొదలుపెట్టాక ఆయన మీద పడ్డ నింద– అది కాపీ రచన అని... అది వేరెవరో పండితుడు రాశాడు అని. చిన్నయ సూరి ఈ గండం నుంచి గట్టెక్కడానికి గురు సమానులైనవారి వైపు ఆశగా చూస్తే వారూ చేసిన పని 'అవును.. కాపీయే' అని నిందించడం. ఐదారేళ్లు చిన్నయ సూరి నిందను మోశాక నింద ఓడిపోయింది. చిన్నయ సూరి మిగిలాడు. ఒక వేశ్య రచన చేయుటయా... ఆస్థానాలలో ఆడే దేవదాసి కవిత్వం చెప్పుటయా అని నాటి పెద్దలకు ముద్దు పళని మీద ఆగ్రహం వచ్చింది. 'లోపల ఏముందో తర్వాత.. ముందు అశ్లీలం అని నింద వేయండి' అన్నారు. ఆ నిందను జయించి తెలుగు సారస్వతంలో తన స్థానం దక్కించుకోవడానికి 'రాధికా సాంత్వనం' ఎంత సాంత్వనం కోల్పోయిందని?

తప్పులు, పొరపాట్లు చేయడం మానవ సహజం. పురాణాలూ ఈ సందర్భాలను ఎత్తి చూపాయి. రాముణ్ణి మాయలేడి వెంట పంపి సీత తప్పు చేసింది. ఆ తప్పు వల్ల ఆమెలో ఆందోళన జనించింది. ఆ ఆందోళన ఇంగితం కోల్పోయేలా చేసింది. ఎంతకూ రాని రాముని గురించి పరితపిస్తూ, రక్షణకు వెళ్లమని, 'నా మీద కన్నేసి నువ్వు కదలడం లేదు కదూ' అని లక్ష్మణుడి మీద నింద వేసే సరికి అతడు హతాశుడయ్యాడు. తర్వాతి కాలంలో ఈ సీతమ్మే ఘోర నిందను ఎదుర్కొంది. అగ్నిపునీతగా నిలిస్తే తప్ప నింద వదల్లేదు. సకల లీలా మాధవుండైన శ్రీకృష్ణుడు కూడా నిందచేసే లీలకు చకితుడయ్యి జాంబవంతుడితో యుద్ధానికి దిగాడు శమంతకమణి కోసం! ఆ మాటకొస్తే ఆడిన మాట తప్పాడన్న నింద వస్తుందన్న భయం లేకపోతే హరిశ్చంద్రుడు పడేవాడా అన్ని కష్టాలు? దేనికీ జడవనివాణ్ణి జడిసేలా చేయగలదు నింద.

నిందలు ఎందుకు వేస్తారు అంటే అది చాలా సులభమైన పని కనుక అంటారు మనస్తత్వ శాస్త్రవేత్తలు. గుచ్చుకుంటున్న స్వీయ వైఫల్యాలకు కాసింత మలాము రాసుకోవడానికి ఎదుటివారికి మలం పూస్తారు ఇట్టివారు. అక్కసును, ద్వేషాన్నీ గెలుపుగా మార్చుకునేందుకు దేశాలపై, జాతులపై, మతాలపై, కులాలపై, వ్యక్తులపై, సార్థకులపై నిందలు వేస్తారు. నిందకు దండన అనుమతి ఉంది. చేతబడి చేస్తున్నారన్న నింద వేశాక ఊరంతా కలిసి వారిని చంపుతుంటారు. నింద బలిగోరుతుంది. విడిపోయి తమ దారి తాము చూసుకుందామనుకునే తోబుట్టువులు ఇవాళ సుపారీ ఇస్తున్నది నిందకే.

నిందలు వేసేవారు పదేపదే నెగెటివ్ ఆలోచనల్లో చిక్కుకుని ఏమీ సాధించలేక చరిత్రహీనులుగా మిగులుతారనడానికి ఆధారాలున్నాయి. నేటి సోషల్ మీడియా అంతా నిందలు వేసే మందబుద్ధులతో ఎంతగా నిండి ఉందంటే రోజూ వేల కొలది పోస్టుల పాపపుకూడు ఉడికి వడ్డనవుతున్నది. ఈ భోజనానికి ఎగబడుతున్న అమాయకులు ఎందరో. కవులు, రచయితలు ఎప్పుడైనా ఈ దారి తొక్కుతున్నారా ప్రయివేటు సంభాషణలను నిందలతో నింపుతున్నారా, చెక్ చేసుకోవాలి. మొదట నింద వేసినవారు సచ్ఛీలురు అయిపోవడం నింద సమకూర్చే అతి పెద్ద లాభం. అంత మాత్రం చేత నింద వేసిన వారు గెలిచినట్టు కాదు. మోసినవారు ఓడినట్టు కాదు. సదుద్దేశంతో సద్విమర్శ చేసేవారిని ఇంటిలో నాటే చెట్టంత దగ్గరగా ఉంచుకోమన్నాడు కబీర్ దాస్. సమాజం సద్విమర్శతో నిర్మితమవుతుంది. నిందతో కాదు. నింద నిందపడి పాడుగానూ!

సమాఖ్యకు 'జమిలి' సవాళ్లు!

కామెంట్



కరణ్ థాపర్

జమిలి ఎన్నికల వల్ల దేశానికీ, ప్రజాస్వామ్యానికీ ఎంతవరకు ఉపయుక్తం అనే దానిపై చర్చ జరుగుతోంది. లోక్‌సభ నుంచి అన్ని రాష్ట్రాల శాసనసభల ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలనే 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'కు అనుకూలంగా ఎన్ని వాదనలున్నాయో, వ్యతిరేకంగా అన్ని వాదనలున్నాయి. ప్రతి ఐదేళ్లకోసారి జరిగే ఎన్నికలకు అయ్యే ఖర్చు, వేర్వేరు సమయాల్లో జరిగే అనేక ఎన్నికల ఖర్చు కంటే తక్కువగా ఉంటుంది. కానీ అలా పొదుపు చేసే మొత్తం భారత్ లాంటి పెద్ద దేశానికి ఒక లెక్కలోకే వస్తుందా? అలాంటి ఎన్నికల వల్ల స్థానిక సమస్యల కంటే జాతీయ సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యం లభించదా? బహుళ పార్టీ వ్యవస్థను ఒకే పార్టీ గల దేశం వైపు నెట్టదా? ఇవన్నీ ఆలోచించాల్సిన విషయాలు.

నాకు తెలిసిన చాలామంది లాగే మీరు కూడా 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'ను అర్థం చేసుకోవటానికి తన్నుకులాడుతుంటే కనుక మీకు సహాయం చేయటానికి నన్ను ప్రయత్నించనివ్వండి. 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అనే భావనను ప్రతిపాదించినవారు, దానిని వ్యతిరేకిస్తున్నవారు తమ అనుకూల, ప్రతికూల వాదనలతో మనల్ని ముంచెత్తారు. కానీ లాభ నష్టాల నడుమ దీనిపై మనమెలా ఒక తీర్పుకు రాగలం? ఈ వాదోపవాదాలన్నీ సముచితమైనవేనా? లేదా కొన్ని మాత్రమే మిగతా వాటి కంటే ప్రాముఖ్యమైనవా?

ఒకే దేశం–ఒకే ఎన్నిక అనే ఈ భావనకు మద్దతు లభించటానికి గల కారణాలతో విషయాన్ని ప్రారంభిద్దాం. మొదటిది – డబ్బు ఖర్చు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఎన్నికలకు అయ్యే ఖర్చు, వేర్వేరు సమయాల్లో జరిగే అనేక ఎన్నికలకు అయ్యే ఖర్చు కంటే తక్కువగా ఉంటుందనటంలో సందేహం లేదు. అయితే అలా పొదుపు చేసే మొత్తం ఏడాదికి రూ. 5000 కోట్ల కన్నా తక్కువేనన్నది శశి థరూర్, ప్రవీణ్ చక్రవర్తిల వాదన. ఇండియా వంటి భారీ ఆర్థిక వ్యవస్థకు ఇదేమంత తేడా చూపే మొత్తం అవుతుందని?

కరీంనగర్‌టౌన్: పాశ్చాత్య దేశాల్లో 40 ఏళ్లు దాటినవారికి గుండెపోటు వస్తుంటే మనదేశంలో 30 ఏళ్లకే గుండెపోటుకు గురవడం ఆందోళన కలిగిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో హార్ట్ వాక్ నిర్వహించారు. మెడికవర్ ఆస్పత్రి నుంచి ఎస్సారార్ కళాశాల వరకు నిర్వహించిన వాక్‌ను డీఎంహెచ్‌వో ప్రారంభించగా, దాదాపు వెయ్యి మంది పాల్గొన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎంహెచ్‌వో మాట్లాడారు. మనల్ని నడిపించే గుండె మనం నడవడం వల్ల ఆరోగ్యంగా ఉంటుందని, అందుకోసం రోజూ అరగంట వాకింగ్ చేసి గుండెను కాపాడుకోవాలని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి, శారీరక శ్రమ లేకపోవడం, స్మార్ట్ ఫోన్, కల్తీ ఆహారం, ధూమ, మద్యపానం, వాతావరణ కాలుష్యం, బీపీ, షుగర్, నిద్రలేమి, రక్తంలో కొలెస్ట్రాల్‌తో గుండె జబ్బులకు గురవుతున్నారని వెల్లడించారు. మెడికవర్ హెడ్ గుర్రం కిరణ్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు కొండపాక కిరణ్, రాజేంద్రప్రసాద్, అనీష్‌బబ్బ, నాగరాజు, విష్ణువర్ధన్, ఉపేందర్ రెడ్డి, వినయ్, వేణుగోపాల్, దిలీప్‌రెడ్డి, రవిశంకర్, రవి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హార్ట్ వాక్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

వైద్య విద్యార్థులకు అవగాహన

వరల్డ్ హార్ట్ డే పురస్కరించుకొని రెనె హాస్పిటల్‌లో ఈసీజీపై వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సును మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించగా, గుండె వైద్యులు దినకర్, రాజా విజయేంద్ర రెడ్డి, యూసుఫ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆస్పత్రి చైర్మన్ బంగారి స్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముంబయిలో భూషణరావుపేట వాసి మృతి


మైస అమ్మాయి (ఫైల్)

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామానికి చెందిన మైస అమ్మాయి (55) మహారాష్ట్రలోని ముంబయిలో అనారోగ్యంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. అమ్మాయి కొంత కాలంగా కుటుంబసభ్యులతో ముంబయిలో ఉంటోంది. ఆమె అనారోగ్యానికి గురికావడంతో ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్సపొందుతూ శనివారం మృతిచెందింది. ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని భూషణరావుపేట గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. అమ్మాయికి భర్త నర్సయ్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

జ్వరంతో బాలిక మృతి


తాలుక మనీషా(ఫైల్)

రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన తాలుకా మనీషా (11)జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మనీషా ఏడో తరగతి చదువుతోంది. రెండురోజుల క్రితం జ్వరం రావడంతో జగిత్యాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్ తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు బాలిక తల్లిదండ్రులు గంగారెడ్డి, లక్ష్మి తెలిపారు.

గోదావరిలో స్నానాలకు వచ్చి ఒకరి గల్లంతు

- మరో ఇద్దరు సురక్షితం

ధర్మపురి: గోదావరిలో పుణ్యస్నానాలకు వచ్చిన ముగ్గురు యువకుల్లో ఒకరు గల్లంతయ్యాడు. మిగిలిన ఇద్దరిని జాలర్లు సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటన ధర్మపురి మండలం రాయపట్నంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం కరీంనగర్ జిల్లాకేంద్రానికి చెందిన పవన్ కుమార్, అక్షయ్, వినీత్ కలిసి సెలవు దినం కావడంతో మండలంలోని రాయపట్నం వద్దగల గోదావరిలో స్నానాల కోసం వచ్చారు. నీటిలో దిగి స్నానం చేస్తుండగా.. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో వరదలో కొట్టుకుపోయారు. వీరిలో పవన్ కుమార్ గల్లంతయ్యాడు. వినీత్, అక్షయ్‌ను జాలర్లు బయటకు తీశారు. పవన్ కుమార్ కోసం గాలిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానితులను పట్టుకున్న కాలనీవాసులు


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాయికల్: పట్టణంలోని శివాజీనగర్‌లో బట్టల సేకరణ కోసం తిరుగుతున్న శాంతి, రమేశ్ అనే దంపతులను ఆదివారం కాలనీవాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మోడిచల్‌లో ఆదర్శ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఓల్డేజ్ హోం పేరిట ఆటోలో శాంతి, రమేశ్ అనే దంపతులు కలిసి అనుమానాస్పదంగా పట్టణంలోని కాలనీల్లో తిరిగి బట్టలు సేకరిస్తున్నారు. బీజేపీ జిల్లా మహిళామోర్చ అధ్యక్షురాలు సురతాన్ని భాగ్యలక్ష్మికి అనుమానం రావడంతో కాలనీవాసుల సహకారంతో పట్టుకున్నారు. దీంతో రమేశ్ అక్కడినుంచి పరారయ్యారు. కాలనీవాసులు ఆరా తీయడంతో అసలు స్వచ్ఛంద సంస్థనే లేదని తెలియడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలాన్ని చేరుకుని శాంతిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపడుతున్నట్లు ఏఎస్సై దేవేందర్ నాయక్ తెలిపారు.

సీఎంఆర్ నిబంధనలు కఠినం

- పక్కాగా ఇచ్చేలా ప్రత్యేక అధికారి నియామకం
- అవసరమైతే ఆర్ఆర్ యాక్ట్ అమలు


కరీంనగర్ శివారులోని మిల్లులో మరాడించిన బియ్యం

కరీంనగర్ అర్బన్: కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ఇవ్వకుండా ఎగనామం పెడదామనుకుంటే కుదరదిక. నిబంధనలను కఠినతరం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా సాగుతోంది. డిఫాల్టర్లను అవసరమైతే జైలుకు పంపేలా కసరత్తు చేస్తోంది. మొత్తంగా సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం పక్కదారి పట్టకుండా ఈ సారి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. మిల్లులకు సీఎంఆర్ ధాన్యం కేటాయించే సమయంలోనే మిల్లు యజమానికి, మరో కస్టోడియన్ అధికారికి ధాన్యం బాధ్యతలు అప్పగిస్తారు. వీరిద్దరి అనుమతి లేకుండా సీఎంఆర్ ధాన్యం నిల్వల నుంచి కదలిక లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పౌరసరఫరాల అధికారులు పూర్తిస్థాయిలో కేటాయించిన సీఎంఆర్ ధాన్యానికి నిర్దేశించిన ప్రకారం బియ్యం వచ్చే వరకు వీరి పర్యవేక్షణ ఉండేలా కొత్త నిబంధన తీసుకువస్తున్నారు. ఈ వానాకాలం సీజన్ పంట దిగుబడుల నుంచి ఈ నిబంధన అమల్లోకి రానుంది.

బకాయిలకు చెక్

సాధారణంగా ధాన్యం తీసుకున్న మిల్లర్లు 45 రోజుల్లో నిర్దేశించిన మేరకు పూర్తిగా సీఎంఆర్ బియ్యం పెట్టాలి. కానీ దశాబ్దాలుగా కొందరు మిల్లర్లు సీఎంఆర్ ధాన్యం తీసుకుని వాటిని బహిరంగ మార్కెట్లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పైసా పెట్టుబడి లేకుండా ప్రభుత్వ ధాన్యంతో కోట్లు గడించి ఇతర వ్యాపారాల్లో భాగస్వాములవుతుండగా ప్రభుత్వానికి శఠగోపం పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇవ్వాల్సిన బియ్యం రెండుమూడు సంవత్సరాలైనా ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతుండగా జిల్లాలో ఇలాంటి వారు పదుల సంఖ్యలో ఉండటం విశేషం. రాజకీయ ఒత్తిళ్లకు తోడు మామూలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లా నుంచి సుమారు రూ.200 కోట్లకు పైగా బియ్యం బకాయిలు పడగా ఇటీవల ప్రభుత్వం కొందరిని అరెస్టు చేసి రకరకాలుగా మిల్లర్ల మీద ఒత్తిడి తీసుకువచ్చి కొంత మేరకు రాబట్టగలిగినా ఇంకా బకా యిలు రూ.కోట్లల్లో ఉన్నాయి. కొందరు మిల్లర్లు రెండు, మూడు సీజన్‌లు వచ్చినా ఆ ధా న్యాన్ని వాడుకుని తరువాత సీఎంఆర్ బియ్యం పెడుతున్నారు. ఇకపై సదరు పరిస్థితి తలెత్తకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రత్యేక అధికారితో గ్యారంటీ

అధికారిని బాధ్యుడిని చేయడం వల్ల తమ ధాన్యానికి గ్యారంటీ ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మిల్లులో ధాన్యం నిల్వ ఉంటే సీఎంఆర్ బియ్యం సేకరణ చేయడం కూడా సులభతరం అవుతుందని అధికారులు అంటున్నారు. ఒక వేళ కస్టోడియన్ అధికారికి తెలియకుండా ధాన్యం పక్కదారి పట్టిస్తే ఆ అధికారి తన తనిఖీలలో గుర్తిస్తారు. కాబట్టి వెంటనే మిల్లరుపై నిత్యావసర వస్తువుల దుర్వినియోగం కింద క్రిమినల్ కేసు నమోదు చేసి వాటిని రాబట్టేందుకు చర్యలు తీసుకుంటారు. అంతే కాకుండా నిల్వ చేసిన ధాన్యం తడవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం, నాణ్యత చెడిపోకుండా చూసుకుంటూ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకునేలా నిబంధనలు ఉండనున్నాయి.

కొడుకు చేతిలో తండ్రి హతం


మామిండ్ల మల్లయ్య మృతదేహం


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్

- వేములవాడలో పట్టపగలే హత్య
- ఆస్తి తగాదాలే కారణం
- సవతితల్లిపై అటాక్
- తీవ్ర గాయాలతో ఆస్పత్రికి తరలింపు


మామిండ్ల మల్లయ్య (ఫైల్)

వేములవాడ: ఆస్తి పంపకాల విషయంలో ఏర్పడిన తగాదాలో తండ్రి మామిండ్ల మల్లయ్య(57)ను మొదటి భార్య బాలవ్వ కుమారుడు రాజు దాడి చేసి హతమార్చిన ఘటన వేములవాడలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు. వేములవాడలోని చెక్కపల్లి రోడ్డులో నివాసముంటున్న మామిండ్ల మల్లయ్యకు ఇద్దరు భార్యలు బాలవ్వ, పద్మ. మొదటి భార్య బాలవ్వ కొన్నేళ్ల క్రితం మరణించింది. ఆమెకు ముగ్గురు బిడ్డలు, ఒక కుమారుడు. మొదటి భార్య మరణించడంతో మ ల్లయ్య పద్మను రెండో వివాహం చేసుకున్నాడు. పద్మకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. రెండో భార్యతో చెక్కపల్లిరోడ్డులోని తన నివాసంలో ఉంటున్నాడు. మొదటి భార్య సంతానం మరోచోట నివాసముంటున్నారు. మల్లయ్యకు ఆస్తి పంపకాల విషయంలో రాజుతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం ఆస్తి పంపకాల విషయంలో కులసంఘంలో పంచాయితీ జరిగింది. రెండో భార్య కూతుళ్ల వివాహం జరిగే వరకు ఆస్తి పంపకాలు చేపట్టనంటూ మల్లయ్య తెగేసి చెప్పినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే మల్ల య్య ఇంటికి చేరుకున్న వీరు బెడ్రూమ్‌లో గొడవకు దిగారు. మాటమాట పెరిగి రాజు తన సవతి తల్లి పద్మపై కత్తితో దాడి చేయడంతో తండ్రి అడ్డుపడ్డాడు. పెనుగులాట పెరగడంతో వాకిట్లోకి చేరుకున్న మల్లయ్య, పద్మలపై రాజు, అతని బావలు సైకిల్, బండరాళ్లతో దాడిచేసినట్లు మల్ల య్య కూతురు తెలిపింది. తీవ్రంగా గాయపడ్డ మల్లయ్య ను 108 వాహనంలో ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మల్లయ్య మరణించగా, పద్మ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతోంది.

సెల్‌ఫోన్ ధ్వంసం

ఈ గొడవను మల్లయ్య కూతుళ్లు, తల్లి పద్మ మొబైల్‌లో రికార్డు చేస్తుండడంతో గమనించిన రాజు దాన్ని పగులగొట్టినట్లు కూతురు చెబుతోంది. మల్లయ్య హత్యోదంతం పట్టణంలో కలకలం రేపింది.

ఆస్తి తగాదాలే హత్యకు కారణం

మామిండ్ల మల్లయ్య హత్యకు ఆస్తి తగాదారాలే కారణమని వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. మల్లయ్య రెండో భార్య పద్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. ఆస్తి తగాదాలతోనే మొదటి భార్య కుమారుడు, అల్లుళ్లు దాడికి పాల్పడినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ శ్రీనివాస్, ఎస్సైలు మారుతి, రమేశ్‌తో కలిసి పరిశీలించారు. – శ్రీనివాస్, రూరల్ సీఐ

శరన్నవరాత్రోత్సవాలకు ఏర్పాట్లు

- తొమ్మిది రోజులపాటు అమ్మవారికి విశేష పూజలు
- ముస్తాబైన రామలింగేశ్వర స్వామి ఆలయం


ధర్మపురిలో శరన్నవరాత్రోత్సవాలకు ముస్తాబైన రామలింగేశ్వర ఆలయం

ధర్మపురి: దసరా నవరాత్రి ఉత్సవాలకు ధర్మపురిలోని ఆలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారిని తొమ్మిది రోజులపాటు వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహిస్తారు. ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీశారద శంకరాచార్యుల వారికి తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు నిర్వహించే శరన్నవరాత్రోత్సవాలకు ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు.

ప్రత్యేక పూజలు ఇలా..

మూడో తేదీ: ఎరుపువర్ణ వస్త్రధారణలో అమ్మవారు శైలపుత్రి రూపంలో భక్తులకు దర్శనం
నాలుగున: పసుపు వర్ణ వస్త్ర ధారణలో బ్రహ్మచారిణి రూపంలో దర్శనం
ఐదున: గులాబీ వర్ణ వస్త్రధారణలో చంద్రఘంటా రూపంలో దర్శనం
ఆరున: గోధుమ రంగు వస్త్రధారణలో కూష్మాండ, శాకాంబరి రూపంలో దర్శనం
ఏడున: పసుపువర్ణ వస్త్రధారణలో స్కందమాత రూపంలో దర్శనం
ఎనిమిదిన: ఆకుపచ్చ రంగు వస్త్రధారణలో కాత్యాయిని రూపంలో దర్శనం
తొమ్మిదిన: చిలుకపచ్చ వర్ణ వస్త్రధారణలో కాళరాత్రి రూపంలో దర్శనం
పదిన: తెలుపువర్ణ వస్త్రధారణలో మహాగౌరి రూపంలో దర్శనం
11న: ఎరుపురంగు వస్త్ర ధారణలో సిద్ధిధాత్రి రూపంలో దర్శనం (చండీహోమం, బలిహరణ, పూర్ణాహుతి తదితర పూజలు ఉంటాయి)
12న: విజయ దశమి సందర్భంగా శమీవృక్షానికి పూజలు చేస్తారు

నేడు రైతులకు రాజన్న కోడెల పంపిణీ

వేములవాడ: వేములవాడ రాజన్నకు భక్తులు సమర్పించుకునే నిజకోడెలను గతంలో దరఖాస్తు చేసుకున్న అర్హులైన హిందూ రైతులకు సోమవారం రెండో విడత ఉచితంగా పంపిణీ చేయనున్నారు. తిప్పాపూర్‌లోని గోశాలలో ఉదయం 10.30 గంటల నుంచి పంపిణీ చేయనున్నట్లు ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, పశుసంవర్ధకశాఖ అధికారులు, ఆలయ అధికారులు హాజరవుతారని వివరించారు.

ఫోక్ సింగర్‌పై లైంగిక దాడి కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో సాంస్కృతిక సారథి ఉద్యోగి, ఫోక్ సింగర్ సింగారపు మల్లేశం అలియాస్ మల్లిక్ తేజపై లైంగికదాడి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన ఫోక్‌సింగర్, రైటర్ అయిన యువతి, బుగ్గారం మండలం చిన్నాపూర్ గ్రామానికి మల్లిక్ తేజ కలిసి జగిత్యాల జిల్లాకేంద్రంలో కొద్దికాలంగా ఎంవీ మ్యూజిక్ స్టూడియో నడిపిస్తున్నారు. కొద్దిరోజులుగా తనను భయభ్రాంతులకు గురిచేస్తూ లైంగిక దాడి చేస్తున్నాడని యువతి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో మల్లిక్‌తేజపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- బంగారం, నగదు అపహరణ


దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని వెంకటాద్రినగర్‌కు చెందిన ముసిపట్ల ఉదయ్‌కుమార్ ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. వెంకటాద్రి నగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్ శనివారం ఇంటికి తాళం వేసి పెద్దపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి వద్ద ఉన్న సీసీ కెమెరాలు, తాళం పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోకెళ్లి పరిశీలించగా బీరువా పగులగొట్టి మూడు తులాల బంగారు గొలుసు, తులం పుస్తెలు, రూ.55వేలు నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న రూరల్ సీఐ కృష్ణారెడ్డి, పట్టణ ఎస్సై మన్మథరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హార్వెస్టర్ పరికరాలకు వెళ్లి దుర్మరణం

- కారు, మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు


స్వామినాయక్ (ఫైల్)

ధర్మారం(ధర్మపురి): ధర్మారం మండలం ఎర్రగుంటపల్లి గ్రామశివారులో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కమ్మరిఖాన్‌పేట తండాకు చెందిన అజ్మీర స్వామినాయక్(40) మృతి చెందగా, పెర్కపల్లి గ్రామానికి చెందిన గాదం రవి తీవ్రంగా గాయపడ్డాడు. ఏఎస్ఐ జలీల్ అహ్మద్ కథనం ప్రకారంగా.. స్వామినాయక్ తన హార్వెస్టర్ డ్రైవర్ గాదం రవితో కలిసి మోటార్ సైకిల్‌పై హార్వెస్టర్‌కు అవసరమైన పరికరాలు కొనుగోలుచేసి తీసుకురావటానికి ధర్మారం వస్తున్నారు. ఎర్రగుంటపల్లి గ్రామశివారులోకి రాగానే ఎదురుగా కరీంనగర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకింది. ఈ సంఘటనలో స్వామినాయక్, రవి కిందపడి తీవ్రం గాయపడ్డారు. స్థానికులు వెంటనే కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామినాయక్ మృతి చెందాడు. గాదం రవి కాలు విరిగింది.మృతుడి సోదరుడు అజ్మీర నర్సునాయక్ ఫిర్యాదు మేరకు కారు నడుపుతున్న ఎర్రోజు సంతోష్‌కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ వివరించారు.

దేవీనవరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



3 నుంచి ప్రారంభం కానున్న దేవీ నవరాత్రోత్సవాలకు సిద్ధమవుతున్న వేదిక, వాహనాలు


ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

- రాజన్న ఆలయంలో నిత్యకల్యాణాలు రద్దు

వేములవాడ: రాజన్న సన్నిధిలో అక్టోబర్ 3 నుంచి 12 వరకు పది రోజులపాటు దేవీనవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బాలత్రిపురాసుందరీదేవి అమ్మవారి ఆలయం ఎదుట వేదిక సిద్ధం చేశారు. స్వామి వారి ఊరేగింపునకు ఉపయోగించే రకరకాల వాహనాలను ఆదివారం శుభ్రం చేయించారు. ఆలయ గోపురాలకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తున్నారు. ఈనెల 9న మూలనక్షత్ర పుస్తకరూపిణి మహాసరస్వతి పూజ, 10న దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి చండీకలశప్రతిష్ఠ, చండీ సప్తశతీహవనం, రాత్రి 8 గంటలకు మహిషాసురమర్దని అమ్మవారికి మహాపూజ, 11న పూర్ణాహుతి, 12న విజయదశమి సందర్భంగా ఆయుధపూజ, స్వామివారి పెద్దసేవలపై శమీపూజ నిర్వహించనున్నట్లు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి వివరించారు. పది రోజులపాటు నిత్య కల్యాణాలు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి అనంతలోకాలకు..

- చేదబావిలో పడి బాలుడి మృతి


నందకుమార్ (ఫైల్)


బాలుడిని పరీక్షిస్తున్న వైద్యులు

పెద్దపల్లిరూరల్: ఆడుకుంటూ వెళ్లి ఇంటి ఆవరణలోని చేదబావిలో పడి మడిపల్లి నందకుమార్(6) మృతి చెందాడు. పెద్దపల్లి పట్టణంలోని బండారికుంటకు చెందిన మడిపల్లి కరుణాకర్ – సంధ్య దంపతులకు ఉన్న ఒక్కగానొక్క కుమారుడు.. ఆదివారం ఆడుకుంటూ వెళ్లి ఇంట్లో ఉన్న చేదబావిలో పడిపోయాడు. బాబు అరుపులు విని స్థానికులు వచ్చి బాలుడిని వెలికితీశారు. ఆ వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలుడు నందకుమార్ మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. 'ఆరేండ్లకే నీకు నూరేండ్లు నిండాయా కొడుకా..' అంటూ తల్లి రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. ఈ ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

- వేములవాడలో 108 అడుగుల ఆది శంకరుల విగ్రహ ప్రతిష్ఠ

రాజన్న సేవలో శృంగేరిపీఠం శిష్య బృందం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శృంగేరిపీఠం శిష్యబృందం, ఆలయ అధికారులు

వేములవాడ: తెలుగు రాష్ట్రాల శృంగేరిపీఠం సంచాలకులు పసర్లపాటి బంగారయ్యశర్మ ఆదివారం రాజన్నను దర్శించుకున్నారు. అనంతరం చైర్మన్ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిశంకరుల విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అగ్రహారం గుట్టల ప్రాంతంలో 108 అడుగుల ఎత్తయిన ఆది శంకరుల విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆసక్తి గల వారు రూ.108 చెల్లించి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రొటోకాల్ ఏఈవో రమేశ్‌బాబు, పర్యవేక్షకులు తిరుపతిరావు, అశోక్ ఉన్నారు.

క్రీడలతో శారీరక, మానసికోల్లాసం

- ఎస్ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి
- ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ సైకిల్‌పోలో విజేతలకు బహుమతులు ప్రదానం


గెలుపొందిన విద్యార్థులతో పోటీల నిర్వాహకులు, అధ్యాపకులు, టీచర్లు, తదితరులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి

గంగాధర(చొప్పదండి): క్రీడలతో శారీరక, మానసికోల్లాసంతోపాటు స్నేహభావం పెరుగుతుందని ఎస్ ఆర్ విద్యాసంస్థల జోనల్ ఇన్‌చార్జి నేదూరి తిరుపతి అన్నారు. మండలంలోని రంగరావుపల్లి గ్రామం ఎస్ఆర్ ప్రైమ్ విద్యాసంస్థల ఆవరణలో ఆదివారం ఫస్ట్ ఇంటర్ డిస్ట్రిక్ సైకిల్‌పోలో చాంపియన్‌షిప్ -2024 పోటీలు నిర్వహించారు. విద్యార్థులు, యువత మొబైల్స్, టీవీలు చూడటం తగ్గించి నచ్చిన క్రీడా పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. వివిధ జిల్లాల నుంచి క్రీడాకారులు సబ్ జూనియర్స్, జూనియర్స్ బాయ్స్, గర్ల్స్, సీనియర్ మెన్, ఉమెన్స్ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఎస్సార్ విద్యాసంస్థల డీన్ రవీందర్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, తెలంగాణ సైకిల్‌పోలో అసోషియేషన్ చైర్మన్ సత్యనారాయణ, అధ్యక్షుడు జీవరత్నం, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ నిరంజన్ పాల్గొన్నారు.

రాజన్నకు మొక్కులు


రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల రద్దీని గమనించిన ఆలయ అధికారులు గర్భగుడి దర్శనాలు రద్దు చేశారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు చేసిన భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు, కోడె మొక్కు, నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు.


రాజన్న దర్శనం కోసం క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

క్లుప్తంగా

‘సుడా’ చైర్మన్‌కు సన్మానం



నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

కొత్తపల్లి: కరీంనగర్ సీతారాంపూర్‌లోని రెడ్డి కల్యాణ మంటపంలో ఉమ్మడి జిల్లా ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. తొలుత నరేందర్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకులు రాజాబహద్దూర్ వెంకట్‌రాంరెడ్డి విగ్రహానికి పూలమాలలు నివాళి అర్పించారు. అనంతరం కోలాటాలు, డప్పులు, ఒగ్గుడోలు కళాకారులతో ర్యాలీగా తీసుకొచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్ బీవీఆర్‌ఆర్ అధ్యక్షుడు, కార్యవర్గం, ఐక్యవేదిక నాయకులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు హౌసింగ్ బోర్డ్ కాలనీ కమిటీ ఏర్పాటు



హాజరైన మున్నూరు కాపు సంఘ సభ్యులు

కరీంనగర్ టౌన్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మున్నూరు కాపు సంఘాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. ఆదివారం కాలనీలో సమావేశమైన కాపు కులస్తులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నలవాల రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా తోట రాజేందర్, ఉపాధ్యక్షులుగా మాణిక్యరావు, లక్ష్మీనారాయణ, కోశాధికారిగా గుండ సంతోష్, జాయింట్ సెక్రటరీగా కొలగాని నర్సింగ్, కార్యవర్గ సభ్యులుగా చల్ల జనార్దన్, గుర్రాల శ్రీనివాస్, నర్మాల పరంధాములు, కోల శ్రీనివాస్, జేవీ రమణలను నియమించారు. సంఘం గౌరవ అధ్యక్షులుగా ఆకుల ప్రకాశ్, సలహాదారులుగా ఆకుల సుదర్శన్, దిండిగాల మధు వ్యవహరించనున్నారు.

టవల్స్ పంపిణీ



కరీంనగర్: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని హౌసింగ్ బోర్డుకాలనీలో గల వీరబ్రహ్మేంద్ర వృద్ధాశ్రమంలో ఆదివారం హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో దోతులు, టవల్స్ పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్, సభ్యులు వేణుగోపాల్‌శర్మ, వీరమాధవ్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

కరీంనగర్: బీసీ హక్కుల కోసం ఆమరణ దీక్ష చేసి ఆరోగ్యం క్షీణించి కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీసీ, ఆజాది యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్‌ను ఆదివారం పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మోతుకు సత్యం పరామర్శించారు. వీరోచిత పోరాటంతో బీసీ ఉద్యమాన్ని తట్టి లేపిన సంజయ్‌కుమార్‌ను ప్రశంసించారు. త్వరగా కోలుకొని భవిష్యత్ కార్యాచరణకు సిద్ధం కావాలని దేవుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు. ఆయన వెంట పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి రవీందర్, వాసు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

కరీంనగర్: జిల్లాలో 186 మంది సెలెక్టెడ్ అభ్యర్థుల లిస్టు జిల్లా విద్యాశాఖ కార్యాలయం ప్రదర్శించిన సందర్భంగా అందులో గతంలో ఎంపిక కాబడిన 13 మంది పేర్లు లేకపోవడంతో వారికి న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఈవో జనార్దన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పీఆర్‌టీయూ నాయకులు మండల ఆనందం పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు

మహాశక్తి ఆలయం ముస్తాబు

కరీంనగర్‌కల్చరల్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు నగరంలోని చైతన్యపురిలో గల మహాశక్తి ఆలయం ముస్తాబైంది. అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు కనువిందు చేసేలా ఆలయ ప్రాంగణంతో పాటు పరిసర వీధులన్నీ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయానికి వచ్చే దారుల్లో వివిధ దేవతల రూపంలో ఏర్పాటు చేసిన కటౌట్లు విద్యుద్దీపాల వెలుగులతో విరజిమ్ముతున్నాయి. జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతీస్వాముల ఆశీస్సులతో దేవీ నవరాత్రోత్సవాలు జరుగనున్నాయి. ఏటా భవానీ దీక్షలు తీసుకునే వారు ఇక్కడనే విరమణ చేస్తారు. 108, 41, 21, 11 రోజులు నవరాత్రి దీక్ష స్వీకరిస్తూ అమ్మవారిని సేవలో తరిస్తారు.

అక్టోబర్ 3 నుంచి 12వరకు వేడుకలు



ముస్తాబైన మహాశక్తి ఆలయం

రోజు వారీ కార్యక్రమాల వివరాలు

- అక్టోబర్ 3న గురువారం బాలాత్రిపుర సుందరిదేవి (శైలపుత్రి) అవతారం, ఉదయం బాలాత్రిపుర సుందరీదేవి పూజ, సాయంత్రం మహాదుర్గా అమ్మవారికి ఫలపంచామృత అభిషేకం, పుష్పాభిషేకం.
- 4న శుక్రవారం శ్రీ గాయత్రీ దేవి (బ్రహ్మచారిని) అవతారం., గాయత్రీ దేవి పూజ, డ్రై ఫ్రూట్స్ తో అలంకరణ, సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు.
- 5న శనివారం అన్నపూర్ణ దేవి (చంద్ర ఘంట) అవతారం, అన్నపూర్ణాదేవి పూజ, శాకాంబరీ అలంకరణ, సాయంత్రం 108 రకాల నైవేద్యాల సమర్పణ, కొడకండ్ల రాధాకృష్ణశర్మతో భగవన్నామ సంకీర్తనం.
- 6న ఆదివారం లలితాదేవి (కూష్మాండ) అవతారం, ఉదయం లలితాదేవి పూజ, గాజులతో అలంకరణ, సాయంత్రం లలిత సహస్రనామం, సౌందర్య లహరి, కనకధార స్తోత్ర పారాయణం.
- 7న సోమవారం మహాచండీ దేవి (స్కంద మాత) అవతారం, ఉదయం శ్రీమహాచండీ దేవి పూజ, పండ్లతో అలంకరణ. సాయంత్రం లింగార్చన.
- 8న మంగళవారం శ్రీమహాలక్ష్మి దేవి (కాత్యాయని) అవతారం, ఉదయం మహాలక్ష్మి దేవి పూజ, నాణాలు, తామర పూలతో అలంకరణ, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం.
- 9న బుధవార మూలనక్షత్రం శ్రీసరస్వతీ దేవి (కాళరాత్రి) అవతారం, సరస్వతీదేవి పూజ, పూలతో అలంకరణ, సాయంత్రం విద్యార్థులతో సరస్వతీపూజ, పల్లకి సేవ, రతన్‌కుమార్ శిష్య బృందంతో శాస్త్రీయ ఆలయనృత్యాలు.
- 10న గురువారం దుర్గాష్టమి దుర్గాదేవి (మహాగౌరీ) అవతారం. మహాదుర్గ పూజ, పసుపు కొమ్ములతో అలంకరణ. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో బతుకమ్మ పూజలు.
- 11న శుక్రవారం మహార్నవమి మహిషాసురమర్దిని దేవి (సిద్ధి రాత్రి) అవతారం, మహిషాసురమర్దిని దేవి పూజ, పసుపు కుంకుమతో అలంకరణ, రుద్రసహిత చండీహోమం. సాయంత్రం మహిషాసుర సంహారం.
- 12న శనివారం రాజరాజేశ్వరిదేవి పూజ (విజయదశమి), శమీ పూజ, ఉదయం 9 గంటల నుండి వాహన పూజలు జరగనున్నాయి.
- ప్రతిరోజూ రాత్రి 9 గంటల నుంచి అమ్మవారి సన్నిధిలో దాండియా కార్యక్రమం నిర్వహించనున్నారు.



విద్యుత్ కాంతుల వెలుగుల్లో ముఖద్వారం

సాహిత్యం, కళలు సమాజాన్ని చైతన్యపరుస్తాయి



పురస్కారం అందుకుంటున్న కవయిత్రి సీత

కరీంనగర్‌కల్చరల్: సాహిత్యం సమాజాన్ని చైతన్యం పరిచి సంస్కరిస్తుందని, కళలు మానవాళిని సర్వోన్నత మార్గంలో నడిపిస్తాయని పెద్దపెల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. ఆదివారం ఫిలింభవన్‌లో జాతీయ సాహిత్య పరిషత్, కరీంనగర్ జిల్లా శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి రజినిశ్రీ నవలా పురస్కారం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సాహితీవేత్తలు, కళాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో సాహిత్య కళ, విద్య, క్రీడా రంగాల్లో సమాజాన్ని విశేషంగా ప్రభావితం చేసిన తమ తండ్రిగారైన గాజుల రజినిశ్రీ పేరు మీద ఏటా సాహిత్య పురస్కారం అందజేస్తున్నట్లు వివరించారు. 2024 సంవత్సరానికి నవల విభాగంలో కవియిత్రి చుండూరు సీత రచించిన ‘ సారంగి’ నవలకు రజినిశ్రీ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు గాజుల రవీందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నంది శ్రీనివాస్, గాజుల సత్యవతి, డా.గండ్ర లక్ష్మణరావు, డా.మచ్చ హరిదాసు, దాస్యం సేనాధిపతి, డా.పొన్నం రవిచంద్ర, అన్నవరం దేవేందర్, స్తంభంకాడి గంగాధర్, ముత్తినేని శ్రీనివాస్, గంగుల శ్రీకర్, పద్మశ్రీ, అనిత తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యం



మాట్లాడుతున్న బొంత దామోదర్‌రావు

విద్యానగర్(కరీంనగర్) రాష్ట్రంలోని పాడి రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపర్చే లక్ష్యం ప్రియ మిల్క్ ప్రొడక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బొంత దామోదర్‌రావు అన్నారు. ఆదివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 20 ఏళ్ల క్రితం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ ఏర్పాటు చేసిన పాల డెయిరీ సంస్థకు అండగా ఉన్న పాడిరైతులకు, వినియోగదారులకు కృతజ్ఞతలు తెలిపారు. తమ సంస్థ ద్వారా ప్రతీరోజు 300 గ్రామాల్లోని 10వేల పాడి రైతుల నుండి పాలు సేకరిస్తూ వారి ఆర్థిక స్థితిని బలోపేతం చేయడానికి తోడ్పడుతున్నామన్నారు. సంస్థ ద్వారా 250 మంది ప్రత్యక్షంగా 1900 మంది పరోక్షంగా లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు రాంమోహన్‌రావు, సునీల్‌రావు పాల్గొన్నారు.

పారమితలో ‘దసరా కార్నివాల్’



విద్యార్థుల నృత్యం

కరీంనగర్: జ్యోతినగర్‌లోని ఎక్స్‌ప్లోరికా పాఠశాల, మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో ఆదివారం ‘దసరా కార్నివాల్’ పేరిట సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు సాంప్రదాయ దుస్తులు ధరించి సృజనాత్మక నైపుణ్యంతో వివిధ రకాల పూలతో పోటాపోటీగా బతుకమ్మలను పేర్చి అలంకరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులకు బతుకమ్మలు పేర్చే విధానం, బతుకమ్మ పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయంగా భావించి రావణ విగ్రహాన్ని కాల్చారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థినులు, వారి తల్లులు, ఉపాధ్యాయినులు, కోలటాలు, నృత్యాలు, పాటలతో అలరించారు. ఈ సందర్భంగా పారమిత విద్యా సంస్థల చైర్మన్ ప్రసాదరావు ముందస్తు బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, ప్రాచీ, వినోదరావు, వీయూఎం.ప్రసాద్, రమణ, హనుమంతరావు, ప్రధానోపాధ్యాయురాలు శర్మిష్ఠ బసు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో గ్రేడింగ్ టెస్ట్ ప్రోగ్రాం



కరంనగర్‌కల్చరల్: తైక్వాండో మాస్టర్ బుర్ర ప్రవీణ్‌కుమార్ మానస ఆధ్వర్యంలో ఆదివా రం కరీంనగర్‌లోని సెయింట్ అల్ఫోన్స్ హైస్కూల్‌లో తైక్వాండో గ్రేడింగ్ టెస్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, చీఫ్ ఎక్సామినర్ వసంత్‌కుమార్, సెయింట్ అల్ఫోన్స్ టి.సంతోష్‌కుమార్‌లు తైక్వాండో బెల్ట్స్ సాధించిన క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు శరత్, సందీప్, వంశీ, అనూష, నికిల్ పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ లైన్ నిర్వహణ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గౌతమినగర్, వినాయకనగర్, కట్టరాంపూర్, తిరుమల్‌నగర్, అంబేద్కర్ స్టేడియం నుంచి డ్యాం రోడ్ వెళ్లే ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

కరీంనగర్ రూరల్‌లో..

విద్యుత్ టవర్ల నిర్మాణ పనులు చేపడుతున్నందున సోమవారం మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 33/11 కేవీ నగునూర్, ఆర్నకొండ, రుక్మాపూర్, కాట్నపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

సమాచారం

నేడు ప్రొఫెసర్ కోదండరాంకు సన్మానం

విద్యానగర్(కరీంనగర్): ఎమ్మెల్సీగా నియామకమైన ప్రొఫెసర్ కోదండరాంకు సోమవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో పౌర సన్మానం చేయనున్నట్లు తెలంగాణ జన సమితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి ముక్కెర రాజు, జన సమితి నాయకులు అరికిల్ల స్రవంతి, మోరె గణేశ్, కర్రె సతీశ్ తెలిపారు.

కార్యవర్గం

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ

విద్యానగర్(కరీంనగర్): ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీని ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా శనిగరపు సురేశ్, కో కన్వీనర్‌గా కోలపురి వెంకటేష్, అధికార ప్రతినిధిగా తడగొండ ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శిగా దొమ్మాటి తిరుపతి, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా శనిగరపు కిరణ్‌తేజ, ప్రచార కార్యదర్శిగా మానుబాపు హరీష్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు తడగొండ సత్యరాజ్‌వర్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు మోదుంపల్లి ప్రేమలత పాల్గొన్నారు.





నగరంలోని విద్యానగర్‌లో గల కరీంనగర్-మల్కాపూర్ మెయిన్ రోడ్డులో ఇటీవల తాగునీటి పైప్‌లైన్ మరమ్మతు పనులు చేపట్టారు. అయితే మరమ్మతులు చేసి, గుంతలు పూడ్చకుండానే వదిలివేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకొని గుంతలు పూడ్చాలి.

– తలకొక్కుల సదానందం, విద్యానగర్

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
చైతన్య, ఏఈ, 7995013529

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 94400 77555

ఎమ్మెల్సీగా బరిలో నిలుస్తున్నా



మాట్లాడుతున్న సుగుణాకర్ రావు

కరీంనగర్ టౌన్: కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని బీజేపీ సీనియర్ నాయకుడు సుగుణాకరావు వెల్లడించారు. పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వం కూడా అండగా నిలుస్తుందన్నారు.ఆదివారం కరీంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు పడ్డ ఇబ్బందులను నేటికీ మరిచిపోలేక పోతున్నామని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీపై నిరుద్యోగులు, యువత, అన్ని వర్గాల ప్రజల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతుందని, ఈసారి జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు ఆదరిస్తారనే ధీమా వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కూడా అత్యధికంగా గ్రాడ్యుయేట్ ఓటర్లను నమోదు చేయించామన్నారు. ఈనెల 30 నుంచి ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని, ప్రతిఒక్కరూ తమ పేర్లను నమోదు చేయించుకోవాలని తెలిపారు. నిరుద్యోగుల, యవత, అన్ని వర్గాల గొంతుకగా వినిపిస్తానని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు దుర్గం మారుతి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు అండగా నిలుస్తా



మాట్లాడుతున్న ముస్తాక్ అలీఖాన్

కరీంనగర్: కరీంనగర్ నియోజక వర్గం పట్టుభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనకు ఒక్కసారి అవకాశం ఇవ్వాలని, నిరుద్యోగులకు అండగా నిలుస్తానని లక్ష్య్ విద్యాసంస్థల చైర్మన్ ముస్తాక్ అలీఖాన్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో పట్టుభద్రులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తాను శాసనమండలికి పోటీ చేస్తున్నానని అన్నారు. అవకాశం ఇస్తే ఉద్యోగుల సమస్యలతో పాటు నిరుద్యోగులకు విద్య,, ఉపాధి అవకాశాలు పెంపొందిస్తానని తెలిపారు. విద్యాసంస్థలు స్థాపించి క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ వేలాది మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దానని అన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులతో పాటు వివిధ విద్యాసంస్థల విద్యార్థులు, యాజమాన్యాలు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న పోలు సత్యనారాయణ

కరీంనగర్: విద్యారంగంలో నూతన సంస్కరణలు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. బీజేపీ అనుబంధ తపస్ మాజీ బాధ్యుడు పోలు సత్యనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని పద్మశాలి సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా 28 ఏళ్ల సేవలందించి విద్యార్థుల, ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘ నేతగా కృషి చేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన తాను వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ స్థానం నుంచి టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు. విద్యారంగంలో సంస్కరణలు చేపట్టి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పన, ఉపాధ్యాయుల, విద్యాశాఖలోని ఖాళీల భర్తీ, ప్రైవేట్ విద్యాసంస్థలకు రాయితీలు కల్పించడం, ప్రైవేట్ టీచర్లకు ఆరోగ్య బీమా తదితర సంక్షేమ పథకాల అమలు వంటి చర్యలు తీసుకోవల్సిన అవసరముందని అన్నారు. నూతన విద్యావిధానానికి అవసరమైన సలహాలు, సూచనలను చట్టసభల ద్వారా ప్రభుత్వాలకు తీసుకెళ్లాలనే ఆలోచనతో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. విలేకరులల సమావేశంలో పద్మశాలి పోపా నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కరీంనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షిస్తూ వారి ప్రయోజనాలను కల్పించడంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతతో పనిచేస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, టీఆర్‌టీఎఫ్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు శంకిశెల ప్రభాకర్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని, అన్ని రంగాల నిపుణులను తయారు చేసేది ఒక ఉపాధ్యాయుడు మాత్రమేనని, వారి ద్వారానే సమాజ అభివృద్ధి జరుగుతుందన్నారు. పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు దేశ సర్వతోముఖాభివృద్ధికి పునాది లాంటివార అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేష్ మాట్లాడుతూ, సంఘంలో నిబద్ధత గల కార్యకర్త సుంకిశేల ప్రభాకర్ రావు అని కొనియాడారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్, లక్కిరెడ్డి సంజీవరెడ్డి, కటకం రవికుమార్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం





కొత్తపల్లి: కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1992–93 పదో తరగతి విద్యార్థుల అ‘పూర్వ’ సమ్మేళనం ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో అట్టహాసంగా జరిగింది. మూడు దశాబ్దాల అనంతరం సుమారు 90 మంది విద్యార్థులు ఒకే చోట కలుసుకొని గత స్మృతులను నెమరేసుకోవడంతో పాటు ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకున్నారు. అందరం కలిసికట్టుగా ఉంటూ సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకుందామని నిర్ణయించారు.

ఎస్ఈఎస్ డిగ్రీ కళాశాలలో

కరీంనగర్: నగరంలోని ఎస్ఈఎస్ డిగ్రీ కళాశాలలో 1993–96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాల వేదికగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి రోజులు గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పదన్ని కొనియాడారు. అప్పటి ప్రిన్సిపాల్ సదాశివశర్మ, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్, ఉపాధ్యాయులు రాంరెడ్డి, మల్లారెడ్డి, హరిప్రసాద్, వేణుగోపాల రెడ్డి, జైపాల్ రెడ్డి, శ్రీనివాస్, ఎన్నం ప్రకాశ్, రాచమల్ల రాజిరెడ్డి, గుండా శ్రీనివాస్, రేగురి లక్ష్మణ్, సతీశ్, కిరణ్, కృష్ణ, చంద్రశేఖర్, జూపల్లి వెంకటేశ్వరావు, విజయ, గీత, ఉమా, గుర్రం శ్రీనివాస్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్కల దాడిలో 44 మందికి గాయాలు

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం భాగిర్థిపేట, దుంపిల్లపల్లి గ్రామాల్లో ఆదివారం మధ్యాహ్నం పిచ్చికుక్కలు స్వైర విహారం చేశాయి. చిన్న, పెద్ద, ముసలి తేడా లేకుండా మీద పడి గాయపరిచాయి. ఈ దాడిలో దాదాపు 44 మంది వరకు గాయపడ్డారు.

(...5వ పేజీ తరువాయి)

SECOND SCHEDULE
FORM 19
(See rule 31)
ELECTION COMMISSION OF INDIA
Claim for inclusion of name in the electoral roll for a Teachers' Constituency

To
The Electoral Registration Officer,
______________ (Teachers')
Constituency

SPACE FOR PASTING ONE RECENT UNSIGNED PASSPORT SIZE COLOR PHOTOGRAPH (4.5 CM x 3.5 CM) SHOWING FRONTAL VIEW OF FULL FACE WITH WHITE BACKGROUND

Sir,
I request that my name be registered in the electoral roll for the ______________ (Teachers') Constituency.

The particulars are:-
Full Name
Sex ______
Father's /Mother's/Husband's name (in full),
House Address (Place of ordinary residence)

House/Building/Apartment No.	Street/Mohalla
Town/Village	Post Office
Police Station/Tehsil/Taluqa/Mouza	
District	State

Age Years Months Date of Birth

Disability (if any):- (Tick appropriate box)(optional Field)
Visual Impairment / Speech & hearing disability / Locomotor disability / Other

Whether registered as an elector for any assembly constituency ______
If yes, then mention the following—
a) Number and name of the assembly constituency
b) Part/polling station No. (if Known)
c) Date of birth
d) EPIC number (if any)

Aadhaar Details:- (please tick the appropriate box)
(a) Aadhaar Number or
(b) I am not able to furnish my Aadhaar Number because I don't have Aadhaar Number

Contact Number:-
Mobile No. (optional)
Landline
Email id (if any) ______

2. During the last six years, I have been engaged in teaching for a total period of more than three years as follows-

Name of Educational Institution	From (Date)	To(Date)	Period
1.			
2.			
3.			

In support of the above, I submit herewith ______

3. ** My name has not been included in the electoral roll for this or any other teachers' constituency
OR
** My name has been included in the electoral roll for the .... teachers' constituency under the address given below and I request that it be deleted from that roll:-

4. I declare that I am a citizen of India and that all the particulars given above are true to the best of my knowledge and belief.
Place ______
Date ______ Signature of claimant

Note:- Any person who makes a statement or declaration which is false and which the either knows or believes to be false or does not believe to be true is punishable under section 31 of the Representation of the People Act, 1950.
*strike out the paragraph not applicable

..........(Perforation)..........
Intimation of action taken

The application in Form 19 of Shri/Smt/Kumari .... address ....
has been:-
a) accepted and the name of Shri/Smt/Kumari.................... has been registered at Serial No.............. in Part No.............
b) rejected for the reason....................

Date: ______ Electoral Registration Officer
Address ______

..........(Perforation)..........
Receipt of application
Received the application in Form 19 from Shri/Smt/kumari*....................
address*....................

Date: ______ Electoral Registration Officer
Address ______

*to be filled in by the applicant

SCHEDULE

Sl. No	Activities	Period/Date
1	Issue of Public notice under rule 31 (3) of the Registration of Electoral Rules, 1960	30.09.2024 (Monday)
2	First Republication of Notice in News Papers under Rule 31 (4) of the Registration of Electoral Rules, 1960	16.10.2024 (Wednesday)
3	Second Republication of notice in News Papers under Rule 31 (4) of the Registration of Electoral Rules, 1960	25.10.2024(Friday)
4	Last date of receipt of applications in Form 19	06.11.2024 (Wednesday)
5	Period for the preparation of manuscripts and printing of draft electoral rolls by	20.11.2024 (Wednesday)
6	Draft publication of Electoral Rolls	23.11.2024 (Saturday)
7	Period for filling claims and objections	23.11.2024 (Saturday) to 09.12.2024 (Monday)
8	Data by which the claims and objections shall be disposed of and supplements be prepared and printed	25.12.2024 (Wednesday)
9	Final publication of Electoral rolls	30.12.2024 (Monday)

Sd/- P. Pavan Kumar
Electoral Registration Officer &
District Revenue Officer (FAC), Karimnagar
DIPR RO No. SPL-01-PP/CL/ADVT/1/2024-25, Dt. : 29.09.2024

కృష్ణా బేసిన్‌లో 3,048 టీఎంసీల నీరు

- కొత్త అధ్యయనంలో తేల్చిన కేంద్ర జలసంఘం
- బచావత్, బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునళ్ల కంటే 875 టీఎంసీల మేర అధిక నీటిలభ్యత ఉందని వెల్లడి
- 38 ఏళ్ల ప్రవాహాలను పరిగణనలోకి తీసుకున్న సీడబ్ల్యూసీ
- వందేళ్ల ఏళ్ల ప్రవాహాలను అధ్యయనం చేస్తేనే శాస్త్రీయంగా ఉంటుందన్న నిపుణులు



కృష్ణాలో నీటి లభ్యతపై వివిధ అధ్యయనాలలో వెల్లడైంది ఇదీ..

అధ్యయనం చేసిన సంవత్సరం	అధ్యయనం చేసిన సంస్థ	నీటి లభ్యత (టీఎంసీల్లో)
1901–03	ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్	2,996.80
1949	ఖోస్లా ఎంపీరికల్ ఫార్ములా	1,575.75
1953	కృష్ణా, గోదావరి టెక్నికల్ కమిటీ	1,655.20
1960	సీడబ్ల్యూపీసీ	2,039.78
1962	కృష్ణా, గోదావరి కమిషన్	2,217.06
1973	కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్	2,372.80
1993	సీడబ్ల్యూసీ	2,758.79
2019	సీడబ్ల్యూసీ	3,144.42
2024	సీడబ్ల్యూసీ	3,048.37

సాక్షి, హైదరాబాద్: కృష్ణానది బేసిన్‌లో 3,048.37 టీఎంసీల నీటిలభ్యత ఉన్నట్టు కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) కొత్త అధ్యయనంలో తేల్చింది. కృష్ణా పరీవాహక ప్రాంతంలో 1985–86 నుంచి 2022–23 మధ్యకాలంలోని 38 ఏళ్ల ప్రవాహాల లెక్కల ఆధారంగా నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది. దాని ఆధారంగా తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. కృష్ణాబేసిన్‌లో 2,130 టీఎంసీల నీటిలభ్యత ఉందని బచావత్ ట్రిబ్యునల్ తేల్చితే, 2,173 టీఎంసీల లభ్యత ఉన్నట్టు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ నిర్ధారించింది. ఆ రెండు ట్రిబ్యునళ్ల కంటె 8,75 టీఎంసీల నీటిలభ్యత అధికంగా ఉందని సీడబ్ల్యూసీ చెప్పింది. అయితే 38 ఏళ్ల ప్రవాహాల ఆధారంగా చేసిన అధ్యయనానికి శాస్త్రీయత ఉండదని, సాగునీటి రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వందేళ్లు లేదా కనీసం 50 ఏళ్ల ప్రవాహాలను ప్రామాణికంగా తీసుకోవాలంటున్నారు.

దేశ భౌగోళిక విస్తీర్ణంలో 7.9 %

మహారాష్ట్రలోని మహాబలేశ్వర్ సమీపంలోని పర్వతశ్రేణుల్లో జోర్ అనే గ్రామం వద్ద సముద్ర మట్టానికి 1,337 మీటర్ల ఎత్తులో పురుడుపోసుకున్న కృష్ణమ్మ.. కర్ణాటక, తెలంగాణ, ఏపీ మీదుగా 1,400 కిలోమీటర్ల దూరం ప్రయాణించి కృష్ణా జిల్లాలోని హంసలదీవి వద్ద సముద్రంలో కలుస్తుంది. కృష్ణా బేసిన్ 2,59,439 చదరపు కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించింది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 7.9 శాతానికి సమానం. మహారాష్ట్రలో 26.60 శాతం, కర్ణాటకలో 43.80 శాతం, తెలంగాణలో 19.80, ఏపీలో 9.80 శాతం కృష్ణా బేసిన్ పరిధి ఉంది. కృష్ణానదిలో కుడివైపు నుంచి కోయినా, వర్ణ, పంచ్‌గంగా, దూద్‌గంగా, ఘటప్రభ, మలప్రభ, భీమా, తుంగభద్ర, కాగ్నా.. ఎడమవైపు నుంచి మూసీ, మున్నేరు వంటి ప్రధాన ఉపనదులు కలుస్తాయి.

2005–06లో 10,716 టీఎంసీల గరిష్ఠ ప్రవాహం

కృష్ణా బేసిన్‌లో 1985–86 నుంచి 2022–23 మధ్య 38 ఏళ్లలో సగటున 843.20 మి.మీల వర్షపాతం కురిసింది. దీని వల్ల ఏటా సగటున 7,725.80 టీఎంసీల ప్రవాహం నమోదైంది. 2005–06లో 1,169.70 మి.మీల వర్షపాతం కురవడంతో ఆ ఏడాది 10,716.60 టీఎంసీల ప్రవాహం వచ్చింది. కనిష్ఠంగా 2018–19లో 568.38 మి.మీల వర్షపాతం కురవడంతో 5,207.50 టీఎంసీల ప్రవాహం మాత్రమే వచ్చింది.

- 2005–06లో గరిష్ఠంగా 5,250.70 టీఎంసీల లభ్యత ఉండగా, 2018–19 లో కనిష్ఠంగా 1,818.70 టీఎంసీల లభ్యత ఉంది. 1985–2023 మధ్య కృష్ణా బేసిన్‌లో సాగునీటి అవసరాలకు ఏటా సగటున 1,781.28 టీఎంసీల నీటిని వినియోగించుకున్నారు. కృష్ణా బేసిన్ పరిధిలోని రిజర్వాయర్లలో ఏటా సగటున 96.06 టీఎంసీల ఆవిరి నష్టాలే ఉండడం గమనార్హం.

బియ్యం.. మరింత ప్రియం

- బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేత
- పారా బాయిల్డ్ బియ్యంపై ఎగుమతుల సుంకం 10 శాతానికి తగ్గింపు
- ఎగుమతులపై 20 శాతం సుంకం ఉన్నప్పుడే కిలో రూ.70కి చేరిన ఫైన్ బియ్యం ధర
- విదేశీ ఎగుమతులకు లైన్ క్లియర్ కావడంతో పెరగనున్న ఎగుమతులు

సాక్షి, హైదరాబాద్: బాస్మతీయేతర బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేతతో సన్నబియ్యం ధరలు మరింత ప్రియం కాబోతున్నాయి. ప్రస్తుతం అధికంగా వినియోగించే సన్న బియ్యం రకాలైన సోనా మసూరి, హెచ్‌ఎంటీ, జైశ్రీరాం, బీపీటీ రకాలు, తెలంగాణ సోనా వంటి మేలిమి బియ్యం ధరలు ఏకంగా కిలో రూ. 60 నుంచి రూ. 70కి చేరుకున్నాయి. బియ్యం ఎగుమతులపై నిషేధం ఎత్తివేస్తూ, కనీస ఎగుమతి ధరను విధిస్తూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీ) శుక్రవారమే నోటిఫికేషన్ విడుదల చేసింది. పారా బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం), బ్రౌన్ రైస్‌పై ఎగుమతి సుంకాన్ని 20 శాతం నుంచి 10 శాతానికి తగ్గించింది. ఈ నేపథ్యంలో దేశీయంగా ఉత్పత్తి అయ్యే సన్నరకాలు భారీ ఎత్తున విదేశాలకు ఎగుమతి అయ్యే అవకాశముంది. అమెరికాతో పాటు బంగ్లాదేశ్, యూరోప్ వంటి 140 దేశాలకు భారత్ నుంచి బియ్యం ఎగుమతులు పెరుగుతాయి. ఈ ప్రభావం దేశీయ బియ్యం మార్కెట్‌పై పడి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు.

గత ఏడాది జూలైలో బియ్యంపై సర్కార్ ఆంక్షలు

2022–23లో ధాన్యం ఉత్పత్తి కొంత తగ్గింది. అదే సమయంలో విదేశాల్లో బియ్యం డిమాండ్ పెరిగి, దేశీయంగా బియ్యం ధరలు భారీగా పెరిగే పరిస్థితులు తలెత్తాయి. ఈ నేపథ్యంలో కేంద్రం గత సంవత్సరం జూలైలో బాస్మతీయేతర తెల్ల బియ్యం, నూకల బియ్యం ఎగుమతులపై నిషేధం విధించింది. పారా బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం), బ్రౌన్ రైస్‌లపై ఎగుమతి సుంకాన్ని 20 శాతం విధించింది. భారత్ నుంచి బియ్యం ఎగుమతి ఆగిపోవడంతో థాయ్‌లాండ్, వియత్నాం , పాకిస్తాన్‌ల నుంచి ఎగుమతులు పెరిగాయి. అయితే భారత్‌లో ఉత్పత్తి అయిన బియ్యానికి డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కేంద్రం నిర్ణయంతో ఒక్కసారిగా దేశీయ బియ్యం ఎగుమతులు పెరుగుతాయని భావిస్తున్నారు.

పెరిగిన ధాన్యం ఉత్పత్తి

2023–24లో దేశంలో ధాన్యం ఉత్పత్తి పెరిగినట్టు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ లెక్కలు వేసింది. తద్వారా బియ్యం నిల్వలు కూడా పెరుగుతాయని చెబుతోంది. ఈ వారంలో దేశీయంగా 137.83 మిలియన్ టన్నుల బియ్యం ఉత్పత్తిని అంచనా వేసింది. ఇది 2022–23లో ఉత్పత్తి అయిన 135.76 మిలియన్ టన్నుల కంటే ఎక్కువ. కాగా ఎగుమతులపై నిషేధం ఫలితంగా 2022–23లో 17.79 మిలియన్ టన్నులతో పోలిస్తే 2023–24 ఆర్థిక సంవత్సరంలో బాస్మతీయేతర తెల్ల బియ్యం ఎగుమతులు 11.12 మిలియన్ టన్నులకు పడిపోయాయి.



ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు సాధారణ 401.55 లక్షల హెక్టార్ల కంటే ఎక్కువగా 409.5 లక్షల హెక్టార్లకు పెరిగింది. తెలంగాణలో కోటి మెట్రిక్ టన్నుల వరకు ఈసారి ధాన్యం దిగుబడి ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది.

మిల్లర్లకు మేలు..సామాన్యులకు షాక్

కేంద్రం నిర్ణయం రాష్ట్రంలోని రైస్ మిల్లర్లకు వరం కానుంది. ప్రభుత్వం సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్న మిల్లర్లు గతంలో ఫైన్ రకాలైన సోనా మసూరి, హెచ్‌ఎంటీ, జై శ్రీరాం, బీపీటీ, తెలంగాణ సోనా మొదలైన వాటిని సొంతంగా మిల్లింగ్ చేసుకొని విక్రయించేవారు. మిర్యాలగూడ, పెద్దపల్లి, నిజామాబాద్ ప్రాంతాల్లోని మిల్లుల నుంచి విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. కేంద్రం ఆంక్షలతో విదేశీ ఎగుమతులకు బ్రేక్ పడింది. అదే సమయంలో సీఎంఆర్ కింద పారా బాయిల్డ్ రైస్ తీసుకోబోమని కేంద్రం చెప్పడంతో మిల్లర్లు 2022 రబీలో మిల్లింగ్ కూడా చేయలేదు. ఆంక్షల సడలింపు నేపథ్యంలో మిల్లర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో పెరిగే ధరలను తలచుకొని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే నుంచి తప్పించండి

- నిరసన వ్యక్తం చేస్తూ బహిష్కరించిన 2,600 మంది ఏఈవోలు
- ఎక్కడికక్కడ షోకాజ్ నోటీసులు ఇస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 'డిజిటల్ క్రాప్ సర్వే'ను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) బహిష్కరిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని తమ ద్వారా అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ ఒత్తిడి తేవడంపై వారు రోజులు గా నిరసన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసా యమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, డైరెక్టర్ గోపీలను కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రామస్థాయిలో సహాయకులు లేకుండానే 49 రకాల రెగ్యులర్ విధులను నిర్వర్తిస్తూ తలకు మించిన భారాన్ని మోస్తు న్నామని... ఇప్పుడు డిజిటల్ క్రాప్ సర్వే పేరిట సాగులో ఉన్న కోటిన్నర ఎకరాల వ్యవ సాయ భూములను ప్రస్తుతమున్న 2,600 మంది వ్యవసాయ విస్తరణ అధికారులతోనే సర్వే చేయించాలని చూడటాన్ని ఏఈవోలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఈనెల 24వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని అధికారులు తమ తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నట్టు వారు చెప్పారు. సర్వేయాప్ డౌన్‌లోడ్ చేసుకోని ఏఈవోలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై వారు మండిపడుతున్నారు.

డిజిటల్ క్రాప్ సర్వే ఏంటంటే?

వ్యవసాయ రంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రా స్ట్రక్చ ర్ (డీపీఐ)ను రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్'పథకాన్ని కేంద్రం తీసు కొచ్చింది. ఇందులో భాగంగా తొలిదశలో 12 రాష్ట్రాలను ఎంపిక చేసి ఆయా రాష్ట్రాల్లో ఉన్న ప్రతీ గుంట భూమిని లాటిట్యూడ్ లాంగిట్యూడ్‌లతో సహా ఫొటోలు తీస్తూ ఆ భూములలో రైతులు ఏం పంటలు వేశారో ఆన్‌లైన్ చేయించడమే డిజిటల్ క్రాప్ సర్వే ముఖ్య ఉద్దేశం. తెలంగాణలోనూ డిజిటల్ సర్వే చేయాలని ఏఈవోలను రాష్ట్ర వ్యవసాయశాఖ ఆదేశించింది. ప్రతీ సీజన్‌లోనూ ప్రతీ భూమిని డిజిటల్ చేయాలని అంటున్నారు. ఇది కష్టమైన వ్యవహారమని ఏఈవోలు వాపోతున్నారు.

12వేల మంది అవసరం : బందెల సుమన్

ఒక మండలంలో పంటల సర్వే పూర్తి చేయడానికి 15 నుంచి 20 మంది ఏఈవోలు అవసరమవుతారని ఏఈవోల సంఘం రాష్ట్ర నాయకులు బందెల సుమన్ చెప్పారు. సాగులోని భూభాగం మొత్తం సర్వే చేపట్టాలంటే 12 వేల మంది సహాయకుల అవసరముంటుందన్నారు.

ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించిన ఇతర రాష్ట్రాలు

రాష్ట్రంలో క్షేత్రస్థాయిలో 2,600 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు మాత్రమే పనిచేస్తున్నారు. వీరు సగటున 6 నుంచి 7 గ్రామాలను పర్యవేక్షించాల్సి వస్తుంది. ఇప్పటికే పని ఒత్తిడితో సతమతమ వుతున్నారు. డిజిటల్ క్రాప్ సర్వేను మానవ వనరుల సహకారంతో చేయాల్సి ఉంది. ఈ పథకం అమలు చేస్తున్న కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో సుమారు 14 వేల నుంచి 20 వేల మంది స్థానిక యువతను తాత్కాలిక ప్రాతిపదికన తీసుకొని సర్వే చేయిస్తున్నారు. మహారాష్ట్ర, ఒడిషా రాష్ట్రాలలో ప్రైవేట్ ఏజెన్సీలకు సర్వే బాధ్యతలు అప్పగించారు. కాగా తెలంగాణలో మాత్రమే తమను చేయని చెప్పడం ఏంటని ఏఈఓలు మండిపడుతున్నారు.

తండ్రి కళ్లెదుటే తనయుడి మృతి

- విద్యుదాఘాతంతో యువ రైతు దుర్మరణం


విశాల్ పవార్

జహీరాబాద్ టౌన్: విద్యుదాఘాతానికి గురైన కొడుకు విలవిల్లాడుతుంటే.. కాపాడేందుకు ఆ తండ్రి ఎంత ప్రయత్నించినా విఫలమయ్యాడు. కళ్లెదుటే బిడ్డ ప్రాణాలు వదిలాడు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం శేఖాపూర్ తండాలో ఆదివారం జరిగిన ఈ విషాద సంఘటనపై పోలీసుల కథనం ప్రకారం.. శేఖాపూర్ తండాకు చెందిన నర్సింగ్ పవార్‌కు ఇద్దరు కుమారులున్నారు. తండ్రితో కలిసి పెద్ద కుమారుడు విశాల్ పవార్ (29) వ్యవసాయ పనులు చేస్తున్నాడు. తండ్రితో కలిసి పొలానికి వెళ్లిన కొడుకు.. బోరు మోటారు ఆన్ చేయడానికి వెళ్లి స్టార్టర్ బటన్ నొక్కడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. విలవిల్లాడుతున్న కొడుకును చూసిన తండ్రి తన దగ్గరున్న టవల్‌తో లాగి కాపాడాలని విఫలయత్నం చేశాడు. చివరికి కళ్లెదుటే కొడుకు ప్రాణాలు విడిచాడు.

పురపాలక సంఘ కార్యాలయము – హుజూరాబాద్, జిల్లా: కరీంనగర్
సంక్షిప్త టెండర్ ప్రకటన

లేఖ నెం. E1/168/2024-25 తేది: 28-09-2024

హుజూరాబాద్ పురపాలక సంఘ పరిధిలో సాధారణ నిధులతో చిన్న బతుకమ్మ పనులు, స్వశక్తి మహిళా క్యాంటీన్ నిర్మాణము చేపట్టుటకు గాను అర్హత/ ఆసక్తి కలిగిన మున్సిపల్ రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి అధీకృత డీలర్ల నుండి e-procurement ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరుటకు కోరబడుచున్నవి. 01. పనుల సంఖ్య : (02) పనులు, 02. టెండర్ల విలువ : 06.50 లక్షలు, 03. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 28-09-2024 మధ్యాహ్నం 02.00 నుండి, 04. బిడ్ డౌన్‌లోడ్ చివరి తేది మరియు సమయం: 01-10-2024 మధ్యాహ్నం 12.00 గం.వరకు, 05. బిడ్లు తెరుచు తేది మరియు సమయం: 01-10-2024 మధ్యాహ్నం 1.00 గం. నుండి ఇతర వివరముల కొరకు www.eprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు. ఇతర వివరముల కొరకు ఇంజనీరింగ్ విభాగాము నందు సంప్రదించగలరు.

సం/- కమిషనర్, పురపాలక సంఘము, హుజూరాబాద్.
DIPR RO No.4712-PP/CL/Advt/1/2024-25, Dt: 28.09.2024

తెలంగాణ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్
జిల్లా కార్యాలయం : వరంగల్
ఇం.నం.23-6-99, B.V. రావ్ భవన్, శ్యామ్‌పేట్, హన్మకొండ
టెండరు ప్రకటన

Rc.No.P&M/MSP/Transportation/2024-25 తేది: 28-09-2024

వరంగల్ జిల్లాలో అవశ్యకత మేరకు వివిధ స్టోరేజ్ గోడౌన్లకు వివిధ కొనుగోలు కేంద్రాల నుండి వానాకాలం మరియు యాసంగి 2024-25 కాలంలో కనీస మద్దతు ధర క్రింద TG మార్క్‌ఫెడ్ ద్వారా సేకరించబడే ముతక ధాన్యాలు (మొక్కజొన్న, జొన్నలు), పప్పుధాన్యాలు (పెసర, కంది, శనగ) మరియు ఆయిల్ సీడ్స్ (సోయా బీన్, సన్‌ఫ్లవర్) రవాణా చేయుటకు ఆసక్తిగల పార్టీల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు షెడ్యూల్‌ను టెండరు షెడ్యూల్ ధర నిమిత్తం రూ.5000/- (ఐదువేల రూపాయలు మాత్రమే) చెల్లించి 30-09-2024 నుండి 07-10-2024, మ.3.00 గం. వరకు అన్ని పనిరోజులలో వరంగల్ జిల్లా కార్యాలయం, TG మార్క్‌ఫెడ్, ఇం.నం.23-6-99, B.V.రావ్ భవన్, శ్యామ్‌పేట్, హన్మకొండ నుండి పొందవచ్చును. ముగింపు సమయం: 07-10-2024న సా.4.00 గం.కు. టెండరుదారు బయానా నిమిత్తం TS MARKFED పేరున వరంగల్ వద్ద చెల్లించబడేలా తీసిన రూ.2.00 లక్షలు (రెండు లక్షల రూపాయలు మాత్రమే) DD జత చేయాలి. టెండర్లు 08-10-2024న ఉ.11.00 గం.కు అడిషనల్ కలెక్టర్ (Rev) ఛాంబర్‌లో అడిషనల్ కలెక్టర్ (Rev) అధ్యక్షతన జిల్లాస్థాయి కొనుగోలు కమిటీ సమక్షంలో తెరువబడతాయి. ఏ కారణాలు తెలుపకుండా టెండర్లను మార్పుచేయుటకు, రద్దు చేయుటకు లేదా వాయిదా వేయుటకు హక్కు దిగువ సంతకందారుకు కలదు.

సం/- జిల్లా మేనేజర్, TG మార్క్‌ఫెడ్, వరంగల్ సం/- అడిషనల్ కలెక్టర్ (Rev), వరంగల్
DIPR RO No.4713-PP/CL/Advt/1/2024-25, Dt.28.09.2024



మంచిమాట

మార్పు మనుగడ కోసమే...

జీవితంలో ఎదురయ్యే వివిధ పరిస్థితులకు మనం ఏ విధంగా స్పందిస్తాం... వాటిని ఏ కోణంలో చూస్తామనే విషయం మీదే మన అభివృద్ధి, ఎదుగుదల ఆధారపడి ఉంటుంది.. మనసు బాగోలేనపుడు చాలా విషయాలను మనం సమస్యలుగా చూస్తాం.. ప్రశాంతంగా ఉన్నపుడు అవే పరిస్థితులను సవాళ్లుగా భావిస్తాం. అందువల్ల మన అభివృద్ధి ఏదైనా అది మనం ఆయా సమస్యలను స్వీకరించే స్థితి మీదే ఆధార పడి ఉంటుంది..

మనిషి జీవితం పూల పాన్పు కాదు.. అదేవిధంగా ముళ్ళ కిరీటం కూడా కాదు.. ఈ ప్రాథమిక సూత్రాన్ని అవలోకనం చేసుకుని మన జీవితంలో వచ్చే ప్రతి మార్పును ఆహ్వానించినపుడే మన జన్మకు సార్థకత లభిస్తుంది.. బతుకూ పండుతుంది. మన జీవితంలో ఎదురయ్యే వైఫల్యాలకు వెరుస్తూ, మార్పును ఆహ్వానించకపోతే అది మనలో ఆత్మన్యూనతను పెంచుతుంది. ఒక పనిలో విఫలమైనపుడు దానిలో ఎందుకు విఫలమయ్యామా... అని బుర్ర బద్దలు కొట్టుకుని మనసు పాడు చేసుకునే కన్నా, ఏం జరిగినా అది మన మంచికోసమేనని ఆత్మను సంతృప్తి చేసుకుంటే మనసు కుదుట పడుతుంది. ఆనందం సొంతమవుతుంది. జీవితంలో ఎదురయ్యే మార్పును ఎప్పటికప్పుడు ఆహ్వానించి, దానిని మన జీవితానికి సోపానాలుగా మార్చుకోవాలి తప్ప, ఆత్మ న్యూనతతో కుంగిపోకూడదు.

మీ నిధుల అవసరాలపైనే పెట్టుబడులను లిక్విడ్ ఫండ్స్‌లోకి మళ్లించడం ఆధారపడి ఉంటుంది. సమీప కాలంలో (6–12 నెలలు) మీకు డబ్బులతో పని ఉంటే, ఈక్విటీ ఫండ్స్ నుంచి కొంత మొత్తాన్ని వెనక్కి తీసుకుని లిక్విడ్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. అలాగే, మీ ఆర్థిక లక్ష్యానికి చేరువ అయినప్పుడు కూడా ఈక్విటీ పెట్టుబడులు వెనక్కి తీసుకుని, డెట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసిన ఈక్విటీ పథకం పోటీ పథకాలతో వరుసగా మూడేళ్ల పాటు రాబడుల విషయంలో వెనుకబడి ఉంటే, అప్పుడు కూడా ఆ పథకం నుంచి పెట్టుబడులు వెనక్కి తీసుకోవచ్చు. ఏడాది, రెండేళ్ల పనితీరు ఆధారంగా ఈ నిర్ణయానికి రావద్దు. మరో ఐదేళ్ల వరకు మీకు నిధుల అవసరం లేకపోతే ఈక్విటీ పెట్టుబడులను కొనసాగించడమే సరైనది. ఎందుకంటే ఇప్పుడే వాటిని వెనక్కి తీసుకుంటే మిగిలిన ఐదేళ్ల కాలంలో మరింత రాబడులు పొందే అవకాశం కోల్పోతారు. అస్సెట్ అలోకేషన్ (డెట్–ఈక్విటీ తదితర సాధనాల మధ్య పెట్టుబడుల కేటాయింపుల ప్రణాళిక)కు అనుగుణంగా మీ పెట్టుబడుల్లో క్రమానుగతంగా మార్పులు చేసుకోవడంపై దృష్టి సారించండి.

సర్కారీ బడులు దిద్దుతున్న అక్షరమాల!

సర్కారీ బడుల్లో ఐఐటీహెచ్, బిట్స్‌పిలానీ విద్యార్థులతో పాఠాలు

మరో 13 ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులూ భాగస్వాములు

అక్షరధాన్ ఆన్‌లైన్ లెర్నింగ్ ఇంటర్‌ఫేస్‌తో బోధన

200 పాఠశాలల్లోని **15,000** మంది విద్యార్థులకు లబ్ధి



సదాశివపేట కేజీబీవీ పాఠశాలలో అక్షరమాల పాఠాలు వింటున్న విద్యార్థినులు

ప్రైవేటు పాఠశాలలతో పోలిస్తే సర్కారు బడుల్లో బోధన అంతంత మాత్రమే అనేది కఠోర వాస్తవం. టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటం తదితర కారణాలతో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్ట్‌ల్లో విద్యార్థులకు అందే విషయ పరిజ్ఞానం నామమాత్రమే అని అంటుంటారు. ఇలాంటి సమస్యను అధిగమించేందుకు హైదరాబాద్ ఐఐటీ సహకారంతో అక్షరధాన్ సంస్థ 'అక్షరమాల' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్ ఐఐటీ, బిట్స్‌పిలానీ, ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) వంటి జాతీయస్థాయి విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధిస్తున్నారు.

- సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

ఐదుగురు విద్యార్థులకు ఒక వలంటీర్

ఐఐటీ హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని పలు ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులను వలంటీర్లుగా నియమించారు. ఒక్కో వలంటీర్ ఐదుగురు విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. అక్షరధాన్ ఆన్‌లైన్ లెర్నింగ్ ఇంటర్‌ఫేస్ కార్యక్రమం ద్వారా శని, ఆదివారాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు, మిగిలిన రోజుల్లో సాయంత్రం 6.30 గంటల నుంచి పాఠ్యాంశాల బోధనతోపాటు డౌట్స్ క్లియర్ చేస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ-లైబ్రరీ ద్వారా 1,500 వీడియోలను పంపుతున్నారు. ఆన్‌లైన్‌లో ఎగ్జామ్స్ పెట్టి రివార్డులు కూడా ఇస్తున్నారు. ఇటీవలే హైదరాబాద్ ఐఐటీ క్యాంపస్‌లో ఈ రివార్డులను ప్రదానం చేశారు. ఆన్‌లైన్ లెర్నింగ్ ఇంటర్‌ఫేస్ ద్వారా బోధన సాగుతోంది. 75 శాతం మంది విద్యార్థుల తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్లు వాడుతుండగా, అలాంటి సౌకర్యం లేని మిగిలిన నిరుపేద విద్యార్థులకు ఓ సంస్థ ద్వారా ఆన్‌లైన్ సదుపాయం కల్పిస్తున్నారు.

అక్షరమాల అమలవుతున్న జిల్లాలివీ..: ఆదిలాబాద్, ఆసిఫాబాద్, గద్వాల్, కామారెడ్డి, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, మంచిర్యాల, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, నారాయణ్‌పేట్, నిర్మల్.

పేద విద్యార్థులకు ఎంతో ప్రయోజనం..



కరోనా మహమ్మారి సమయంలో శ్రీకారం చుట్టిన ఈ అక్షరమాల కార్యక్రమం నిరాటంకంగా సాగుతోంది. ముఖ్యంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరంగా ఉంటోంది. నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్యాబోధన ఉచితంగా అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

-ఎంఎస్ఆర్ మూర్తి, కోఆర్డినేటర్, అక్షరమాల





విద్యుత్ కాంతులతో శ్రీనివాసులు, హనుమంతుడు

తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ

తిరుమల: శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. శ్రీవారి ఆలయంపై విద్యుత్ అలంకరణలు పూర్తికావచ్చాయి. ఆదివారం సాయంత్రం లైటింగ్ వేసి అధికారులు పరిశీలించారు. ఆలయం చుట్టూ విద్యుత్ లైట్లతో రూపొందించిన శ్రీవారి చిత్రాలను వెలిగించి పరిశీలించారు. తిరుమల వ్యాప్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలకు భక్తులను ఆహ్వానిస్తూ కటౌట్లు ఏర్పాటుచేశారు.

ఇంటి సంపులో సలసల మరిగే నీళ్లు


నిడిగొండలో వింత పరిస్థితి



ఆసక్తిగా వీక్షిస్తున్న స్థానికులు

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం నిడిగొండలో ఓ వింత చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కర్ల జైపాల్‌రెడ్డి ఇంటిలోని మిషన్ భగీరథ తాగునీటి నల్లా సంపులో నీరు సలసలా మరుగుతోంది. 20 రోజులపాటు ఊరెళ్లిన జైపాల్‌రెడ్డి ఆదివారం ఉదయం ఇంటికి వచ్చారు. ఆవరణ శుభ్రం చేసేందుకు సంపు మూత తీయగా.. లోపలి నుంచి పొగ బయటకు వచ్చింది. దీంతో సంపులో చేయి పెట్టి చూడగా నీళ్లు కాలుతున్నాయి. ఆందోళన చెందిన అతను చుట్టు పక్కల వారితో చెప్పగా వారంతా వచ్చి ఆసక్తిగా చూశారు. స్థానికుడు, చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని సంపును పరిశీలించారు. గ్రీన్ హౌస్ వాయువుల ఉద్గారాల కారణంగా ఇలా జరిగి ఉండొచ్చని.. లేదంటే సంపు కింద క్లోరో ఫ్లోరో కార్బన్స్ తదితర వాయువుల ఉద్గారాలతో భూమి పరిసర ప్రాంతంలో వేడెక్కడం.. భూమి అంతర్భాగంలో కృష్ణవస్తువు ఆనవాళ్లు ఉంటే ఉష్ణ కిరణ ప్రక్రియ కారణంగా నీరు వేడెక్కే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఈ విషయంపై మిషన్ భగీరథ డీఈ కరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా తాగునీటి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంక్‌లో వేసిన బ్లీచింగ్ పౌడర్‌తో పొగలొచ్చి ఉండొచ్చనీ.. లేదంటే సంపులోని మోటార్ వైరింగ్ కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు.

డీఎస్సీ ఫైనల్ కీపై వచ్చిన అభ్యంతరాలపై స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. దీంతో ఉపాధ్యాయ నియామక ప్రక్రియ మరింత జాప్యమయ్యేలా కనిపిస్తోంది. అభ్యర్థులు లేవనెత్తిన ప్రశ్నలు ఎక్కడ్నుంచి తీసుకుంది? దానికి జవాబులు ఏమిటి? అనేది తేలితే తప్ప ముందుకెళ్లడం కష్టంగా ఉంది. వాస్తవానికి సెప్టెంబర్‌లోనే ఫలితాలు వెల్లడించాలని విద్యాశాఖ భావించింది. ఫైనల్‌కీపై స్పష్టత రాకపోవడం, ఇంకా పరిశీలిస్తున్నామని సంబంధిత విభాగం చెప్పడంతో డీఎస్సీ ఫలితాలు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. - సాక్షి, హైదరాబాద్



వారంలోపు ఫలితాలు ఇవ్వాలి.. లేకుంటే ఆందోళన

డీఎస్సీ ఫలితాలు వారం రోజుల్లో విడుదల చేయాలి. లేకుంటే విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. ఫైనల్ కీ విడుదలైన రెండు రోజుల్లో ఫలితాలు ఇవ్వడం సర్వసాధారణం. అప్పటికే నియామకాలకు చాలా వ్యవధి పడుతుంది. ఇంతవరకూ ఫలితాలే విడుదల చేయకపోవడంపై నిరుద్యోగుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

– రావుల రామ్మోహన్‌రెడ్డి, తెలంగాణ డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం అధ్యక్షుడు)

కారణాలేంటో చెప్పడం లేదు

ఫైనల్ కీ విడుదలైన తర్వాత ఫలితాల కోసం వేచిచూస్తున్నాం. మూడు వారాలైనా ఇవ్వలేదు. ఇప్పటికీ ఆరుసార్లు డీఎస్సీ కార్యాలయానికి వెళ్లాను. అధికారులు కారణాలు చెప్పడం లేదు. టైం పడుతుందంటున్నారు. ఫలితాలు వస్తే, ఇతర ఉద్యోగాలపై దృష్టి పెట్టడానికి వీలుంటుంది.

– మధులిక, డీఎస్సీ రాసిన అభ్యర్థి

డీఎస్సీ ఫలితాలు ఎప్పుడు?

ఫైనల్ కీ విడుదలై 24 రోజులు

ఆన్‌లైన్ పరీక్షలైనా ఇంత ఆలస్యమా?

ఎస్‌సీఈఆర్‌టీ వల్లే జాప్యమంటున్న అధికారులు

ఆశగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులు

రాష్ట్రవ్యాప్తంగా 11,062 ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులకు విద్యాశాఖ జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకూ డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించింది. దీంతో ఫలితాలు త్వరగా వస్తాయని విద్యాశాఖ తెలిపింది. డీఎస్సీకి 2,79,957 మంది దరఖాస్తు చేయగా, 2,45,263 మంది పరీక్ష రాశారు. ప్రాథమిక కీని ఆగస్టు 13న విడుదల చేశారు. ఆగస్టు 20 వరకూ ప్రాథమిక కీపై అభ్యంతరాలు స్వీకరించారు. దాదాపు 28 వేల అభ్యంతరాలు వచ్చాయి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకున్న తర్వాత సెప్టెంబర్ 6వ తేదీన ఫైనల్ కీ విడుదల చేశారు. ఫైనల్ కీలోనూ తప్పులు న్నాయని కొన్ని జిల్లాల్లో అభ్యర్థులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. వీటిపై ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయంలో సమీక్షించారు. వాస్తవానికి ఈ ఫిర్యాదుల పరిశీలనకు వారం గడువు సరిపోతుందని తొలుత అధికారులు భావించారు. కానీ ఇప్పటికే మూడు వారాలైనా, ఫలితాలు మాత్రం విడుదల చేయలేదు.

3 వారాలు దాటినా..

అభ్యర్థుల్లో ఆందోళన..


డీఎస్సీ ఫలితాలు విడుదల చేయాలని పరీక్ష రాసిన అభ్యర్థులు ప్రతిరోజూ డీఎస్సీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జాప్యానికి కారణాలేంటో అధికారులు చెప్పడం లేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ జాబితాలు విడుదల చేస్తేనే నియామక ప్రక్రియ ముందుకు వెళుతుంది. దీని తర్వాతే 33 జిల్లాల్లో ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలి. ఇది పూర్తయిన తర్వాత ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున జాబితాను జిల్లా సెలక్షన్ కమిటీలకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి వెళతాయి. ఈ మొత్తం ప్రక్రియకు కనీసం మూడు నెలల సమయం పడుతుంది. ఇప్పటికీ ఫలితాలు వెల్లడించకపోవడంతో ఈ విద్యా సంవత్సరంలో కొత్త ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం కనిపించడం లేదు. ఈ డిసెంబర్‌లో మరో 10 వేల మంది టీచర్లు ఉద్యోగ విరమణ చేస్తారు. ఉన్న ఖాళీలు భర్తీ చేయకపోవడం, మళ్లీ ఖాళీలు ఏర్పడటంతో ప్రభుత్వ స్కూళ్లలో బోధన ఎలా సాగుతుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి.



పొలానికెళ్లాలంటే పడవెక్కాలి..

వెంకటాపురం (కె): ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధి పాత్రాపురం గ్రామ రైతులు గోదావరి లంకల్లోకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం లేదు. గోదావరి లంకల్లో రైతులు సుమారు 2–3 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. తోటల్లోకి వెళ్లాలంటే గోదావరి పాయ దాటాల్సిందే. గోదావరి లోతు ఎక్కువగా ఉండటంతో వారికి నాటు పడవలే దిక్కయ్యాయి. పొలం పనులు చేయడానికి ఒక్కో కూలీకి రూ. 40 చొప్పున పడవ కిరాయి చెల్లించి తీసుకెళ్తున్నారు. మరోవైపు పాలెం ప్రాజెక్టు అధికారులు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయడంతో ఆ నీరంతా గోదావరిలోకి చేరి నీటిమట్టం పెరుగుతోంది. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

టుడేస్ గ్రాఫిక్



బోస్టన్ కన్సల్టెన్సీ గ్రూప్ (బీసీజీ) సీసీఐ గ్లోబల్ కన్జూమర్ సెంటిమెంట్ సర్వే ప్రకారం 2023లో చాట్‌జీపీటీని అత్యధికంగా ఉపయోగించిన టాప్-10 దేశాలు

కనుడు కనుడు రామాయణ గాథ

విజయనగరంలో ఏర్పాటైన వాల్మీకి రీసెర్చ్ సెంటర్ | ప్రపంచంలోనే తొలి రీసెర్చ్ సెంటర్ ఇదే | మానవత్వ విలువల్ని భావితరాలకు అందించడమే లక్ష్యం



శ్రీరామనారాయణం ప్రాంగణంలోని రీసెర్చ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలు, వాల్మీకి విగ్రహం

విజయనగరం రూరల్: రామాయణంలోని మానవత్వ విలువలను భావితరాలకు అందించడం కోసం నారాయణం నరసింహమూర్తి పన్నెండేళ్ల క్రితం బృహత్ సంకల్పం చేసి శ్రీరామనారాయణం ప్రాంగణం నెలకొల్పారు. ప్రముఖ వ్యాపారవేత్త అయిన నరసింహమూర్తి మొదటినుంచీ ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. నరసింహమూర్తి మరణానంతరం ఆయన సంకల్పానికి తోడుగా వాల్మీకి రామాయణంలోని వివిధ కోణాలపై పరిశోధనల్ని ప్రోత్సహించడంతోపాటు రామాయణాన్ని భావితరాల జీవన మార్గంగా మలిచేందుకు ఆయన కుటుంబ సభ్యులు శ్రీవాల్మీకి రామాయణ రీసెర్చ్ సెంటర్‌ను ఇటీవల ప్రారంభించారు. ఇప్పటివరకూ శ్రీరామ నారాయణం ఒక ఆధ్యాత్మిక కేంద్రం మాత్రమే. వాల్మీకి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో రామాయణంపై పరిశోధనలకు మరో అడుగు ముందుకు పడింది.

12 వేల గ్రంథాలు ఏర్పాటు

వాల్మీకి రామాయణం రీసెర్చ్ కేంద్రంలో రామాయణానికి సంబంధించిన 12 వేల గ్రంథాలను అందుబాటులో ఉంచారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్యను లక్షకు పైగా పెంచే ఆలోచనతో ఉన్నామని నరసింహమూర్తి కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ గ్రంథాలు తెలుగు, హిందీ, సంస్కృతం, ఆంగ్లంతో పాటు ఇతర ప్రముఖ భాషల్లో అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు, యువత, ఆధ్యాత్మిక వేత్తలు, పండితులు, ప్రవచనకర్తలు, గురూజీలు, నిరంతరం అధ్యయనం చేసేందుకు వీలుగా రీసెర్చ్ కేంద్రంలోనే ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా పీహెచ్‌డీ చేసే వారికి ఈ కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని నరసింహమూర్తి కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పూర్వజన్మ సుకృతం



మా తండ్రి ఆశయం మేరకు శ్రీరామనారాయణం ప్రాంగణంలో వాల్మీకి రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం.

-నారాయణం శ్రీనివాస్, ఫౌండర్, శ్రీరామనారాయణం ప్రాంగణం

మంచి ప్రయత్నం



రామాయణం భావితరాలకు జీవనమార్గం కావాలంటే ఇటువంటి ప్రయత్నం జరగాల్సిందే. నారాయణం నరసింహమూర్తి కుటుంబ సభ్యుల ఆలోచన అద్భుతమైనది. వాల్మీకి రీసెర్చ్ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ సందర్శించి రామాయణంపై సందేహాలను నివృత్తి చేసుకోవడానికి వీలవుతుంది.

– పరిపూర్ణానందస్వామి, శ్రీపీఠం అధ్యక్షులు

యువత రావాలి



ఈ కేంద్రానికి ప్రధానంగా యువత ముందుకు వచ్చి రీసెర్చ్ చేయాలి. రామాయణం ప్రబోధించే విలువలు, సీతారాముల కథను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలి. ఇంతటి అద్భుతమైన కేంద్రాన్ని ప్రారంభించి సమాజానికి అవకాశం కల్పించిన నారాయణం కుటుంబ సభ్యులు అభినందనీయులు. ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాన్ని సందర్శించి జీవన మార్గాన్ని సుగమం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్.వైష్ణవి, అసిస్టెంట్ ప్రొఫెసర్, సంస్కృత విశ్వవిద్యాలయం, తిరుపతి

పాండవుల గుట్టలో కలెక్టర్, ఎస్పీ ట్రెక్కింగ్



రాక్ క్లైంబింగ్ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ



ఎస్పీ కిరణ్‌ఖరే

రేగొండ: జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని పాండవుల గుట్టను ఆదివారం కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే సందర్శించి ట్రెక్కింగ్ చేశారు. ఈ సందర్భంగా రాహుల్ శర్మ మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు పరిచయం చేసేందుకు రాష్ట్ర పర్యాటక శాఖ ద్వారా ప్రచారం చేస్తామన్నారు. అదేవిధంగా సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్సవాలు నిర్వహించడం ద్వారా ఈ ప్రాంత పర్యాటక ఆకర్షణను పెంచేందుకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. పాండవుల గుట్టలను పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్యాకేజీల రూపకల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్ఓ శ్రీనివాస్, ఆర్డీఓ మంగీలాల్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐలు మల్లేశ్, నరేశ్, అటవీ అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలు భేష్

- 'ఏక్ పేడ్ మా కే నామ్'లో లక్ష్యానికి మించి మొక్కలు నాటి రికార్డు సృష్టించారు
- 'మన్ కీ బాత్'లో రాష్ట్ర ప్రజలను ప్రశంసించిన ప్రధాని
- 1,552 మొక్కలను నాటిన సింగరేణి కార్మికుడు కేఎస్ రాజశేఖర్‌ను అభినందించిన మోదీ



మొక్క నాటుతున్న రాజశేఖర్ (ఫైల్)

సాక్షి, న్యూఢిల్లీ/సింగరేణి (కొత్తగూడెం): తెలంగాణ ప్రజలు భేష్ అంటూ ప్రధాని మోదీ ప్రశంసించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో భాగంగా అనుకున్న లక్ష్యాని కంటే రాష్ట్ర ప్రజలు ఎక్కువ మొక్కలు నాటి సరికొత్త రికార్డు సృష్టించారన్నారు. ఆదివారం 'మన్ కీ బాత్'114వ ఎపిసోడ్‌లో మోదీ మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారం అద్భుతమని, ప్రజల భాగస్వామ్యానికి ఈ కార్యక్రమం చక్కని ఉదాహరణగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిందని చెప్పారు. దేశం నలుమూలల్లోని ప్రజలు 'ఏక్ పేడ్ మా కే నామ్' ద్వారా అద్భుతాలు చేశారన్నారు.

రోజుకో మొక్క నాటుతున్న రాజశేఖర్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన సింగరేణి కార్మికుడు కొత్తూరు సుర్వి రాజశేఖర్‌ను ప్రధాని నరేంద్రమోదీ అభినందించారు. ఈ ఏడాదిలో ప్రమాదానికి గురైన తర్వాత కూడా తన దృఢ సంకల్పాన్ని వదలకపోవడం గొప్ప విషయమని మోదీ కొనియాడారు. 2020 జూలై 1 నుంచి రాజశేఖర్ నిత్యం ఖాళీ ప్రదేశాల్లో ఒక మొక్క నాటుతూ ఫొటో, వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఇలా ఆదివారం నాటికి 1,552 మొక్కలు నాటారు. ప్రముఖుల పుట్టినరోజు, వివిధ అధికారుల ఉద్యోగ విరమణ సందర్భంగా బొకేలకు బదులు మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలిపే సంప్రదాయాన్ని ప్రారంభించారు. ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతను ఆయా నిర్వాహకులకు అప్పగిస్తున్నారు. ఆయన కూడా నెలకోసారి అక్కడికి వెళ్లి మొక్కలకు అవసరమైన పోషణ, ట్రీగార్డ్‌ల ఏర్పాటు వంటివి చేస్తున్నారు. మతపెద్దల జన్మదినం సందర్భంగా జాతక రీత్యా (రాశివనం, నక్షత్రమొక్కలు) నాటుతున్నారు. హెర్బల్ గార్డెన్(ఔషధ మొక్కలు) నాటి వాటికి బోర్డులు ఏర్పాటు చేసి, సంరక్షణ చర్యలు చేపట్టడాన్ని దినచర్యగా పెట్టుకున్నారు. తన తండ్రి స్ఫూర్తితో తాను రోజుకో మొక్క నాటుతున్నానని తెలిపారు.

మహిళలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తు అందిస్తాం

- 'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి
- రొమ్ము కేన్సర్‌పై అవగాహన కోసం ఎంఈఐఎల్, సుధారెడ్డి ఫౌండేషన్ల ఆధ్వర్యంలో 3కే, 5కే, 10కే రన్
- పావురం ఆకారంలో మానవహారంగా ఏర్పడి గిన్నిస్ కోసం ఔత్సాహికుల యత్నం



పావురం ఆకారంలో మానవహారంగా నిలబడిన పింక్ పవర్ రన్ ఔత్సాహికులు

సాక్షి, హైదరాబాద్: మహిళలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. జాతీయ రొమ్ము కేన్సర్ అవగాహన నెల (అక్టోబర్) ప్రారంభం సందర్భంగా ఆదివారం ఉదయం గచ్చిబౌలి స్టేడియంలో ఎంఈఐఎల్, సుధారెడ్డి ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ము కేన్సర్‌పై అవగాహన కల్పించేందుకు పింక్ పవర్ రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్ మాట్లాడుతూ పింక్ పవర్ రన్‌లో పాల్గొన్నవారు వేసే ప్రతి అడుగు భవిష్యత్తులో మహిళలు ఎదుర్కొనే సవాళ్లను ఒంటరిగా అధిగమించేందుకు బలం చేకూర్చుతుందన్నారు. మహిళల ఆరోగ్యం, సంక్షేమం కోసం ఆస్పత్రులతోపాటు ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తామని చెప్పారు. మహిళల ఆరోగ్యమే కుటుంబం, సమాజ శ్రేయస్సుకు పునాది అవుతుందని తమ ప్రభుత్వం బలంగా నమ్ముతోందన్నారు. ఈ సందర్భంగా రొమ్ము కేన్సర్‌ను జయించిన రిటైర్డ్ గైనకాలజీ ప్రొఫెసర్, ఉషాలక్ష్మి బ్రెస్ట్ కేన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలైన 91 ఏళ్ల డాక్టర్ ఉషాలక్ష్మిని సీఎం రేవంత్ ఘనంగా సన్మానించారు. రొమ్ము కేన్సర్‌ను జయించిన ఆమె ధైర్యం, సంకల్పం ప్రశంసనీయమన్నారు.



5కే రన్‌లో ఓ విజేతకు చెక్కు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సుధారెడ్డి. ఉషాలక్ష్మిని సన్మానిస్తున్న రేవంత్

జెండా ఊపి ప్రారంభించిన మంత్రి దామోదర..

అంతకుముందు పింక్ పవర్ రన్‌ను వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి ప్రారంభించారు. వేలాది మంది ఔత్సాహికులు గులాబీ దుస్తులు ధరించి 10, 5, 3 కి.మీ. విభాగాల మారథాన్లలో పాల్గొన్నారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందించారు. అలాగే ఔత్సాహికులు పావురం ఆకారంలో భారీ మానవహారంగా ఏర్పడి గిన్నిస్ రికార్డు కోసం ప్రయత్నించారు. ఐక్యత, ఆశ, బ్రెస్ట్ కేన్సర్‌పై పోరులో నిబద్ధతకు పక్షి ఆకార మానవహారం ఒక సంకేతమని ఎస్.ఆర్. ఫౌండేషన్ చైర్‌పర్సన్ సుధారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ శాప్ చైర్మన్ శివసేనరెడ్డి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఎంఈఐఎల్ ఎండీ పీవీ కృష్ణారెడ్డి, ఉషాలక్ష్మి ఫౌండేషన్ చైర్మన్ ఉషాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.

అది 'వర'ద కాలువ!

లక్ష ఎకరాల్లో పసిడి పంటలు

- రైతులకు కలిసొస్తున్న వరద కాలువ నీరు
- ఎస్సారెస్పీ నుంచి 122 కిలోమీటర్ల మేర వరద కాలువ
- 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


బోయినపల్లి(చొప్పదండి)

ఒక్క వరద కాలువ లక్ష ఎకరాల్లోని పంటలకు జీవం పోస్తోంది. నాలుగు జిల్లాల్లో 122 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తున్న వరదకాలువ కింద దాదాపు లక్ష ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. దివంగత నేత వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో జలయజ్ఞంలో భాగంగా వరద కాలువ నిర్మించారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎస్సారెస్పీ నుంచి జగిత్యాల, కరీంనగర్ జిల్లాల మీదుగా రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్ల మేర వరద కాలువ విస్తరించి ఉంది. నాలుగు జిల్లాల పరిధిలోని భూములకు జీవధారగా నిలుస్తోంది. వరద కాలువ నీటితో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 70 వేలకు పైగా ఎకరాల్లో వరి సాగవుతుండగా.. అత్యధికంగా జగిత్యాల జిల్లా పరిధిలో 50 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

వరద కాలువ స్వరూపం

పొడవు:	122 కిలోమీటర్లు
విస్తరించిన జిల్లాలు:	నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల
డివిజన్లు :	5
నీటి నిల్వ సామర్థ్యం:	1.7 టీఎంసీ
పర్యవేక్షణాధికారులు:	ఇద్దరు ఎస్ఈలు, నలుగురు ఈఈలు
ప్రవహించే నీరు:	19 వేల క్యూసెక్కులు


రైతులు వేసిన వరి పంట


బోయినపల్లి మండలం మీదుగా వరద కాలువ

సిరుల సాగు

నిజామాబాద్ జిల్లా బాల్కొండ ఎస్సారెస్పీ జీరో పాయింట్ నుంచి జగిత్యాల, కరీంనగర్ జిల్లాల మీదుగా రాజన్న సిరిసిల్ల జిల్లా వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్ల వరకు వరద కాలువ నిర్మించారు. వరద కాలువలో సుమారు 18 మీటర్ల లోతు నీరు నిలిచి ఉంటుంది. కాలువ అడుగు భాగాన 43 మీటర్ల వెడల్పు ఉంటుంది. వరద కాలువలో నిల్వ ఉన్న నీరు ఆధారంగా మోటార్లతో నిజామాబాద్ జిల్లాతోపాటు ఉమ్మడి కరీంనగర్‌లోని జగిత్యాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లా పరిధిలో వానాకాలంలో సుమారు లక్ష ఎకరాల మేర వరి సాగు చేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కథలాపూర్, కోరుట్ల, మేడిపెల్లి మల్యాల మండలాల్లో సుమారు 50 వేల ఎకరాలు, కరీంనగర్ జిల్లా పరిధిలోని గంగాధర, రామడుగు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలు, రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలో 7వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. రైతులు వరద కాలువకు ఇరువైపులా మోటార్లు అమర్చుకుని వ్యవసాయ భూములకు పైపులైన్ల ద్వారా నీరు అందిస్తున్నారు.

ఐదు డివిజన్లుగా వరద కాలువ

నిజామాబాద్ జిల్లాలో ప్రారంభమై 122 కిలోమీటర్ల మేర విస్తరించిన వరద కాలువను ఐదు డివిజన్లుగా విభజించారు. ఎస్సారెస్పీ జీరో పాయింట్ నుంచి 28 కిలోమీటర్ల వరకు ఒక డివిజన్. 28 కిలోమీటర్ల నుంచి 44 కిలోమీటర్లు, 44 కిలోమీటర్ల నుంచి 73 కిలోమీటర్లు, 73 కిలోమీటర్ల నుంచి 102 కిలోమీటర్లు, 102 కిలోమీటర్ల నుంచి 122 కిలోమీటర్లు.. ఇలా ఐదు డివిజన్లను ఏర్పాటు చేశారు. ఐదు డివిజన్ల పరిధిలో వరద కాలువను ఐదుగురు ఈఈలు, ఇద్దరు ఎస్ఈలు పర్యవేక్షిస్తారు.

కోత దశలో ఉంది



విలాసాగర్ వరద కాలువ పరిసరాల్లో 5 ఎకరాల మేర వరి పంట వేసిన. కాలువ నీరు ఆధారంగా వరి సాగు చేస్తున్నాను. వర్షాకాలం ఆరంభంలో వరద కాలువలో నీరు లేదు. పంటలు ఎలా వేయాలోనని రంది పడ్డా. ఇప్పుడు నీరు పుష్కలంగా ఉంది. పంటలకు ఎలాంటి ఇబ్బంది లేదు.

– గంగాధర సురేందర్, విలాసాగర్, రైతు, బోయినపల్లి మండలం

వర ప్రదాయిని



వరద కాలువ రైతులకు వర ప్రదాయినిగా మారింది. వర్షాకాలం ఆరంభంలో ఎల్లంపల్లి జలాలను ఎత్తిపోతల ద్వారా వరద కాలువ మీదుగా మిడ్ మానేరుకు విడుదల చేశారు. ప్రస్తుతం ఎస్సారెస్పీ జలాలతో వరద కాలువ కళకళలాడుతోంది. ఈ ప్రాంత రైతులు కాలువ నీరు ఆధారంగా భారీగా వరి, పత్తి పంటలు సాగు చేస్తున్నారు.

– మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యే, చొప్పదండి

భూములు సస్యశ్యామలం



నిజామాబాద్ ఎస్సారెస్పీ వరద కాలువ జీరో పాయింట్ నుంచి బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 122 కిలోమీటర్ వరకు వరద కాలువ విస్తరించి ఉంది. ట్యాంకులు నింపడంతోపాటు మోటార్ల ద్వారా సాగునీరు అందుతోంది. వరద కాలువ ఆధారంగా సుమారు లక్ష ఎకరాల మేర వరి సాగవుతోంది. రైతుల పంటలు సస్యశ్యామలం అవుతున్నాయి.

– అశోక్‌కుమార్, వరద కాలువ, ఎస్ఈ, జగిత్యాల

'హైబ్రిడ్ వర్క్'కే జై

భారత్ ఉద్యోగుల సంతృప్తి

- ఈ విధానంలో వారానికి రెండు, మూడు రోజులు ఆఫీస్ లేదా ఇంటినుంచి పని
- విదేశాలతో పోల్చితే భారత్‌లోనే ఇది అధికం
- గతంకన్నా కార్యాలయానికి వెళ్లి పనిచేసే గంటల పెరుగుదల
- 'ఫ్రం రిస్ట్రిక్షన్స్ టు రిసైలెన్స్'యూనీస్పేస్ గ్లోబల్ వర్క్‌ప్లేస్ ఇన్‌సైట్స్ 2024-25 నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: భారత ఉద్యోగుల్లో అత్యధిక శాతం మంది 'హైబ్రిడ్ పని విధానం'పై అత్యంత సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హైబ్రిడ్ వర్క్ విధానంలో వారానికి రెండు, మూడురోజులు ఆఫీస్ లేదా ఇంటి నుంచి పనిచేసేందుకు అనువైన పద్ధతిని ఎంచుకునే అవకాశం సంస్థలు, యాజమాన్యాలు తమకే కల్పించడంపై వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు కార్యాలయానికి వెళ్లి పనిచేసినపుడు లేదా ఇంటి నుంచి పనిచేస్తున్నపుడు వారానికి చేసే పనిగంటలు ఎంచుకునే స్వేచ్ఛ కూడా తమకు ఉండడంపై వారిలో సానుకూల దృక్పథం వ్యక్తమౌతోంది. ఇది 'ఫ్రం రిస్ట్రిక్షన్స్ టు రిసైలెన్స్'పేరిట యూనీస్పేస్ నిర్వహించిన గ్లోబల్ వర్క్‌ప్లేస్ ఈన్‌సైట్స్ 2024–25 నివేదికలో వెల్లడైంది. ప్రపంచవ్యాప్తంగా 13 దేశాల్లోని 10,700 మంది ఎంప్లాయీస్, ఎంప్లాయర్స్ నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ నివేదికను సిద్ధం చేశారు. భారత్‌లోని 97 శాతం ఉద్యోగులు, 98 శాతం యాజమాన్యాలు హైబ్రిడ్ వర్కింగ్ అరేంజ్‌మెంట్‌పై పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశాయి. అదే గ్లోబల్ యావరేజ్ చూస్తే.. 87 శాతం ఉద్యోగులు, 95 శాతం ఎంప్లాయర్స్‌గా ఉండటంతో.. విదేశాల్లో కంటే కూడా భారత్‌లోనే ఈ పనివిధానానికి అత్యధిక సంఖ్యలో సై అంటున్నట్టు స్పష్టమైంది. గతేడాది గణాంకాలతో పోల్చి చూస్తే ఈ విషయంలో గణనీయమైన మార్పు నమోదైనట్టు తెలుస్తోంది. గతేడాది.. ఇంటి నుంచే పనిచేయాలని భావించినప్పుడు వచ్చే వేతనంలో కోత పడినా పరవాలేదనే అభిప్రాయాన్ని 31 శాతం భారతీయులు వ్యక్తం చేశారు (ఇది ప్రపంచదేశాల స్థాయితో పోల్చితే రెండింతలుగా ఉంది). హైబ్రిడ్ వర్క్ విధానంతో గతంతో పోల్చితే.. కార్యాలయానికి వారంలో వెళ్లి పనిచేసే గంటల పెరుగుదల నమోదైనట్టు గుర్తించారు. కార్యాలయాలకు వచ్చేందుకు మొదట్లో అంతగా ఉత్సాహం చూపనివారు సైతం.. ఇప్పుడు ఉత్సుకతను వ్యక్తం చేస్తున్నట్టు తేలింది. కొత్త ఆలోచనలు పంచుకోవడానికి, ఉత్పాదకతను పెంచడానికి కార్యాలయాలకు వెళ్లి పనిచేయడం ఉపకరిస్తున్నట్టుగా ఈ అధ్యయనంలో వెల్లడైంది. దీంతో మూడు, నాలుగేళ్లలో 'వర్క్ ఫ్రం హోం'విధానంలోనే పనిచేయాలనే మొండి పట్టుదలతో ఉన్న వారు సైతం హైబ్రిడ్ పద్ధతిని ఎంచుకునేందుకు సంసిద్ధతను వ్యక్తం చేస్తున్నట్టు తెలుస్తోంది.



కార్యాలయానికి వస్తే..

- వారంలో మూడు రోజులు కార్యాలయానికి వచ్చి పని చేస్తే.. మిత్రులు, సహోద్యోగులను ముఖాముఖి కలుసుకోవడం, పనికి సంబంధించి ఏవైనా ఆలోచనలు పరస్పరం పంచుకోవడం వంటి వాటిలో మార్పు కనిపిస్తున్నట్టు గుర్తించారు
- కార్యాలయాల్లో నిశ్శబ్ద వాతావరణం కొనసాగేలా, అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా (డెడ్ లైన్) అనువైన వాతావరణం కల్పించాలని యాజమాన్యాలు భావిస్తున్నాయి
- కార్యాలయాలకు వచ్చి పనిచేసేలా రవాణా చార్జీల చెల్లింపు వంటి పారితోషికాలు ఉపయోగపడుతున్నాయి
- ఉద్యోగులను కార్యాలయాలకు రప్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు, డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఉచితంగా పానీయాలు, కాఫీ, స్నాక్స్ వంటివి దోహదపడుతున్నాయి.
- ఒత్తిళ్ల నుంచి ఉపశమనానికి చర్యలు, ఆరోగ్యవంతమైన వాతావరణం, సాంకేతికంగా మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన వంటివి కార్యాలయాలకు ఉద్యోగులను ఆకర్షించేందుకు సహాయపడుతున్నాయి.

నివేదికలో ఇంకా ఏముందంటే..

- తమ ఉత్పాదకతను, కమ్యూనికేషన్స్ పెంచడానికి వర్క్‌ప్లేస్ టెక్నాలజీ, సౌకర్యాలు ఉపయోగపడుతున్నట్టు 87 శాతం ఉద్యోగులు, 80 శాతం ఎంప్లాయర్స్ అభిప్రాయపడ్డారు
- ఇంటి నుంచి కార్యాలయం తక్కువ దూరంలో ఉండాలని, ఈ ప్రయాణం సాఫీగా సాగాలని కోరుకుంటున్నవారు 91 శాతం మంది
- ఉచిత స్నాక్స్, కాఫీ, తినుబండారాలు, ఉచిత పానీయాలు వంటి వాటిపై 94 శాతం ఉద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు
- కోరుకున్న సమయాల్లో పనిచేసేందుకు అనుమతించాలని 48 శాతం ఉద్యోగులు కోరుతున్నారు.

యాదాద్రిలో భక్తుల రదీ

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు రోజు కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపం, పుష్కరిణి, కల్యాణ కట్ట ప్రాంతాలు కిటకిటలాడాయి. ధర్మ దర్శనానికి 3 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. సుమారు 35వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.23,91,215 వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.


ఆలయ క్యూకాంప్లెక్స్‌లో భక్తులు

తగ్గేదేలే..!

- గంటల వ్యవధిలోనే పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై మావోయిస్టుల దాడి యత్నం
- ఉనికి చాటేందుకు మావోయిస్టులు ప్రయత్నాలు
- రాకెట్ లాంచర్లతో కవ్వింపు చర్యలపై భద్రతా బలగాల్లో చర్చ

మావోయిస్టుల ఉనికి లేదన్న డీజీపీ జితేందర్

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణలో మావోయిస్టుల ప్రభావం లేదు. పోలీసుల పట్టు కొనసాగుతోంది. మావోయిస్టులు తమ ఉనికి చాటుకునేందుకు కొన్నిసార్లు తెలంగాణ ప్రాంతంలోకి వచ్చినా.. పోలీసు బలగాలు గట్టిగా తిప్పికొడుతున్నాయి'.. ఈనెల 24న విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్ చేసిన వ్యాఖ్యలివి. డీజీపీ ఆ ప్రకటన చేసిన గంటల వ్యవధిలోనే.. మావోయిస్టులు తమ ఉనికి చాటుకునే ప్రయత్నం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం పూసుగుప్పలోని సీఆర్‌పీఎఫ్ క్యాంప్‌పై బుధవారం రాత్రి 7 గంటల నుంచి మావోయిస్టులు దాడికి ప్రయత్నించారు. రాకెట్ లాంచర్లు విసురుతూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. దాదాపు 200 మందికి పైగా మావోయిస్టులు ఈ ఘటనల్లో పాల్గొనడం, ఏకంగా బేస్‌క్యాంపుపైనే రాకెట్ లాంచర్లు విసురుతూ రెచ్చగొట్టడం భద్రతా బలగాల్లోనూ చర్చకు దారి తీసింది. తమ వైపు ఎలాంటి ప్రాణ నష్టం లేకపోయినా.. మావోయిస్టుల చర్యల్ని తీవ్రంగా పరిగణించిన పోలీసు బలగాలు.. వారి కోసం గాలింపు ముమ్మరం చేశాయి. కాగా, ఇటీవల వరుస ఎదురు దెబ్బలతో తెలంగాణలో వెనక్కి తగ్గిన మావోయిస్టులు.. తిరిగి పట్టు సాధించేందుకు విఫల యత్నాలు చేస్తున్నారన్న సంకేతాలు ఈ దాడి ద్వారా పంపినట్లయింది.



కొనసాగుతున్న ఏరివేత

మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా ఎన్‌కౌంటర్లలో మృతి చెందుతున్నారు. అదే సమయంలో మావోయిస్టుల కీలక ప్రాంతాల్లో ఆపరేషన్ కగార్ పేరిట కేంద్ర సాయుధ బలగాలు, పోలీసుల ఆధ్వర్యంలో మావోయిస్టుల ఏరివేత ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ ఏడాది మొదటి ఆరు నెలల్లో మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 100 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు. ఇప్పటి వరకు సుమారు 300 మంది వరకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. సుమారు 250 మంది వరకు మావోయిస్టుల్ని పోలీసులు అరెస్ట్ చేసి పెద్ద మొత్తంలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ సరిహద్దుల్లోనూ ఇటీవలే పెద్ద ఎన్‌కౌంటర్ జరిగింది. కర్కగూడెం గ్రామానికి అతి సమీపంలో కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసు బృందాలకు.. తారసపడిన బీఏ-ఏఎస్ఆర్ డివిజన్ కమిటీకి చెందిన ఆరుగురిని హతమార్చారు. మరోవైపు మావోయిస్టులకు అత్యంత పట్టున్న కాంకేర్, కొండగావ్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, నారాయణపూర్, బస్తర్, బీజాపూర్, దంతెవాడ, సుక్మా జిల్లాల్లోనూ వరుస ఎన్‌కౌంటర్లలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసులు మావోయిస్టులపై పట్టు సాధిస్తూ వస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ వైపు ఒత్తిడి పెరగడంతో తెలంగాణలోకి ప్రవేశించేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ ప్రయత్నాలను తెలంగాణ గ్రేహౌండ్స్, టీజీఎస్పీ, స్థానిక పోలీసు బలగాలు తిప్పికొడుతున్నాయి. ఈ సమయంలో ఒకేసారి భారీ సంఖ్యలో మావోయిస్టులు పోలీస్ బేస్ క్యాంపును లక్ష్యంగా చేసుకోవడాన్ని పోలీస్ ఉన్నతాధికారులు సైతం సవాల్‌గా తీసుకున్నట్టు తెలిసింది. తెలంగాణలో మావోయిస్టుల కదలికల్లేకుండా చేయడంలో ఇప్పటి వరకు తమకున్న పట్టు నిలుపుకొనేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్నారు.

ఇంకా 'మీన'మేషాలే ?

- చేపపిల్లల ఉచిత పంపిణీకి ఎదురుచూస్తున్న మత్స్యకారులు
- ఇప్పటివరకు 17 జిల్లాల టెండర్లే ఖరారు




సాక్షి,హైదరాబాద్ : చేపపిల్లల ఉచిత పంపిణీకి ఇంకా గ్రహణం వీడడం లేదు. ఈ ఏడాది భారీవర్షాలతో దాదాపు అన్ని చెరువులు, రిజర్వాయర్లు, ప్రాజెక్టులు, కుంటలు నిండాయి. చేపపిల్లల పంపిణీపై ప్రభుత్వం ముందస్తుగా టెండర్లు వేయకపోవడం, దానిపై ప్రణాళిక లేకపోవడంతో చేపపిల్లలు లేక జలాశయాలు కళతప్పాయి. వర్షాలు కురుస్తున్న సమయంలోనే పోస్తేనే చేపపిల్లలు ఆరోగ్యంగా, ఇప్పటివరకు ఒక సైజుకు వచ్చేవే. ఆలస్యంగా వదిలే చేప పిల్లలు సోమిడిపట్టి (బక్కచిక్కి) ఉంటాయి. వాటికి సరైన ధర రాకపోగా, మత్స్య ప్రియులు ఇష్టపడరు. ఇలాంటి చేపలకు మార్కెట్‌లో అనుకున్న ధర కూడా రాదు. మార్కెట్‌కు తీసుకెళ్లిన మత్స్యకారులు ఆశించిన ధర రాకపోవడంతో చేపలు పట్టే కూలీ, ఇతర ఖర్చులు, రావాల్సిన లాభం రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈ ఏడాది 85 కోట్ల చేప పిల్లలు పోయాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా టెండర్లు ఆహ్వానించింది. అయితే సకాలంలో టెండర్లు వేయకపోవడం, మరోవైపు కాంట్రాక్టర్లు అంతా ఏకమై ధర పెంచాలని డిమాండ్ చేయడం, కాంట్రాక్టర్ల డిమాండ్, చేపపిల్లల పంపిణీపై ఒక అడుగు ముందుకు పడే సరికి ఆగస్టు మూడోవారం అయ్యింది. సెప్టెంబర్ చివరివారం దగ్గర పడుతున్నా... ప్రభుత్వ అలసత్వం చూస్తుంటే ఈ ఏడాది ఉచితంగా చేప పిల్లలు ఇస్తారా లేదా అన్న సందేహంలో మత్స్యకారులు ఉన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఉచిత చేపపిల్లలు ఇవ్వకుంటే గతంలో మాదిరిగా ఆయా సొసైటీలే చేప పిల్లలను సమకూర్చుకొని, ఇష్టం వచ్చిన రకాలు పోసుకుంటామని మత్స్యకారులు అంటున్నారు.

ఆగస్టులో టెండర్ల ప్రక్రియ పూర్తయినా..

ఆగస్టు 3న టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. అయితే వాటి వెరిఫికేషన్‌లో రెవెన్యూ, మత్స్యశాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటివరకు కేవలం 17 జిల్లాలకు మాత్రమే టెండర్లు ఖరారు అయినట్టు తెలిసింది. ఇక మిగతా జిల్లాలకు ఎప్పటివరకు పూర్తి చేస్తారు ? టెండర్‌దారులు చేపపిల్లలను ఎప్పటిలోగా సమకూర్చుకుంటారు? ఎప్పటిలోగా చెరువుల్లో వదులుతారనేది మాత్రం పెద్ద ప్రశ్నగా మారింది.

నిశీధిలో ఉషోదయం



చీకట్లను చీల్చుతూ భానుని తొలికిరణం నేలను ముద్దాడుతుంటే..
ఆ మధ్య మనోహర దృశ్యం వర్ణనాతీతం. అనంతపురం పరిసరాల్లో ఆదివారం ఉదయం
సాక్షి కెమెరాకు చిక్కిన సూర్యోదయ దృశ్యం

ఆత్మవిశ్వాసమే తోడుగా..



కేన్సర్‌ను జయించింది, వైకల్యాన్ని అధిగమించింది. ఆత్మవిశ్వాసమే పెట్టుబడిగా ఈత కొలనులో బంగారు చేపలా నిలుస్తోంది. విశాఖ నగరం మధురవాడకు చెందిన నిధి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో స్విమ్మింగ్ పోటీల్లో జాతీయ స్థాయిలో పలు పతకాలు సాధించింది. విశాఖలో నిర్వహిస్తున్న పారా స్విమ్మింగ్ పోటీల సందర్భంగా తీసిన చిత్రం

సమరానికి సై



విశాఖ కళాభారతి ఆడిటోరియంలో వైశాఖి నృత్యోత్సవాల్లో భాగంగా ఆదివారం పైకా జానపద నృత్యం ప్రదర్శిస్తున్న ఒడిశాకు చెందిన కళింగ పైకా క్రియేషన్ బృందం

క్లుప్తంగా...

ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించాలి: ఆర్జేయూపీ

సాక్షి, అమరావతి : ప్రభుత్వ ఉద్యోగులకు ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు ఆరు నెలలకు సంబంధించి కరువు భత్యం ప్రకటించాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్(ఆర్జేయూపీ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. నిర్దేశిత గడువు దాటి మూడు నెలలు పూర్తయినా ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదని పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ఎం.వీరబ్రహ్మం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఏపీ జీఎల్ఐ, పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పీఆర్సీ గతేడాది జూలై నుంచి అమలు చేయాలని, ఉద్యోగులకు నష్టం లేకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

క్రికెట్ అభివృద్ధికి సహకరించాలి

సాక్షి, అమరావతి: ఆంధ్రాలో క్రికెట్ అభివృద్ధికి సహకరించాలని బీసీసీఐ అధ్యక్ష, కార్యదర్శులు రోజర్ బిన్నీ, జైషాలకు విజయవాడ ఎంపీ, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు. ఆదివారం బెంగళూరులో బీసీసీఐ నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి శివనాథ్ హాజరయ్యారు. దేశీయ క్రికెట్ బలోపేతం కోసం బీసీసీఐ తీసుకుంటున్న చర్యలపై అభినందనలు తెలిపారు. ఏపీలో ప్రతిభగల క్రీడాకారులను వెలికితీయడంతో పాటు కొత్త క్రికెట్ స్టేడియాల నిర్మాణానికి సహకరించాలని కోరారు.

షెడ్యూల్డ్ ప్రాంతంలో సర్వాధికారాలు ఆదివాసీలకే

దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర సలహాదారు చెండా కేశ్వరరావు

చింతపల్లి: షెడ్యూల్డ్ ప్రాంతాల్లో సర్వాధికారాలు ఆదివాసీలకే ఉండాలని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర సలహాదారు డాక్టర్ చెండా కేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎఅల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దండకారణ్య ఉద్యోగుల సమితి (డీఈవో) రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ఆదివాసీల సంక్షేమం, అభివృద్ధి కోసం ఐదు, ఆరు షెడ్యూళ్లు పొందుపర్చడం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశ గిరిజన ప్రాంతాలు ఐదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయన్నారు. ఆదివాసీల కోసం రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులు, చట్టాలు షెడ్యూల్ ప్రాంతాల్లో పాలకులు, అధికారులు సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రధానంగా భూ బదలాయింపు 1/70 చట్టం గిరిజన ప్రాంతలో భూములపై సర్వాధికారాలు ఆదివాసీలకు మాత్రమే ఉంటాయన్నారు. మాజీ అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం మాట్లాడుతూ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో స్వపరిపాలన ఉండాలన్నారు.

నిస్తేజంలో ఏపీపీఎస్సీ..


నైరాశ్యంలో అభ్యర్థులు!

ఏపీపీఎస్సీని నిరర్థకంగా మార్చిన చంద్రబాబు ప్రభుత్వం

ఉన్న చైర్మన్, సభ్యులు కుట్రపూరితంగా తొలగింపు

- 3 నెలలుగా కమిషన్ చైర్మన్‌ను నియమించకుండా నిర్లక్ష్యం
- నిలిచిపోయిన ఉద్యోగ నియామకాలు... పెండింగ్‌లో 21 నోటిఫికేషన్లు
- పరీక్షల తేదీలు ప్రకటించని సర్వీస్ కమిషన్
- దీర్ఘకాలం శిక్షణతో ఆర్థికంగా నష్టపోతున్నామని అభ్యర్థుల ఆందోళన
- వాయిదా అవకాశాన్ని సొమ్ము చేసుకుంటున్న శిక్షణ సంస్థలు





సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోంది. సీఎం చంద్రబాబు తన రాజయకీయాలకు నిరుద్యోగ యువతను బలిచేస్తున్నారు. బాబు ప్రభుత్వ నిర్వాకంతో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిరర్థకంగా మారిపోయింది. కమిషన్‌కు చైర్మన్ కూడా లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగాలకు పరీక్షల నిర్వహణ, ఎంపికలు గందరగోళంలో పడ్డాయి. గతంలోనే ప్రకటించిన నోటిఫికేషన్లకు ఎప్పుడు పరీక్షలు నిర్వహిస్తారో తెలియక నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. మరోపక్క ఇప్పటికే పరీక్షలు పూర్తయ్యి, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి, ఎంపికైన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇవ్వాల్సి ఉన్నా.. అదీ చేయడం లేదు. లక్షల్లో ఉద్యోగాలిస్తాం, జాబ్ కేలండర్ విడుదల చేస్తామని సీఎం, మంత్రుల ప్రకటనలే తప్ప ఒక్క ఉద్యోగమూ ఇచ్చే ప్రయత్నం కూడా చేయడంలేదు. ఏపీపీఎస్సీ ద్వారా ఇవ్వాల్సిన నోటిఫికేషన్లు, పరీక్షల తేదీలపైనా స్పష్టత ఇవ్వడంలేదు. దీనిని అవకాశంగా మార్చుకుంటున్న శిక్షణ సంస్థలు 'వచ్చే నెలలో పరీక్షలు.. స్పెషల్ బ్యాచ్ శిక్షణ' పేరుతో నిరుద్యోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసుకుంటున్నాయి.

మూడు నెలలుగా చైర్మన్ పదవి ఖాళీ

సర్వీస్ కమిషన్ నిబంధనల ప్రకారం ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, పరీక్షల తేదీల ప్రకటన, పోస్టింగ్స్.. ఇలా దేనికైనా చైర్మన్ అనుమతి తప్పనిసరి. అయితే, ఈ ఏడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి ప్రభుత్వం రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న సర్వీస్ కమిషన్ చైర్మన్‌పై కుట్రకు తెరతీసింది. 2025 జూలై వరకు పదవిలో ఉండాల్సిన చైర్మన్‌పైన, సభ్యులపైన వేధింపులకు దిగి, చివరికి తొలగించింది. నిబంధనల ప్రకారం సర్వీస్ కమిషన్ చైర్మన్ ఏదైనా కారణాలతో అందుబాటులో లేకున్నా, లేదా ఆ పోస్టు ఖాళీ అయినా ఆ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి కొత్త చైర్మన్ వచ్చే వరకు ఆ బాధ్యతలను సభ్యుల్లో ఒకరికి అప్పగించాలి. కానీ ఏపీపీఎస్సీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గత మూడు నెలలుగా చైర్మన్‌ను నియమించకుండా కమిషన్‌ను ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఏపీపీఎస్సీకి ఇన్ని రోజులు చైర్మన్ లేకపోవడం ఇదే తొలిసారని అధికారవర్గాలు చెబుతున్నాయి. చైర్మన్ లేకపోవడంతో గతంలో ఇచ్చిన 21 నోటిఫికేషన్లకు పరీక్షల తేదీలను ప్రకటించలేదు. కీలకమైన గ్రూప్–1, 2 పోస్టులకు నిర్వహించాల్సిన మెయిన్స్ వాయిదా వేశారు. దీంతో 8 లక్షల మందికి పైగా యువత భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది.

వైఎస్ జగన్ ప్రభుత్వ చిత్తశుద్ధి
బాబు సర్కారుకేదీ?

వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఏపీపీఎస్సీ ద్వారా క్రమం తప్పకుండా నోటిఫికేషన్లు ఇచ్చి, ఉద్యోగాలు భర్తీ చేసింది. ఆ చిత్తశుద్ధి ప్రస్తుత చంద్రబాబు సర్కారులో కనిపించడంలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో సర్వీస్ కమిషన్ నుంచి వచ్చిన అన్ని నోటిఫికేషన్లకు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు జరిగాయి, ఉద్యోగాల భర్తీ పక్కాగా పూర్తి చేశారు. గత ఐదేళ్లలో కమిషన్ ద్వారా అన్ని శాఖల్లోను 78 నోటిఫికేషన్లు ఇచ్చి అర్హత గల ఏ నిరుద్యోగికీ అన్యాయం జరగకుండా 6,296 ఉద్యోగాలను వివాద రహితంగా భర్తీ చేశారు. బాబు ప్రభుత్వం వచ్చాక ఉన్న చైర్మన్‌ను కుట్రపూరితంగా తొలగించడమే కాకుండా, కొత్త చైర్మన్‌ను నియమించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతోందని యువత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వాయిదాలతో అభ్యర్థుల భవిష్యత్‌తో ఆటలు

గతంలో ఇచ్చిన 21 నోటిఫికేషన్లకు షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహించి డిసెంబర్ నాటికి నియామక ప్రక్రియ పూర్తికావాలి. ఇందులో గ్రూప్–2, గ్రూప్–1, డీవైఈవో, డిగ్రీ, పాలిటెక్నిక్, జూనియర్ కాలేజీ లెక్చరర్లు, పాఠశాల విద్యాశాఖలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ వంటి కీలకమైనవి 19 నోటిఫికేషన్లు ఉన్నాయి. వీటిలో గ్రూప్–2, గ్రూప్–1తో పాటు డీవైఈవో పోస్టులకు గత ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ ప్రకారం ప్రిలిమ్స్ పరీక్షలు పూర్తి చేసి ఫలితాలను సైతం విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం గ్రూప్–2 మెయిన్స్ జూలైలో జరగాల్సి ఉండగా, వాయిదా వేశారు. ఈ నెలలో జరగాల్సిన గ్రూప్–1 మెయిన్స్ కూడా వాయిదా వేశారు. డీవైఈవో మెయిన్స్ పరిస్థితీ అంతే. ఈ మూడు పరీక్షల మెయిన్స్‌కు అర్హత సాధించిన దాదాపు 1.15 లక్షల మంది అభ్యర్థుల జీవితాలు ఇప్పుడు అగమ్యగోచరంగా మారిపోయాయి. వీటితోపాటు డిగ్రీ, జూనియర్ కాలేజీ, పాలిటెక్నిక్ కాలేజీ లెక్చరర్లతో పాటు వివిధ శాఖల్లో దాదాపు 1,475 పోస్టులకు పరీక్షల షెడ్యూల్ కూడా ఇవ్వలేదు. ఆయుష్ విభాగంలో హోమియో మెడికల్ ఆఫీసర్ల పోస్టులకు జూలైలనే సర్టిఫికెట్ల పరిశీలన కూడా పూర్తయినా, చైర్మన్ లేకపోవడంతో ఇప్పటికీ నియామకపత్రాలు ఇవ్వలేదు.

కాంట్రాక్ట్ కార్మికుల జోలికొస్తే సహించం

- విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులకు అండగా ఉంటాం
- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు

పెదగంట్యాడ (విశాఖ): స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధి జోలికొస్తే సహించేది లేదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నర్సింగరావు హెచ్చరించారు. స్టీల్ సీఐటీయూ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెల్లిముక్కు వరకూ పాదయాత్ర జరిగింది. అనంతరం బహిరంగ సభలో నర్సింగరావు మాట్లాడుతూ.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై ప్రభుత్వ, యాజమాన్యాల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ఆ నేరాన్ని కాంట్రాక్ట్ కార్మికులపై నెట్టడం సరికాదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులలో విలువైన భూములను ప్లాంట్ కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఉన్నారని, వారి ఉపాధికి గండి కొట్టేందుకు ప్రభుత్వం, యాజమాన్యాలు ప్రయత్నాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచి బీజేపీ ప్రభుత్వానికి వంత పాడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వంపై అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

ఎంపీలు, ఎమ్మెల్యేలు గళం విప్పాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, జిల్లా నాయకుడు జగన్ మాట్లాడుతూ.. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నికల ముందు చేసిన పోరాటాన్ని నమ్మి ఇక్కడి ప్రజానీకం వారికి రాష్ట్రంలోనే మంచి మెజార్టీ ఇచ్చారని వివరించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసే విధంగా ప్రస్తుత పరిణామాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇకనైనా గళం విప్పి కేంద్ర ప్రభుత్వం, ప్లాంట్ యాజమాన్య వైఖరిని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి రామస్వామి మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించడం చేతకాని యాజమాన్యం కార్మికుల సంఖ్యపైన, వారి హక్కులపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం, యాజమాన్యం తమ వైఖరిని మార్చుకుని స్టీల్ ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్, నమ్మి రమణ, ఓటీ రావు, సత్యవతి, పీపీ రమణ, నారాయణరావు, ఆదిరెడ్డి శ్రీను, మసేను, సోమేష్, సుబ్రహ్మణ్యం, శశిభూషణ్, నర్సింగరావు ప్రసంగించారు.

ఆంధ్ర రంజీ కెప్టెన్‌గా రికీబుయ్

విశాఖ స్పోర్ట్స్: రంజీ ట్రోఫీలో ఆడే ఆంధ్ర జట్టుకు రికీబుయ్ మరోసారి నాయకత్వం వహించనున్నాడు. గత రంజీలో టాప్ స్కోరర్‌గా నిలిచిన రికీబుయ్ ఇటీవలే ముగిసిన దులీప్‌ట్రోఫీలో సైతం టాప్ స్కోరర్‌గా నలవడమే కాకుండా రెండు సెంచరీలతో పాటు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు. రంజీ ట్రోఫీలో పాల్గొనే 32 జట్లలో ఎలైట్‌లో నాలుగు గ్రూప్‌లు, ప్లేట్‌లో ఒక గ్రూప్ తలపడనున్నాయి. ఆంధ్ర జట్టు ఎలైట్ బి గ్రూప్‌లో పోటీ పడుతోంది. హైదరాబాద్ జట్టు సైతం ఇదే గ్రూప్‌లో పోటీపడుతోంది. ఈ టోర్నీలో సత్తాచాటిన ఆటగాళ్లను ఇరానీ కప్‌లో ఆడేందుకు అర్హత కల్పించనున్నారు. అక్టోబర్ 11న తొలి మ్యాచ్‌లో విదర్భతో ఆంధ్ర జట్టు ఆడటంతో ట్రోఫీ మొదలవుతుంది. 18న గుజరాత్‌తోనూ, 26న హిమాచల్‌ప్రదేశ్‌తోనూ ఆంధ్ర జట్టు ఆడనుంది. హిమాచల్‌ప్రదేశ్‌తో మ్యాచ్ విశాఖ వేదికగా జరగనుండగా రాజస్థాన్, ఉత్తరాఖండ్ మ్యాచ్‌లు విజయనగరం వేదికగా జరగనున్నాయి. ఆంధ్ర జట్టు నవంబర్ 6న ఉత్తరాఖండ్‌తోనూ, 19న హైదరాబాద్‌తోనూ ఆడనుంది. అనంతరం సయిద్‌ముస్తక్ అలీ, విజయ్ హాజారే ట్రోఫీల్లో ఆడనున్న ఆంధ్ర జట్టు తిరిగి.. రంజీ మ్యాచ్‌ల్లో జనవరి 23వ తేదీన పుదుచ్చేరితోనూ, లీగ్ దశలో చివరిదైన మ్యాచ్ 30న రాజస్థాన్‌తోనూ తలపడనుంది.

ఆంధ్రకు ఎంపికైంది వీరే..

ఆంధ్ర జట్టుకు రికీబుయ్ నాయకత్వం వహించనుండగా వైస్ కెప్టెన్‌గా షేక్ రషీద్, వికెట్ కీపర్‌గా కె.ఎస్.భరత్, హనుమ విహారి, నితీష్‌కుమార్, అశ్విన్ హెబ్బర్, లలిత్‌కుమార్, హేమంత్‌రెడ్డి, మహీష్‌కుమార్, సత్యనారాయణ, అభిషేక్ రెడ్డి, స్టీఫెన్, వంశీకృష్ణ, విజయ్ ఎంపికయ్యారు.

గంజాయి చాకెట్లు అమ్ముతున్న వ్యాపారి అరెస్ట్

అల్లిపురం(విశాఖ): గంజాయి చాక్లెట్లు అమ్ముతున్న పాన్‌షాప్ యజమానిని విశాఖ టూటౌన్ పోలీసులు, టాస్క్ ఫోర్సు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 133 చాక్లెట్లను(660 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. టూ టౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం.. స్ప్రింగ్‌రోడ్డులో ఒక పాన్‌షాప్‌లో గంజాయి చాక్లెట్లు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు టాస్క్ ఫోర్సు పోలీసులు, టూటౌన్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నిందితుడు మనోజ్‌కుమార్‌ని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్సు ఎస్ఐ భరత్, టూటౌన్ ఎస్ఐ శంకర్‌లను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.



శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణ తేజ అతిథి గృహం వద్దకు చేరింది. శనివారం అర్ధరాత్రి వరకు 71,133 మంది స్వామి వారిని దర్శించుకోగా 34,502 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.28 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అట్టహాసంగా దుర్యోధన వధ

తవణంపల్లె: చిత్తూరు జిల్లా తవణంపల్లె ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో 119వ మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం దుర్యోధన వధ ఘట్టాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ద్రౌపదీదేవి, పాండవుల విగ్రహాలకు అభిషేకం, పూజలు చేశారు. అనంతరం మట్టితో తయారుచేసిన దుర్యోధనుడి బొమ్మ దగ్గరకి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. మడుగులో దాగివున్న దురోధ్యనుడిని బయటకు లాక్కొచ్చి వధించే ఘట్టం ప్రేక్షకులను ఆకట్టుకుంది. దుర్యోధన వధ అనంతరం మట్టి కోసం భక్తులు పోటీ పడ్డారు.

సమన్వయంతో విజయవంతం చేద్దాం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే లక్షలాది మంది భక్తులకు మెరుగైన సేవలందించి, ఉత్సవాలను విజయవంతం చేయడంలో మీడియా సహకారం అవసరమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. దసరా ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మీడియా ప్రతినిధుల సలహాలు సూచనలు స్వీకరించేందుకు ఆదివారం డీసీపీ గౌతమీశాలి, దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామరావు తదితరులతో కలిసి పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీస్, దేవదాయ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



చిల్లకూరు: తిరుపతి జిల్లా చిల్లకూరు తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసి ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం పలు అభిషేకాలు చేపట్టారు.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



పుత్తూరు: తిరుపతి జిల్లా వడమాలపేట మండలం అప్పలాయగుంటలో వెలసిన టీటీడీ అనుబంధ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామికి శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు

పెదవేగి : ఏలూరు జిల్లా పెదవేగి మండలం రాట్నాల కుంటలో వేంచేసి ఉన్న శ్రీ రాట్నాలమ్మ అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు తరలివచ్చారు.

వైభవంగా శాంతి కల్యాణం



సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో బహుళ ద్వాదశి సందర్భంగా స్వామి వారి శాంతి కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి


అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి ఆలయానికి ఆదివారం వేలాదిగా భక్తులు విచ్చేశారు. భక్తులంతా సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించారు. స్వామివారి వ్రతాలు 1,500 నిర్వహించారు.

ఉత్సాహంగా 5కే వాక్‌థాన్



వాక్‌థాన్‌లో ఎన్ఎస్ఎస్‌యూ వలంటీర్లు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా తిరుపతిలో ఓ ప్రవేటు హాస్పిటల్ వారు నిర్వహించిన 5కే వాకథాన్‌లో 300 మంది వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు సమాజ సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు.



6 నుంచి ఏపీటీఎఫ్ మహాసభలు



చిత్తూరు కలెక్టరేట్ : విజయనగరంలో అక్టోబర్ 6 నుంచి 8వ తేదీ వరకు ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి చెంగల్‌రాయ మండడి తెలిపారు. ఆదివారం బాపు బాలభవన్ లో రాష్ట్ర మహా సభ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభకు పెద్దసంఖ్యలో టీచర్లు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కిరణ్ కుమార్, చిట్టిబాబు పాల్గొన్నారు.

ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఇక్బాల్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని సాలే నాగయ్య నగరపాలక ఉర్దూ ఉన్నత పాఠశాలలో రూట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉర్దూ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ ఉర్దూ డీఎస్సీ నిర్వహించి ఖాళీలన్నింటిని భర్తీ చేయాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సిరాజుద్దీన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉర్దూ మీడియం సబ్జెక్టులు, లాంగ్వేజ్, ఎస్‌జీటీ ఉపాధ్యాయుల స్కూలు కాంప్లెక్స్ సమావేశాలను యధావిధిగా పాత స్కూల్ కాంప్లెక్స్ పద్ధతిలోనే కొనసాగించాలన్నారు.







రిషికేశ్ కంప్లీట్ టూర్

అక్టోబర్ వస్తోంది. దసరా సెలవులు వస్తాయి. కాలేజ్, ఉద్యోగం స్ట్రెస్ నుంచి రిలీఫ్ కోసం ఎటైనా టూర్‌కెళ్తే బావుణ్ననిపిస్తుంది. ఈ సీజన్‌లో మనదేశంలో ఏ ప్లేస్ బెస్ట్ అంటే ముందు రిషికేశ్‌ని గుర్తు చేసుకోవాలి.

రిషికేశ్ టూర్ అంటే అట్లా ఇట్లా ఉండదు. ఒక అడ్వెంచరస్ టూర్, ఒక తీర్థయాత్ర, ఒక హనీమూన్ వెకేషన్, ఓ తథాత్మ్యత... అన్నీ కలిపిన తీర్థం, క్షేత్రం ఇది. గంగోత్రి నుంచి గంగానది కొండ వాలుల మధ్య ప్రవహిస్తూ నేల మీదకు వచ్చే వరకు ప్రవాహం చాలా ఉధృతంగా ఉంటుంది. గంగోత్రి నుంచి రిషికేశ్‌కు 250 కిమీల దూరం ఉంటుంది. రిషికేశ్ పట్టణం సముద్రమట్టానికి పదకొండు వందల నుంచి పదిహేడు వందల అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది. రిషికేశ్ వరకు గంగానది ఎక్కువ వెడల్పు లేకుండా పాయలాగ వేగంగా ప్రవహిస్తూ ఆకాశం నుంచి దూకుతున్నట్లే ఉంటుంది. అక్కడి నుంచి పాతిక కిలోమీటర్ల దూరాన ఉన్న హరిద్వార్ వరకు ప్రవాహం విశాలమవుతూ, పరుగు వేగం తగ్గుతుంటుంది. గంగానది కలుషితం కావడం హరిద్వార్ దగ్గర నుంచే మొదలవుతుంది. కాబట్టి అంతకంటే పైన రిషికేశ్ దగ్గర గంగా స్నానం చేయాలనుకుంటారు ఎక్కువ మంది. యువత అయితే గంగానదితోపాటు ఒక్క ఉదుటున భూమ్మీదకు దూకడం కోసం రిషికేశ్‌కు ఇరవై కిలోమీటర్ల పైకి వెళ్లి అక్కడి నుంచి రాఫ్టింగ్ మొదలు పెడతారు. రిషికేశ్‌లో రివర్‌రాఫ్టింగ్ నిర్వహించే సంస్థలు ప్రతి వీధిలోనూ కనిపిస్తాయి. బంగీ జంప్, ఫ్లయింగ్ ఫాక్స్ కూడా చేయవచ్చు. నగరం ఎంత ఇరుకుగా ఉంటుందో నది తీరాన గుడారాల్లో క్యాంపింగ్ కూడా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ కార్పొరేట్ విద్యా సంస్థలు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో కనిపిస్తాయి.

లక్ష్మణ్ ఝూలా

గంగానది ఈ ఒడ్డు నుంచి ఆ ఒడ్డుకు చేరడానికి సస్పెన్షన్ బ్రిడ్జి ఉంది. దాని పేరు లక్ష్మణ్ ఝూలా. రామాయణ కాలంలో రాముడు, లక్ష్మణుడు, సీత కొంతకాలం ఇక్కడ నివసించారని చెబుతారు. సీత నది దాటడం కోసం లక్ష్మణుడు అడవి చెట్ల తీగలతో వంతెనను అల్లాడని, దాని పేరే లక్ష్మణ్ ఝూలా అని చెబుతారు. రిషికేశ్‌కు మరికొంత దూరంలో రామ్ ఝూలా ఉంది. అది రాముడు అల్లిన తీగల వంతెన. ఈ రెండు వంతెనలు నది దాటడానికి అనువుగా ఉండేవి. కాలక్రమంలో ఆ వంతెనల స్థానంలోనే ఇనుప వంతెనలు నిర్మాణం జరిగింది. పర్యాటకులు లక్ష్మణ్ ఝూలా మీద నుంచి అవతలి తీరానికి చేరి అక్కడి నుంచి పడవలో విహరిస్తూ ఇవతలి ఒడ్డుకు రావచ్చు. పడవలో మెల్లగా సాగుతూ ఒక ఒడ్డున మనుషులను, మరో ఒడ్డునున్న ఎత్తైన కొండలను, కొండవాలులో, నది తీరాన ఉన్న నిర్మాణాలను చూస్తూ ఉంటే ఒక్కసారిగా తుళ్లింతలతో యువకులు రివర్ రాఫ్టింగ్ చేస్తూ దూసుకొస్తారు. నదిలో బోట్ షికార్ టికెట్ల మీద ప్రభుత్వ నిఘా పెద్దగా ఉండదు. ప్రైవేట్ బోట్‌ల వాళ్లు ఒక్క ట్రిప్‌కి వేలల్లో అడుగుతారు. పెద్ద బోట్‌లలో వెళ్లడమే శ్రేయస్కరం. గంగ పరవళ్లు తొక్కుతుంటుంది. చిన్న పిల్లలతో వెళ్లిన వాళ్లు చాలా జాగ్రత్తగా ఉండాలి.

యోగా క్యాపిటల్

రిషికేశ్, హరిద్వార్ రెండూ నేషనల్ హెరిటేజ్ సిటీలు. కేరళలో ఉన్నట్లే ఆయుర్వేద వైద్యం, పంచకర్మ చికిత్స కేంద్రాలుంటాయి. హిమాలయాల నుంచి సేకరించిన ఔషధ మొక్కలతో వైద్యం చేస్తారు. రిషికేశ్‌లో ఏటా యోగా, మెడిటేషన్ సెషన్‌లు జరుగుతాయి. భారత ప్రధాని కూడా రిషికేశ్ పర్యటన సందర్భంగా పట్టణంలోని ఒక గుహలో ధ్యానం చేశారు. భవబంధాలను వదిలి మోక్షసాధన కోసం జీవితంలో అంత్యకాలాన్ని ఇక్కడ గడపడానికి వచ్చేవాళ్లు కూడా ఉంటారు. రోజూ సాయంత్రం గంగాహారతి కనువిందు చేస్తుంది. నది మధ్యలో ధ్యానముద్రలో ఉన్న ఈశ్వరుని విగ్రహాన్ని చూడడానికి దగ్గరకు వెళ్లడం కంటే ఒడ్డున ఘాట్ నుంచి చూస్తేనే శిల్పసౌందర్యాన్ని ఆస్వాదించగలుగుతాం. ఉత్తరాఖండ్ వర్షాకాలం వరదల బారిన పడుతుంటుంది. కానీ ఆ రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరు టూరిజమే. కాబట్టి సీజన్ వచ్చే సరికి టూరిస్టుల కోసం సిద్ధమైపోతుంది. అన్నట్లు ఈ టూర్ గుర్తుగా రుద్రాక్ష తెచ్చుకోవడం మర్చిపోవద్దు. మన దగ్గర జామచెట్లు ఉన్నట్లు ఎక్కడ చూసినా రుద్రాక్ష చెట్లే.

- వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి


బాపూజీ ఇంటిని చూద్దాం

